గద్యపద్యసంగ్రహము

కడప మ్యునిసిపలు హైస్కూలునం దాంధ్రపండితులగు

కావ్యపురాణతీర్థ విద్వాన్

జనమంచి వేంకటసుబ్రహ్మణ్యశర్మగారిచే

సంగృహీతము.

చెన్నపురి:

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే

ప్రకటితము.

1936.

Printed by
V. VENKATESWARA SASTRULU
of V. RAMASWAMY SASTRULU & SONS,
at the 'VAVILLA' PRESS,
Madras.—1936.

శ్రీ ర స్తు.

శ్రీమదుత్తరరామాయణము

తృతీయాశ్వాసము.

వాలి రావణాసురునిగర్వం బణంచి పరిభవించుట.

శా. దుష్కాంక్షల్ వివరింపఁ గ్రమ్మఱ మదాంధుం డై నృపాల
చ్ఛటా,శుష్కారణ్యదవాగ్ని తేజమున నెచ్చో నైనఁ గ్రీ
డించుచున్, నిష్కారుణ్యమునన్ ధరాజనుల హానిన్ జెం
దఁగాఁ జేయుచున్, గిష్కింధాపురి కొక్కనాఁడు వడి నేఁ
గెన్ వాలితోఁ బోరఁగన్. 1

క. ఏఁగి పురద్వారము బి
ట్టాఁగి నిలిచి తన్నుఁ జూడ నడవిదిరుగుడుల్
మూఁగికొన గగన మట్టిటు
గాఁగ లయాంబుదములీల గర్జించుటయున్. 2

క. ఆరవము విని యశోజిత
తారుఁడు తారుఁ డరుదెంచి దశముఖుఁ గని యే
మీ రావణ నీవచ్చిన
కారణ మెఱిఁగింపు మనిన గర్వమున ననున్. 3

క. వాలి మహాభుజవిక్రమ
శాలి యనఁగ నాలకించి సమరక్రీడా

భీలతఁ జూపఁగ వచ్చితి
నాలస్యం బేల పనుపు మగచర యతనిన్. 4

ఉ. నా విని తారుఁ డిట్లనియె నవ్వుచు నీ విది యేమి వెట్టివే
రావణ వాలితోడ బవరం బొనరింపఁగ నెవ్వఁ డోపుఁ బొ
మ్మీవొకరుండ వేల పరమేశ్వరుఁ డైన నెదిర్చి నిల్వ లేఁ
డీపటు కాతనిం దొడరి యెందఱు నొచ్చిరొ నీవెఱుంగవే.

చ. వనచరనాథునిం దొడర వచ్చినశూరులకీకసావళుల్
గను మదె ప్రోవు లై గిరులకై వడి నున్నవి దానవేంద్ర నీ
వును జను వాలిమీఁదనసువుల్ భరియింపఁగనొల్లవేని నా
యనయిపుడేఁగినాఁడుచతురబ్ధులస్నానము లాచరింపఁగన్.

వ. అని యంత నిలువక. 7

సీ. మహితాహిగుణవేష్ట్యమానోరుమంథాన
మహీధరోన్మథితోర్మిమాలి వాలి
మాయావిముఖదైత్యమాయావనప్లోష
కేళిభీషణదావకీలి వాలి
పదఘట్టనోద్భగ్నపాదపాదపశిలో
జ్జ్వల శృంగశతసప్తశైలి వాలి
వజ్రధ్వజోత్తాలవాలవిక్షేపణో
త్పాతితనక్షత్రపాలి వాలి

ఆ. యట్టివాలిఁ దొడరి యమృతంబు ద్రావిన
వారి కైన బ్రదుకవచ్చునొటు
కాదు కూడ దతని కయ్యంబువలె నన్ను
నిపుడె దక్షిణాబ్ధి కేగు మనిన. 3

క. అత్త్రారుని భర్జించుచుఁ
గ్రొత్తలు వింటిమి మతేమి క్రోఁతులపురి నం
చెత్తినమదమున దనుజకు
లోత్తముఁ డాక్షణమ దక్షిణోదధి కరిగెన్. 9

వ. అరిగి తత్ప్రదేశంబున. 10

సీ. అతులితానంతపథాక్రాంతిశాంతుఁ డై
ధరణికి దిగిన మార్తాండుఁ డనఁగ
నుత్తరదిశ మాని యొకవేడుకకు దక్షి
ణాశఁ జేరిన కాంచనాద్రి యనఁగ
ననవరతాంబుపానాయాసమునఁ దీర
మాశ్రయించిన బాడబాగ్ని యనఁగఁ
గరచరణాదికాంగములతోఁ గపిరూపు
దాల్చినయామ్యప్రతాప మనఁగ
తే. దుర్నిరీక్ష్యప్రభావంబుతో నుదగ్ర
తనువుతోఁ గిలికాభీలతరలవాల
వల్లితో శోణముఖవైభవంబుతో న
వంధ్యగతి సంధ్యవార్చు నవ్వాలిఁ గనియె. 11

మ. కని శాఖామృగమాత్రుఁ గాఁ దలఁచి రక్షస్స్వామి య
య్యింద్రపు,త్త్రుని వంచించి గ్రహింప నెంచి తనమంత్రుల్
దవ్వునన్ నిల్చి క,న్గొనఁ దా నొక్కఁడ పుష్పకంబు డిగి
యందున్ సద్దు గా కుండ నొ,య్యనఁ బాదంబుల వెట్టు
చున్ వెనుక యై యంతంత నేతేరఁగన్. 12

చ. పదములచప్పు డింత చెవిఁ బాఱినఁ గన్నులు విచ్చి వాలిగన్
తుదలనె వానిఁ గన్గొని ననుం గపటంబునఁ బొంచి పొంచిప

ట్టైద నని రావణుండు నిగిడెఁ వడి వీనిభుజాంతరంబునఁ
బొదివిచతుఃపయోధులనుముంచెదనంచుజపించుచున్న డన్.

మ. చరణాగ్రంబులఁ దిన్నగా నడిచిపశ్చాద్భాగముఁ జేరియా
శరుఁడుఁ మస్తము లోరఁ జేసికొని హస్తంబుల్ పయిఁ
జాఁచినఁ, హరి దంతిఁ గ్రహియించునట్లు ప్రబలుం
డవ్వాలి బల్పుండిటఁ, శిరముల్ ప్రక్కలు బాహుపంక్తు
లిఱికించెఁ జండసత్త్వంబునన్. 14

ఉ. ప్రక్కలఁజక్కగానదిమిబాహుశిరఃప్రముఖాఖిలాంగముల్
మిక్కిలి నొవ్వఁ జేయుచు నమేయబలంబున వాలిమింటికిఁ
గ్రక్కననుద్గమించెఁ దనుఁ గన్గొని వేల్పులు సిద్ధసాధ్యుల
మ్మక్కమహాపరాక్రమసమగ్రుఁడితండని సంస్తుతింపఁగన్.15

ఆ. ఇటుల యుద్గమించి యింద్రునిగారాబు
పట్టి చిలువ నొడిసి పట్టి పఱచు
పన్నగారిదారిఁ బశ్చిమాంబుధిఁ జేర
నరుగ నంతలోన నద్భుతముగ. 16

శా.ఆకాశంబున కడ్డ మేగినప్రహస్తాద్యాసురామాత్యుల
ప్పాకారిప్రియసూతివాలజనితప్రత్యగ్రజంఝానిలో
ద్రేకం బోర్వక తూలికల్ చెదరురీతిఁ మేఘముల్ విచ్చిచీ
కాకై పోయెడుజోకనొచ్చిచనిరాకంపింపసర్వాంగముల్.

క. తోయదముఁ గొనిపోయెడు
వాయువువలె వాలి పంక్తివదను నిటుల కొం
పోయి వడిఁ బశ్చిమాంబుధి
తోయముల మునింగి నియమధూర్వహమతి యై. 18

చ. ఇరవుగ నప్పయోధిఘటియింపఁగలట్టిక్రియల్ ఘటించి యు
త్తరజలరాశికిన్ జని యథావిధిఁ దానముఁ జేసి పంక్తికం
ధరు నలవోక సందిటను దాల్చియె తూరుపువార్ధిఁ జేరియం
దురుజపనిష్ఠ లెల్ల నియమోన్నతిఁ దీఱిచి యివ్విధంబునన్.

మ. కృతకృత్యుం డయి యింద్రనందనుఁడు కిష్కింధాపురో
ద్యానపద్ధతిఁ బ్రాపించి భుజాంతరంబున మహాదైన్యంబు
తో ప్రేలున ద్దితిజాధీశ్వరు నందు వైచి నగుచున్ దేవారి
హా యెప్పు డంచతనిన్ జూడనివానియట్లడుగ వీతాహం
క్రియౌద్ధత్యుఁ డై. 20

మ. తను వాద్యంతము చెమ్మరింప భయగాద్గద్యంబు గాన్పిం
పఁ గన్గొనలన్ బాష్పము లావరింప వడఁకున్ దోడ్తోఁ
ప్రవర్తింప బోరున నిట్టూర్పులు మించ లేచి దనుజేంద్రుం
డంత దాఁ గ్రమ్మఱన్, జననం బొందితి నంచు నెంచి యని
యెన్ శాఖామృగస్వామితోన్. 21

చ. బలియుఁడ వైన నీవె నిరపాయదయాఢ్యుఁడ వైన నీవె ని
శ్చలమతి వైన నీవె విలసద్ధృతి వైనను నీవె కాక నీ
కిల నొకరుండు సాటి యగునే సురనాథకుమార నిన్ను నేఁ
దెలిసితి నేఁడు నిక్కముగఁ దీఱె మదీయమదాంధకారముల్.

శా. కైలాసం బగలించి శంకరునిచే ఖడ్గంబుఁ బ్రాపించి ది
క్పాలశ్రేణిఁ గలంచి మించిన ననున్ గక్షాంతరాళంబునన్
దూలంబున్ బలె వ్రేలఁ జేసితివి నీదోశ్శక్తి మ్రోలన్ వృథా
స్థూలం బయ్యె మదీయశౌర్య మఖిలస్తుత్యప్రభావోదయా.

చ. గరుడురయంబు మానసము గాంచినవేగము చండమారుత
త్వరయు భవజ్జవంబున లవంబున కైనను సాటి వచ్చునే

సురగరుడోరగాసురులఁ జూచితి నీదృశబాహువిక్రమ
స్ఫురణ లెఱుంగసత్యమిదిస్తోత్రముగాదు ప్లవంగపుంగవా.

ఉ. అన్నవు నీవు భానుసుతు నట్టుల నేనును గూర్మితమ్ముఁడ\
నన్నుఁ గృపన్ గనుంగొనుము నాధన మంతయునీదినీవునే
నెన్నఁటికిట్లు చెల్మివహియించియెయుండుదమన్ననింద్రజుం
డన్నరభోజితోడ నపు డట్లులె సఖ్యము చేసి వేడుకన్.

క. బాంధవ్యుఁ డగునాతనిఁ గి
ష్కింధకుఁ దోడుకొని పోయి స్నేహమున జగ
ద్బాంధవసుతుఁ జూచినగతి
బంధురమతిఁ జూచి మిగుల బహుమతి చేసెన్. 26

క. మాసముబారత నచ్చట
మాసము వసియించి మిగుల మైత్రియుఁ గని య
య్యాసురపతి సత్కృతుఁ డై
యాసురపతిసుతుఁడు పనుప నరిగె నృపాలా. 27

వ. అని పలికి యగస్త్యమునిశేఖరుండు రఘువీరశేఖరునకు
వెండియు ని ట్లనియె. 28

మ. చతురంభోధుల దైత్యు ముంచిన భుజాశౌర్యాఢ్యునవ్వా
సవిన్, హాతుఁ గావించితి వొక్కతూపున సమిత్రామాత్య
పుత్రంబుగాఁ, గృతవీర్యాత్మజుఁ ద్రుంచివైచినత్రిలోకీవర్ణి
తున్ రేణుకా, సుతు నిర్జించితి వెంచ శక్యమె నిన్నున్
క్షోణీసుతాధీశ్వరా. 29

శ్రీమదాంధ్ర మహాభారతము

ఉద్యోగపర్వము - తృతీయాశ్వాసము.

శ్రీకృష్ణుఁడు దుర్యోధనునితో సంభాషించుట.

వ. సాత్యకియును సముచితప్రకారంబునం బూజితుం డయ్యెఁ
దదనంతరంబ నిజాసనాసీనులయి తనమొగంబునం జూడ్కి
నిలిపి యున్న దుర్యోధనాదులతో మాధవుండు మధుర
సంభాషణంబులు చేయుచుండె నట్టియెడ. 1

తే. సముచితంబుగఁ గూరలచంద ముగ్గ
డించి కుడుపు తెఱంగు పుట్టించి పలుకు
నాసుయోధనుతోఁ గృష్ణుఁ డచటఁ దాను
గుడువనొల్లక యునికి యేర్పడఁగఁజెప్పె. 2

వ. చెప్పిన విని దుర్యోధనుండు సూర్యసూనువదనం బవలో
కించి యల్లన యి ట్లనియె. 3

క. హరిపలికినవిధ మెంతయు
నెర వై యున్నయది వింటె యిమ్మాట తెఱం
గరయుదము తొలుత నీ వెను
పరిచందం బెల్ల నెఱుక పడియెడుఁ బిదపన్. 4

వ. అని యచ్యుతున కి ట్లనియె. 5

తే. వలయునన్న పానంబులు పలుదెఱఁగుల
నేర్పువిధముల నే మొడఁగూర్చి వేడ్క

నున్న నీ వుపయోగింప నొల్లకునికి
బాంధవమునకు నీతికి బాహిరంబు. 6

క. కౌరవులకుఁ బాండవులకు
నారయ నీ వొక్కరూప యసదృశధర్మా
చారుండవు రాజునకుం
గూతుతు గత మేమి యి ట్లగుటకుం జెపుమా. 7

క. అనుజు నుపేంద్రుఁడు మనుజేం
ద్రున కిట్లను దూత లెందుఁ బోలిపోలి గుడువం
గొనఁ గట్టఁ బొడఁగుదురె వ
చ్చినకార్యము దీర్చి పిదపఁ జేయుం డెల్లన్. 8

వ. అనిన గాంధారీనందనుండు దేవకీనందనున కిట్లనియె. 9

ఆ. వేగపడుట మేలె వినుము కార్యము దీఱుఁ
దీఱ కుండు దాని తెఱఁగు దగిన
యప్పు డాడ రాదె యిప్పుడు ముకుఁద్రాఁటఁ
గాలు గ్రువ్వ నేల కమలనాభ. 10

వ. నీవు వచ్చినవాఁడవు మాయింటఁ గుడిచి కూర్చుండి యెల్ల
పనులం జెప్పుట యొప్పుఁగాక కుడువ నొల్ల నవం దగునె
దీనికిం గారణంబు నాయెఱింగినయది లేదు విచారింపక
పలికి తనిన మందరధరుండు మందస్మితంబుతో నందఱం
గలయం గనుంగొని ధార్తరాష్ట్రుకరంబు గజంబు పల్లవం
బల్లన తెమల్చులీలం గేల నమర్చి యిట్టిమాటలు తేట
పఱుపవలయునేని వినుమని యతని కిట్లనియె. 11

చ. ప్రియ మెసఁగం దగం బిలిచి పెట్టెడుకూ డది లెస్సకూడు
దక్కయనయహీనతం దమకు నాపద యైనెడ నిట్టు నట్టు

నే,మియు నన లేనికూ డెదిరి మేవడిరై చను నీవు మా
దెసం, బ్రియుఁడవు గావు మాకు ధృతిపెం పఱ నాపద
లే దొకింతయున్. 12

వ. అట్లుం గాక. 13

క. పగవారియింటఁ గుడిచిన
నగుఁ దమ కనుమాన మమృత మైనను దారుం
బగతురకుఁ గుడువఁ బెట్టఁగఁ
దగ దొడళుల కెప్పు డెవ్విధము వాటిలునో. 14

వ. నేను బగతుండ నె యంటేని. 15

క. అలుగుదు పాండవులకు వా
రలు నాకుం బ్రాణములు ధరావల్లభ యి
ట్టలముగఁ దమప్రాణములకు
నలుగుజనులు పగతు రగుట యనుమానంబే. 16

ఆ. కారణంబు లేక కౌంతేయులకు బాల్య
మాది గాఁగఁ గీడె యాచరింతు
పుణ్యపరులు దోడఁ బుట్టువు లార్యులు
వైర మెత్తఁ దగునె వారితోడ. 17

వ. ఇట్లున్న మీయందఱయన్నంబులు దుష్టాన్నంబులు విదురుం
డొక్కనియన్నంబు భోక్తవ్యం బని నిశ్చయించితిఁ గావున
నందుఁ బోయెద నని చెప్పి యజ్ఞనపతి యనుమతి చేయఁ
జనునప్పుడు తోడన బాహ్లికభీష్మాదికౌరవులును గుంభ
సంభవప్రముఖులైన మాన్యులును జని మాధవుతోడ
మాయిండ్ల నెల్లను గానిక లాయితంబులు చేసికొని నీవు

విజయంచేయుటకు నెదుళ్లు చూచుచున్నవార మని పల్కి
ప్రార్థించిన నేనన్నిచోట్లకు వచ్చినవాఁడన యందఱ యర్చ
నలుం గైకొంటిని మీరు నిలువుం డని వారల నిలిపి
విదురుగృహంబునకుం బోయిన. 18

సీ. సంభ్రమస్నేహనిశ్చలభక్తియుక్తిఁ బ
విత్రమజ్జనము గావించి విదురుఁ
డెల్లవంటకములు నేర్పడ బోనాలు
వేర్పింప నెంతయుఁ బ్రీతి ముంద
రోజమై బ్రాహ్మణభోజనం బొనరించి
సపరివారముగ విశాలరమ్య
పూతస్థలంబునఁ బుండరీకాక్షుండు
దమ్ముండుఁ దాను నుత్సవ మెలర్ప
తే. సరసరంజకమహనీయసంప్రయోగ
మగుచతుర్విధహృద్యాన్న మారగించె
లలితసంభావనామంజులంబు లైన
పలుకు లెడనెడ విదురున కెలమి యొసఁగ. 19

వ. అతండును. 20

క. గోవింద సంభ్రమము సం
భావింపుము మాకు నిదియ పరమధనం బొం
డేవిధమున నీ కర్చన
గావింపం జాలువాఁడు గలఁడే యెందున్. 21

వ. అని మఱియు నత్యంతవినయవాక్యమ్ముల నారాధించు
చుండె నిట్లు కృతాహారుం డైనహరికిఁ జందనచర్చాద్యర్చ
నంబు లాచరించి యవ్విదురుండు కృతార్థుండై యుండఁ

గవిగణికప్రముఖనిఖిలవిద్వజ్జనంబులు గాయకపాఠకవాం
శికవైణికాది వినోదపాత్రంబులు నప్పరమేశ్వరుం గాన
వచ్చి ప్రొద్దు పుచ్చి యభిమతార్థంబులు వడసి చనిరి రాత్రి
యగుటయుం దగినయభ్యంతరమందిరంబున హంసతూలి
కాతల్పంబున భుజంగతల్పు నునిచి యతనికడ నుచితాస
నంబున నుండి. 22

ఆ. విదురుఁ డిట్టులనియె నిదియొకకార్యంబు
గాఁగఁబూని యిందు రాఁగఁ దగునె
దుష్టబుద్ధి నీచు దుర్యోధనుండు నీ
మాట వినునె దురభిమానఘనుఁడు. 23

క. వచ్చినసైన్యంబులఁ గని
పెచ్చుపెరిఁగి నాఁడు ద్రోణభీష్ములలావుల్
నచ్చియుఁ గర్ణుం డొక్కఁడ
యిచ్చుఁ దనకు విజయమనియు నెంతయుఁ బొంగున్. 24

వ. నీ విట వచ్చుట వినినయప్పుడు ధార్తరాష్ట్రు లందఱుం
గూడం బాఱి తమలో నిశ్చయించిన తెఱంగు నీశాసనం
బుల్లంఘింపం గలవారు పాండునందనులకు నేమియు నీ
కుండువారు దార యీధాత్రియంతయు బీఱు వోవకుండ
నేలువారు వారిం గూడినరాజులెల్లను దిగ్విజయంబునాఁడు
పాండవులచేత భంగపడినవారు గావునఁ గర్ణుతో నేకా
ర్థుల మై చత్తుము గెలుతు మింతియ కాని యొండు లేదని
నిశ్చయించికొని యున్నవా రట్లగుటం జేసి దుర్యోధనుండు
గండు మిగిలి యున్నవాఁడు సంధి గానేరదు వారల కంద
ఱకు నిది ప్రాప్తకాలంబై యున్నయది యెట్లును నుడుగ

గనమి జూద మొకటి కల్పించి కపటంబు
చేయ దానవెల్ల చేటుఁ బుట్టె. 27

తే. అన్నదమ్ముల నెత్తంబు లాడి సతుల
తలలు వట్టి సభాస్థలంబులకు నీడ్చి
చీర లొలిపింతురే యిట్టివారి నెందుఁ
దడవుమా నీ వొకండవు దక్క నధిప. 28

ఉ. అప్పుడు నీవుఁ గర్ణుఁడును నాడినమాటలు గొల్వులోపలం
జెప్పెడునట్టివే కులము శీలముఁ గల్గినపుణ్యకాంతక
ట్లొప్పమిసేయుటెల్లఁగనియున్న జనంబులువించునుండఁగాఁ
ద ప్పొకయింత లే దనువిధం బది నీక చనుం గుమారకా.

తే. ఎత్తి విడిసినవారని యెల్లతప్పుఁ
బాండవులమీఁదఁ బెట్టిన బ్రదుకు గలదె
ద్రోణభీష్ములుఁ దండ్రియుఁ దోడుతోడఁ
జెప్పఁతగుమాట లేమియుఁ జెవులుచొరవు. 30

క. శాంతిం బొందుట నీకుం
గుంతీపుత్త్రులకు మే లగుఁ దానిక యే
నింతయు నాకెద నది నీ
కెంతయు రుచియింప కునికి యెఱిఁగి యెఱిఁగియున్. 31

వ. అని యిట్లు నారాయణుండు నానాప్రకారంబులం జెప్ప
టకుఁ గటకటంబడియెడుదుర్యోధనునకు దుశ్శాసనుం
డి ట్లనియె. 32

మ. జనకుండుం గురుభీష్ములుం దగినకర్జం బాప్తులై నీకుఁ బ్రీ
తినెఱింగించుతెఱంగుగాదుతమబుద్ధిం బోయి సంధాన మి

ట్లొనరం జేయకయున్న గృష్ణునకు నివ్వెఱ పొందించువా రింతవ
ట్టు నిజం బిచ్చుట నింక నీయునికి నెట్లుంగీడుపుట్టుం జుమీ.

ఆ. అనిన బాహ్లికాదు లగుకురువృద్ధుల
నాత్మజనకుఁ గృష్ణు నాదరింప
కతఁడు రాజసమున నప్పుడు దిగ్గన
లేచి పోయె సంచలించెఁ గొలువు. 34

తే. అతనివెనుకన కర్ణుండు ననుజగణము
శకునియును వారిపాంచాల నజనపతులును
బోయి రమ్మెయిఁ జని యొక్కప్రోవు గట్టి
వేఱ యంతంత నుండిరి గోఁడమున. 35

వ. ఇట్లున్నం గనుంగొని గాంగేయుండు. 36

చ. ఇతఁ డిది యేల క్రొవ్వి ధరణీశుఁడనంచు వృథాభిమానియై
మతి చెడి లోభ మోహమదమత్సరముల్ దనుఁద్రిప్పనిట్లసం
గతమునఁబోయెవీనివెనుకం జని రేమి దలంచియో మహీ
పతులునువీరుగొందఱతిభారపుమానుసు లేమి చేయుదున్.

తే. అని జనార్దనుఁ గనుఁగొని యకట కాల
పక్వ మయ్యె నీనరపతిప్రతతి యెల్ల
ననుడుఁ దగువారి దెసఁ గలయంగఁ జూచి
తగవు మెయి నిట్టు లనియె నన్నగధరుండు. 38

శా. ఈదుర్యోధనుఁ డింతగర్వియగునే యీయున్న వారెల్ల నా
చేదైన్యంబునఁబొందుటొప్పదని చర్చింపండ యీభంగికిన్
లేదెదయొండు దెఱంగు సత్కులముఁబాలింపంగ వర్జింప రా
దే దుష్టాత్మకు నీచు నొక్కరునిఁ బోదే ఖేద మీజాతికిన్.

ఉ. కంసుఁడు నిట్లు తండ్రిమది గందెడుచంద మొనర్చి ధర్మవి
ధ్వంసము చేసినం గులమువారలు నా కెఱిఁగింప నేను దు
ర్మాంసముగోయువైద్యునిక్రమంబుననాతనిద్రుంచియన్వయో
త్తంసముఁ జేయనే జనకుఁదద్విధ మొప్పదె మీరుఁ జేసినన్.

ఆ. అంతతోడ నెల్లయాపదలును దీఱు
వంశ మధికగౌరవంబు నొందుఁ
గూడి మనుట గలుగుఁ గురుపాండవులకు ని
త్తెఱఁగుచూడ మీకు నుఱవ కాదె. 41

వ. అనిన విని ధృతరాష్ట్రుం డుదరిపడి విదురున కిట్లనియె. 42

భాస్కర రామాయణము

ఆరణ్యకాండము - ద్వితీయాశ్వాసము.

మారీచుఁడు మాయాకురంగమై రామాశ్రమమునకు వచ్చుట.

సీ. రుచిరవైదూర్యంబు రూపార నచ్చున
    వచ్చినవిధమున వదన మమర
భర్మనిర్మితపద్మపత్త్రంబు లలవడ
    నొత్తినక్రియఁ గర్ణయుగము మెఱయ
లలితమాణిక్యశలాకలలాగు మై
    కొన నమర్చినభంగిఁ గొమ్ము లొప్ప
నింద్రనీలములబాగేర్పడ ద్రచ్చి వై
    చినగతి గొరిజలు చెలువు మిగుల
తే. నుదర మిందుబింబద్యుతి నుల్లసిల్లఁ
గనకకేసరాంకురరోమకాంతి నిగుడ
నొక్కమాయాకురంగమై యొయ్యనొయ్యఁ
జనియె నిలుచుచు నాపర్ణశాలకడకు. 1

సీ. నెలలోనియిఱ్ఱికి నీలకంఠునిచేతఁ
    బొలుపారు లేడికిఁ బుట్టెనొక్కొ
యజుఁ డన్నిరత్నంబు లందునుం గలుగుక్రొ
    మ్మించుల దీనిఁ గల్పించెనొక్కొ
రోహిణాచలము మేరువుఁ గూడి యురుతర
    ప్రభల నీహరిణంబుఁ బడసెనొక్కొ
క్రొక్కారుమెఱుఁగులుఁ జుక్కలయొఱపును
    గలసి యీమృగమయి వెలసెనొక్కొ

తే. దీనిఁబోలంగజంతువుల్ త్రిభువనముల
యందు మఱికలవొకొయని యాత్మ మెచ్చి
ప్రీతి వనదేవతలు చూడ సీతదృష్టి
మార్గమున కల్గఁ జనియె నమ్మాయయిఱ్ఱి. 2

ఉ. అత్తఱి నెమ్మొగంబుజిగి నచ్చుపువెన్నెలగాయ నింపు ద
ళ్కొత్తుసమీపభూజముల నొయ్యనఁ బువ్వులు గోయుచు
న్న రా,జోత్తముదేవి చూచెఁ జిగు రొత్తెడువేడ్కలు సం
దడింపఁగన్,గ్రొత్తమెఱుంగు లేణమునకుం దనకున్ నడు
మెల్ల నిండఁగన్. 3

మహాస్రగ్ధర. ధరణీసంజాత ప్రీతిం దనుఁ గనుఁగొన నుద్యద్గ
తిం బాఱుఁ దాఱుం, బొరి డాయుం బూరిమేయుం బొలు
పుగ నిగుడుం బొంగుఁ గ్రుంగుం జెలంగుం, దిరుగుం
గుప్పించు మించున్ దెసల నెసఁగ వర్తించు వే చొకళిం
చున్, గర మొప్ప న్నిల్చుఁ బొల్చుం గనకహరిణ మక్కా
ననాంతంబులోనన్. 4

క. మరగినవిధమునఁ జేరువఁ
దిరుగుం బసిగొనుచుఁ గలయఁ దృణములు వెదకున్
ఖురపుటమునఁ గడుపొయ్యనఁ
బరికికొనుచుఁ జక్కనిలుచుఁ బలుమఱునెదురన్. 5

క. ఈలీలం బొలయఁగ నా
లోలాక్షి విలోలయై విలోకించి మహీ
పాలుని లక్ష్మణుఁ బిలిచినఁ
జాలఁగ వెస నేఁగి కనిరి సారంగంబున్. 6

తే. అపుడు లక్ష్మణుఁ డేర్పడ నామృగంబు
నద్భుతాకారవిలసన మధికసంశ
యాత్ముఁడై చూచి నిజబుద్ధి నసురమాయ
గానిరూపించి యనియె నగ్రజునితోడ. 7

మ. మనలం బిల్చుట భూమిపుత్త్రి మది నిమ్మాయామృగంబున్
నిజం, బని భావింపఁగఁబోలు వీఁ డసుర మాయారూపుఁ
డెందేని నొక్కనెపం బిమ్మెయిఁ జూపి చిక్కుపఱుపంగాఁ
జూచె మోహంబునన్, జననాథోత్తమ పట్టఁ జూచెదు
సుమీ చర్చింప కుద్యద్గతిన్. 8

క. అని పలుకఁగ నాలోచన
జనకజ పతి డగ్గఱంగఁ జనుదెంచి కనుం
గొను రాజముఖ్య యొప్పుల
గని యగునీమృగవిలాస కమనీయగతుల్. 9

క. కరువున గండరువునఁ జి
త్తరువున నినచంద్రరుచులఁ దారలరుచులన్
హరిహరధాత్రాదుల కీ
హరిణముసరిరూపు వడయ నలవియె యెందున్. 10

వ. అనుచు సాభిలాషంబుగాఁ బెక్కుచందంబులం గొనియాడి.

చ. అలఘుచరిత్ర దీని వెర వారఁగ నెమ్మెయినైనఁ బట్టి తే
వలయు నరేంద్ర మిమ్ముఁబనిఁబంపెడుదాననె దీనిమీఁదమీ
రలరుచుఁజూచుభంగిఁగనియాడితిఁగన్నులపండువెప్పుడున్
గలుగదె యెల్లనాఁడు నధికంబుగ నీమృగరత్నమబ్బినన్.

చ. అనికడువేడ్కతోఁబ్రియునినామృగలోచన వేఁడినన్ మనం
బునఁ గడునుత్సవం బొదవఁ బోయెదనిప్పుడ పట్టి తెచ్చెదం

గనుఁగొను మంచుఁబూననిజకాంతునితో ననురాగభావసం
జనితవికాసభాసి యయి జానకి యిట్లనుఁ గౌతుకంబునన్.

తే. ఎట్లు గ్రుంకులు వెట్టుచు నేచి పట్టి
నీక యెట పాఱెనేని పోనీక శరము
పాలుపడఁజేసి తెమ్ము భూపాల యొప్పఁ
జారుతర మైనయీమృగచర్మమైన. 14

వ. అని పల్కునవసరంబున సౌమిత్రి విన్నఁబోవుచు నింత
యెఱుంగమి గలదె యసురమాయం దగిలి రామచంద్రు
నకు హరిణరూపం బై నకలంకంబొందె ననుచుఁ దద్వాఘ్న
వచనంబు లాడ నోడి వెఱచుచు నుండె వెండియు రఘు
వరుండు. 15

క. సౌమిత్రిఁ బిలిచి లక్ష్మణ
యీమృగముం దనకుఁ దెచ్చి యిమ్మనియెడు నట
భూమిజ విలునమ్ములుఁ దె
మ్మేమఱకుము వచ్చునంత కిట మీఁవదినెన్. 16

క. అన విని యతఁ డన్నకు ని
ట్లనుఁ దాపసహింస చేయునలమారీచుం
డనువాఁడు కనకమృగమై
చను దెంచెం బొసఁగ విట్టిచందము లెందున్. 17

క. వసుమతి మన మింతకు మును
వసుధాధిప కంటిమే సువర్ణమృగము రా
క్షసకృత్య మ్మిది వలవదు
మసలుఁడు సతు లతులచపలమతులు దలంపన్. 18

శ్రీరామమూర్తి మాయామృగంబుం బట్ట నరుగుట.

వ. అనిన విని కౌసల్యానందనుండు సుమిత్రానందనున కిట్లనియె

క. అడిగినవస్తువు లెప్పుడు
నెడపక గలిగించుకతన నీయబల మనం
బోడఁబడి పురి నున్నట్టుల
కడు ముదమునఁ బొంది యుండుఁ గాంతారమునన్. 20

తే. పసిఁడిమృగము నిక్కం బైనఁ బట్టి తెచ్చి
జనకసుతకోర్కి దీర్చెద సమ్మదమున
లేక మాయామృగం బైన లీలఁ ద్రుంచి
హితమొనర్చెద మునులకు నెట్లు లెస్స. 21

క. అని పలికి విపులబాణా
సనమును గవదోనలు పూని సౌమిత్రిఁ గనుం
గొని జనకతనయ సుమ్మీ
యని పలుమఱు నప్పగించి యట చన నదియున్. 22

చ. నిలువక మెల్ల దాఁటు నటు నిల్చిన మెల్పు నటించుఁబట్టఁ జే
యలఁతికిఁ జేరినం జిదిమినట్టులు దూరము దాఁటుఁ గ్రమ్మఱం
గొలఁదికి డాసినం బొదలు గొందులు చొచ్చు నడంగె నన్న న
వ్వలఁ బొడచూపు మాటుగొని వచ్చిన వెండియు నుండు
నొండెడన్. 23

వ. అప్పుడు రఘువరుం డపరభాగనిరూఢవరాసనుండును నాకుం
చితాంగుండు నగుచు నొయ్యన. 24

క. మునివ్రేళ్లు నేలమోపుచు
వెనుకదెసం జప్పుగాక వెరవునఁ గదియం

దనుఁ జూచియు తెప్పలకద
లును లేక టు నిలుచు నిలిచి లోఁబడుకొలఁదిన్. 25

క. పిఱిఁదికిఁ బో నిచ్చినవి
ల్లఱితికి నై యల్లఁ జాఁప నది గనుఁగొని పె
ల్లుఱికి చను లతలు ఫులువడఁ
జిఱుముం గడు నాసపుట్ట శృంగాగ్రములన్. 26

వ. ఇవ్విధంబునం బెక్కుదూరం బరిగి యెండమావు లుదకంబు
లనుతలంపున నవ్వల నివ్వలం దోఁచుచు నధికతృష్ణాతి
రేకంబునం దగులుమృగపతియునుంబోలె నారామచం
ద్రుండు. 27

సీ. పొదదండ గాఁ జేరి యుదరిపాటునఁ బట్టఁ
బొంచెద నంచును బొంచిపొంచి
మొక్కలంబున నున్న ముట్టి పర్వన దయ్యఁ
బాఱి పట్టెద నని పాఱిపాఱి
దొడ్డికట్టై యున్న తోరంపుటీరంబుఁ
జొరఁ జొప్పి వెనువెంటఁ దిరిగితిరిగి
పొరకలు మెయినిండఁ బూరించుకొని పచ్చ
చెట్టుచందంబునఁ జేరిచేరి

తే. మడుఁగులకు నల్ల దాప్పుచు నడుసు గలుగు
కొలఁదిఁ బట్టంగ నగు నని వెలిచి వెలిచి
యలమృగము వెంట నొయ్య నాసాసఁ దిరిగె
నామృగవ్యాధరుద్రుఁడో యనఁగ విభుఁడు. 28

వ. మఱియు నందంద తఱుముచుం బ్రిదిలిపోవుచు నిత్తెఱం
గునం దార్చుసమయంబున. 29

సీ. నీరాక యెఱుఁగుదు నిక్కంబు ననుమాడ్కి
నోరచూపునఁ జేరి యొయ్యగిలుపుఁ
జందురునిఱ్ఱితో సమరంబునకు నేగు
పగిదిఁ గుప్పించి యుప్పర మెగయును
సురిఁగిపోయెద నన్నఁ జొరఁజోటు లే దింక
నీవె దిక్కనుభంగి నెదురువచ్చుఁ
దనయకోర్కికి నుర్వి తనుఁ బట్టు ననుగతి
నవనిపై నిలువ కందంద దాఁటు

ఆ. మరలిచూచుఁ దిరుగు మఱియు నద్దెసఁ బాఱు
నలసినట్లు నిలుచు నల్ల బెదరు
మెలఁగి దెసలు వెదకు మెడయెత్తి గాలిది
క్కరయు నక్కురంగ మచట నచట. 30

క. నిలువక తరుగుల్మాంతర
ములలో వడిఁ బాఱునపుడు మొగుళులు వాఱం
దలతలవెలుఁగుచు నెడనెడఁ
బలుమఱుఁ జందురుఁడుఁ దోఁచుపగిదిం దోఁచున్. 31

వ. ఇట్లు దోఁచిన విస్మితుం డగుచు. 32

మ. కదియం జొప్పడ కంతకంతకట నాకాంతారమధ్యంబునం
దదియొందుంగమియించినంబిదపడయ్యుం బాఱుచుంబట్టలే
కిది మాయామృగ మచ్చుగా ననుచు నింకేదినిఁబోనీకచం
పెద దూరంబెలయించెనంచునలుకంబృథ్వీశుఁడే తేరఁగన్.

భాస్కర రామాయణము

సుందరకాండము.

సీ. చరణాగ్రమున నీభుజాదర్ప మడఁచిన
ధూర్జటివిలు లీలఁ ద్రుంచి వైచె
వాలపాశంబున వడి నిన్నుఁ గట్టిన
వాలి నొక్కమ్మునఁ గూలనేసె
నని నిన్నుఁ జెఱగొన్న యర్జునుఁ బొరిగొన్న
పరశురాముని నాజి భంగపఱచెఁ
గడిమిమై నొక్కఁడ ఖరదూషణాదులఁ
బదునాల్గు వేవుర బారిసమరె
తే. నమ్మహాధనుర్ధరున కెగ్గాచరించి
హరిహరబ్రహ్మశక్రాదులైన నతని
భయదనిర్ఘాతసంఘాతపాతశాత
బాణఘాతహతులు గాక బ్రదుకఁ గలరె. 1

చ. ఉరవడి రాఘవాస్త్రతతు లుగ్రతరార్చుల మింట నంట నీ
కరము లురంబు నంగములుఁ గంఠము లాస్యము లంఘ్రు
లూరులున్, శిరములు మర్మముల్ బహులుఁ జించుచుఁ ద్రుం
చుచు నుచ్చిపాఱుచున్, మురియలు చేయుచున్ నిగుడ
మూఁడుజగంబులు నాఁప నోపునే. 2

శా. శ్రేణీభూతములై దిగంతముల విక్షేపించుసౌమిత్రిదో
స్స్థానాగ్రోజ్ఝితరుక్మపుంఖకషణోద్భూతస్ఫులింగచ్ఛటా

క్షీణజ్వాలధురీణబాణములు వర్షింపంగ నీవేల స
ప్రాణత్రాణశరణ్యు లై నిలుతురే బ్రహ్మాదులున్ ముందటన్.
మ. తురగస్యందనమత్తవారణభటస్తోమంబుతోఁ గూడ నీ
పురి భస్మంబుగఁ గాల్చి సైనికసుహృత్పుత్రానుజశ్రేణి నె
త్తుర గ్రక్కం బడ గ్రుద్ది చంపి మఱిమృత్యుక్రూరతంబట్టినీ
శిరముల్ ద్రుంపఁగ నేన చాలుదు జయశ్రీలబ్ధి వర్ధిల్లఁగన్.
క. సుగ్రీవాదులయెదుట ను
దగ్రగతిన్ నిన్నుఁ ద్రుంతు ననురఘుకులవీ
రాగ్రణిప్రతిజ్ఞకతన ద
శగ్రీవుఁడ బ్రతికి తీవు చావక నాచేన్. 5
ఆ. అజునివరము నీకు నమరగంధర్వాసు
రాహియక్షరాక్షసాలిచేత
మడియకుండఁ గాని మనుజవానరులచేఁ
గలనఁ జావకుండఁ గాదు వినుము. 6
క. ఘనుఁ డగురాముఁడు మనుజుం
డినజుఁడు వానరుఁడు గాన నియ్యిరువురచే
ననిఁ జావంగలవాఁడవు
మనమున నామాట నమ్మి మతకరి వగుచున్. 7
శా. నీకంఠార్పితకాలపాశము శిరోనిర్ఘాతపాతంబు లం
కౌకస్సంచయకాళరాత్రి గళబద్ధోదగ్రకాలాహి క
న్యాకారాగతమృత్యువా జనకకన్యన్ వేగయొప్పించి లో
కైకత్రాణుని రామునిం గనుము నీ కీబుద్ధి గా కుండినన్.
క. సీతారాములకోప
స్ఫీతానలశిఖలు గలయఁ జేర్చుచు లంకా

భూతవ్రాతము భస్మీ
భూతముగాఁ జేయు ననుడుఁ బొడమినకిన్కన్. 9

మ. కుటిలభ్రూకుటిభీమఫాలదశకక్రూరోరునాసాపుటో
ద్భటలంబోష్ఠహనుప్రకంపననటద్దంష్ట్రాతిఘోరాస్యుఁడై
పటుదృష్టిస్ఫుటవిస్ఫులింగములు పైపైఁ గ్రమ్మ నీకష్టమ
ర్కటునింజంపుఁడునావిభీషణుఁడుధర్మంబొప్పలంకేశుతోన్.

శా. ఈకోపంబున కగ్ని యోవరుణుఁడో యీశానుఁడో వాయు
వో, నాకాధీశుఁడో యక్షనాయకుఁడో కీనాశుండొకోణే
శుఁడో, యీకీశాధముఁ డెంతవాఁడరయ వీఁ డిట్లెగ్గు
లేమాడినన్,నీకున్ వధ్యుఁడుగాఁడు సైఁపుమదిలో నీవింక
లంకేశ్వరా. 11

క. దూతకు వధకంటెఁ గశా
ఘాతము ముండనము నంగకర్తన మంకం
బాతతదండము లెందును
దూత యవధ్యుఁ డని చెప్పుదురు ధర్మవిదుల్. 12

వ. అని పల్క రావణుండు విభీషణునిపల్కు లాదరించి. 13

క. తరుచరునకు వాలము ప్రియ
కర మగుటను వీనితోఁకఁ గాలిచి నక్తం
చరు లందఱుఁ జూడఁగ నీ
పుర మంతయుఁ గలయఁ ద్రిప్పిపుచ్చుం డనినన్. 14

వ. ఉద్ధతి రణకర్కశు లగురక్కసు లక్కపీంద్రుం గవిసి. 15

శ్రీమదాంధ్ర భాగవతము

సప్తమస్కంధము.

ప్రహ్లాదచరిత్రము.

సీ. తనయందు నఖిలభూతములందు నొకభంగి
సమహితత్వంబున జరుగువాఁడు
పెద్దలఁ బొడగన్న భృత్యునికైవడిఁ
జేరి నమస్కృతుల్ చేయువాఁడు
కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన
మాతృభావము చేసి మరలువాఁడు
తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను
దీనులఁ గావఁ జింతించువాఁడు

తే. సఖులయెడ సోదరస్థితి జరపువాఁడు
దైవతములందు గురువులఁ దలఁచువాఁడు
లీలలందును బొంకులు లేనివాఁడు
లలితమర్యాదుఁ డైన ప్రహ్లాదుఁ డధిప.

వ. మఱియును.

సీ. ఆకారజన్మవిద్యార్థవరిష్ఠుఁ డై
గర్వసంస్తంభసంగతుఁడు గాఁడు
వివిధమహానేకవిషయసంపన్నుఁ డై
పంచేంద్రియములచేఁ బట్టువడఁడు

వ్యవయోబలప్రాభవోపేతుఁ డై
కామరోషాదులఁ గ్రందుకొనఁడు
కామినీప్రముఖభోగము లెన్ని గలిగిన
వ్యసనసంసక్తి నావంకఁ బోఁడు

ఆ. విశ్వమందుఁ గన్నవిన్న యర్థములందు
వస్తుదృష్టిఁజేసి వాంఛ యిడఁడు
ధరణినాథ దైత్యతనయుండు హరిపర
తంత్రుఁ డై హతాన్యతంత్రుఁ డగుచు. 3

ఆ. సద్గుణంబు లెల్ల సంఘంబులై వచ్చి
యసురరాజతనయునందు నిలిచి
పాసి చనవు విష్ణుఁ బాయనివిధమున
నేఁడుఁ దగిలి యుండు నిర్మలాత్మ. 4

మ. పగవారైనసురేంద్రులున్ సభలలోఁ బ్రహ్లాదసంకాశులన్
సుగుణోపేతుల నెందు నే మెఱుఁగ మంచున్ వృత్తబం
ధంబులం, బొగడం జొత్తురు సత్కవీంద్రుల క్రియన్ భూనా
థ మీబోఁటిన, ద్భగవద్భక్తులు దైత్యరాజతనయుం బా
టించి కీర్తింపరే. 5

క. గుణనిధి యగు ప్రహ్లాదుని
గుణము లనేకములు గలవు గురుకాలమునన్
గణుతింప నశక్యంబులు
ఫణిపతికి బృహస్పతికిని భాషాపతికిన్. 6

వ. ఇట్లు సద్గుణగరిష్ఠుం డయిన ప్రహ్లాదుండు భగవంతుం
డయిన వాసుదేవునియందు సహజసంవర్ధమాన నిరంతర
ధ్యానరతుం డై. 7

సీ. శ్రీవల్లభుఁడు దన్నుఁ జేరినయట్లైనఁ
జెలికాండ్ర నెవ్వారిఁ జేరఁ మఱచు
నసురారి దనమ్రోల నాడినయట్లైన
నసురబాలురతోడ నాడ మఱచు
భక్తవత్సలుఁడు సంభాషించినట్లైనఁ
బరభాషలకు మాఱుపలుక మఱచు
సురవంద్యుఁ దనలోనఁ జూచినయట్లైనఁ
జొక్కి సమస్తంబుఁ జూడ మఱచు

తే. హరిపదాంభోజయుగచింతనామృతమున
నంతరంగంబు నిండినట్లైన నతఁడు
నిత్యపరిపూర్ణుఁ డగుచు నన్నియును మఱచి
జడత లేకయు నుండును జడునిభంగి. [లీ

శా. పానీయంబులుద్రావుచుంగుడుచుచున్ భాషించుచున్ హాస
లానిద్రాదులుసేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత
శ్రీనారాయణపాదపద్మయుగళీచింతామృతాస్వాదసం
ధానుండై మఱచెన్ సురారిసుతుఁ డేతద్విశ్వమున్ భూవరా.

సీ. వైకుంఠచింతావివర్జితచేష్టుఁడై
యొక్కఁడు నేడుచు నొక్కచోట
నశ్రాంతహరిభావనారూఢచిత్తుఁడై
యుద్ధతుఁడై పాడు నొక్కచోట
విష్ణుఁ డింతియ కాని వేఱొండు లే దని
యొత్తిలి నగుచుండు నొక్కచోట

నలినాక్షుఁ డనునిధానముఁ గంటి నే నని
యుబ్బి గంతులు వైచు నొక్కచోటఁ
ఆ. బలుకు నొక్కచోటఁ బరమేశుఁ గేశవుఁ
బ్రణయహర్షజనితబాష్పసలిల
మిళితపులకుఁ డై నిమీలితనేత్రుఁ డై
యొక్కచోట నిలిచి యూరకుండు. 10

వ. ఇట్లు పూర్వజన్మపరమభాగవతసంసర్గసమాగతం బైనము
కుందచరణారవిందసేవాతిరేకంబుననఖర్వనిర్వాణభావంబు
విస్తరించుచు నప్పటప్పటికి దుర్జనసంసర్గనిమిత్తంబునం దన
చిత్తం బన్యాయత్తంబు గానీక నిజాయత్తంబు చేయుచు
నప్రమత్తుండును సంసారనివృత్తుండును బుధజనవిధేయుం
డును మహాభాగధేయుండును సుగుణమణిగణగరిష్ఠుం
డును బరమభాగవతశ్రేష్ఠుండును గర్మబంధలతాలవిత్రుం
డును బవిత్రుండును నైనపుత్రునియందు విరోధించి సుర
విరోధి యనుకంప లేక చంపం బంపె నని పలికిన నారదు
నకు ధర్మజుం డి ట్లనియె. 11

శా. పుత్రుల్ నేర్చిన నేరకున్న జనకుల్ పోషింతు రెల్లప్పుడున్
మిత్రత్వంబున బుద్ధి చెప్పి దురితోన్మేషంబె వారింతురే
శత్రుత్వంబుఁ దలంప రిట్టియెడ నాసౌజన్యరత్నాకరుం
బుత్రున్ లోకపవిత్రుఁ దండ్రి నెగులుం బొందింప నెట్లోర్చెనో.

ఉ. బాలుఁ బ్రభావిశాలు హరిపాదపయోరుహచింతనక్రియా
లోలుఁ గృపాళు సాధుగురులోకపదానతఫాలు నిర్మల
శ్రీలు సమస్తసభ్యనుతశీలు విఖండితమోహవల్లికా
జాలు నదేల తండ్రి వడిఁ జంపఁగఁ బంపె మునీంద్ర చెప్పవే.

వ. అనిన నారదుం డి ట్లనియె. 14

శా. లభ్యం బైన సురాధిరాజపదమున్ లక్షింపఁ డశ్రాంతమున్
సభ్యత్వంబున నున్నవాఁ డబలుఁడై జాడ్యంబుతో వీఁడువి
ద్యాభ్యాసంబునఁ గాని తీవ్రమతిగాఁ డంచున్ విచారించి దై
త్యేభ్యుం డొక్కదినంబునం బ్రియసుతున్ వీక్షించి సోత్కంఠుఁడై.

క. చదువని వాఁ డజ్ఞుం డగుఁ
జదివిన సదసద్వివేకచతురత గలుగుం
జదువఁగ వలయును జనులకుఁ
జదివించెద నార్యులొద్దఁ జదువుము తండ్రీ. 16

వ. అని పలికి యసురలోకపురోహితుండును భగవంతుండును
నయిన శుక్రాచార్యకొడుకులఁ బ్రచండవితర్కులఁ జండా
మర్కుల రావించి సత్కరించి యిట్లనియె. 17

శా. అంధప్రక్రియ నున్నవాఁడు పలుకం డస్మత్ప్రతాపక్రియా
గంధం బించుక లేదు మీరు గురువుల్ కారుణ్యచిత్తుల్ మనో
బంధుల్ మాన్యులు మాకుఁ బెద్దలు మముం బాటించి యీ బా
లకున్, గ్రంథంబుల్ చదివించి నీతికుశలుం గావించి రక్షింపరే.

వ. అని పలికి వారలకుఁ బ్రహ్లాదు నప్పగించి తోడ్కొని పొం
డనిన వారును దనుజరాజకుమారునిం గొనిపోయి యతనికి
సవయస్కులగు సహశ్రోతల నసురకుమారులం గొందఱం గూర్చి.

ఉ. అంచితభక్తితోడ దనుజాధిపు గేహసమీపముం బ్రవే
శించి సురారిరాజసుతుఁ జేకొని శుక్రకుమారకుల్ పఠిం
పించిరి పాఠయోగ్యములు పెక్కులు శాస్త్రము లా కుమారుఁ
డాలించి పఠించె నన్నియుఁ జలింపని వైష్ణవభక్తిపూర్ణుఁడై.

క. ఏపగిది వారు చెప్పిన
నాపగిదిం జదువుగాని యట్టి ట్టని యా
క్షేపింపఁడు తా నన్నియు
రూపించిన మిథ్య లని నిరూఢమనీషన్. 21

శా. అంతం గొన్ని దినంబు లేగిన సురేంద్రారాతి శంకాన్విత
స్వాంతుం డై నిజనందనుఁ గురువు లేజాడం బఠింపించిరో
భ్రాంతుం డేమి పఠించెనో పిలిచి సంభాషించి విద్యాపరి
శ్రాంతిం జూచెదఁ గాక నేఁడని మహాసౌధాంతరాసీనుఁడై.

ఉ. మోదముతోడ దైత్యకులముఖ్యుఁడు రమ్మనిచీరఁబంచెఁ బ్ర
హ్లాదకుమారకుఁ భవమహార్ణవతారకుఁ గామరోషలో
భాదివిరోధివర్గపరిహారకుఁ గేశవచింతనామృతా
స్వాదకఠోరకుం గలుషజాలమహోగ్రవనీకుఠారకున్. 23

వ. ఇట్లు చారులచేత నాహూయమానుం డై ప్రహ్లాదుండు
చనుదెంచిన. 24

శా. ఉత్సాహప్రభుమంత్రశక్తియుతమే యుద్యోగమారూఢసం
విత్సంపన్నుఁడ వైతివే చదివితే వేదంబులుఁ శాస్త్రముల్
వత్సా రమ్మని చేరఁ జీరి కొడుకుఁ వాత్సల్యసంపూర్ణుఁడై
యుత్సంగాగ్రముఁ జేర్చి దానవవిభుం డుత్కంఠ దీపింపఁగన్.

క. అనుదినసంతోషణములు
జనితశ్రమతాపదుఃఖసంశోషణముల్
తనయులసంభాషణములు
జనకులకుం గర్ణయుగళసద్భూషణముల్. 26

వ. అని మఱియుఁ బుత్రా నీ కెయ్యది భద్రం బై యున్నయది
చెప్పు మనినఁ గన్నతండ్రికిఁ బ్రియనందనుం డి ట్లనియె.

ఉ. ఎల్లశరీరధారులకు నిల్లనుచీఁకటినూతిలోపలం
ద్రెళ్లక వీరు నే మనుమతిభ్రమణంబున భిన్నులై ప్రవ
ర్తిల్లక సర్వము న్నతనిదివ్యకళామయ మంచు విష్ణునం
దుల్లముఁ జేర్చి తా రడవి నుండుట మేలు నిశాచరాగ్రణీ.

వ. అని కుమారుం డాడిన ప్రతిపక్షానురూపంబు లయిన సల్లా
పంబులు విని దానవేంద్రుండు నగుచు ని ట్లనియె. 29

క. ఎట్టాడిన నట్టాడుదు
రిట్టి ట్టని పలుక నెఱుఁగ రితపుల శిశువుల్
దట్టించి యెవ్వ రే మని
పట్టించిరొ బాలకునకుఁ బరపక్షంబుల్. 30

శా. నాకుం జూడఁగఁ జోద్య మయ్యెడిఁ గదా నాతండ్రి యీ
బుద్ధిదా, నీకున్ లోపలఁ దోఁచెనో పరులు దుర్నీతుల్ పఠిం
పించిరో, యేకాంతంబున భార్గవుల్ పలికిరో యీదానవశ్రే
ణికిన్, వైకుంఠుండు గృతాపరాధుఁ డతనిన్ వర్ణింప నీ కే
టికిన్. 31

మ. సురలం దోలుటయో సురాధిపతులన్ స్రుక్కించుటో సిద్ధు
లం,బరివేధించుటయో మునిప్రవరులన్ బాధించుటో య
క్షకిన్నరగంధర్వవిహంగనాగపతులన్ నాశంబు నొందిం
చుటో,హరి యంచున్ గిరి యంచు నేల చెడ మోహాం
ధుండ వై పుత్రకా. 32

వ. అనినఁ దండ్రిమాటలకుఁ బురోహితు నిరీక్షించి ప్రహ్లాదుం
డి ట్లనియె. మోహనిర్మూలనంబు చేసి యెవ్వనియందుఁ
దత్పరు లయి యెఱుక గలపురుషులకుం బరులు దా మని
యెడుమాయాకృతం బయినయనద్గ్రాహ్యం బగు భేదంబు
గానంబడ దట్టి పరమేశ్వరునకు నమస్కరించెద. 33

శా. అజ్ఞుల్ గొందఱు నేము దా మనుచు మాయం జెంది సర్వా
త్మకుం, బ్రజ్ఞాలభ్యు దురన్వయక్రమములన్ భాషింపఁగా
నేర రా,జిజ్ఞాసాపథమందు మూఢులు గదా చింతింప బ్రహ్మా
దివే,దజ్ఞుల్ తత్పరమాత్ము విష్ణు నితరుల్ వర్ణింపఁగా నేర్తురే.

తే. ఇను మయస్కాంతసన్నిధి నెట్లు భ్రాంత
మగు హృషీకేశుసన్నిధి నావిధమునఁ
గరఁగుచున్నది దైవయోగమునఁ జేసి
బ్రాహ్మణోత్తమ చిత్తంబు భ్రాంతమగుచు. 35

సీ. మందారమకరందమాధుర్యమునఁ దేలు
మధుపంబు వోవునే మదనములకు
నిర్మలమందాకినీవీచికలఁ దూఁగు
రాయంచ చనునె తరంగిణులకు
లలితరసాలపల్లవఖాది యై చొక్కు
కోయిల చేరునే కుటజములకుఁ
బూర్ణేందుచంద్రికాస్ఫురితచకోరకం
బరుగునే సాంద్రనీహారములకు

తే. నంబుజోదరదివ్యపాదారవింద
చింతనామృతపానవిశేషమత్త
చిత్త మేరీతి నితరంబుఁ జేర నేర్చు
వినుతగుణశీల మాటలు వేయు నేల 36

వ. అనిన విని రోషించి రాజసేవకుం డైనపురోహితుండు
ప్రహ్లాదుం జూచి తిరస్కరించి యి ట్లనియె. 37

ఉ. పంచశరద్వయస్కుఁడవు బాలుఁడ వించుక గాని లేవు భా
షించెదుతక్కువాక్యములుచెప్పినశాస్త్రములోనియర్థ మొ
క్కించుకయైనఁజెప్ప వసురేంద్రునిముందటమాకునౌదలల్
వంచుకొనంగఁ జేసితివి వైరివిభూషణ వంశదూషణా. 38

చ. తనయుఁడుగాఁడుశాత్రవుఁడుదానవభర్తకుపీఁడు దైత్యచం
దనవనమందుఁ గంటకయుతక్షితిజాతముభంగిఁ బుట్టినాఁ
డనవరతంబు రాక్షసకులాంతకుఁ బ్రస్తుతి చేయుచుండుదం
డనమునఁ గాని శిక్షలకు డాయఁడుపట్టుఁడుకొట్టుఁడుద్ధతిన్.

క. ఈపాపనిఁ జదివింతుము
నీపాదము లాన యింక నిపుణతతోడం
గోపింతుము దండింతుము
కోపింపకు మయ్య దనుజకుంజర వింటే. 40

వ. అని మఱియు నా రాచపాపనికి వివిధోపాయంబులం బురో
హితుండు వెఱపుఁజూపుచు రాజసన్నిధిం బాపి తోడు
కొని పోయి యేకాంతంబున. 41

క. భార్గవనందనుఁ డాతని
మార్గము చెడ కుండఁ బెక్కుమాఱులు నిచ్చల్
వర్గత్రితయము చెప్పెన
నర్గళ మగుమతివిశేష మమర నరేంద్రా. 42

వ. మఱియు గురుండు శిష్యునకు సామదానభేదదండోపా
యంబు లన్నియు నెఱింగించి నీతికోవిదుం డయ్యె నని నమ్మి
నిశ్చయించి తల్లికి నెఱింగించి తల్లి చేత నలంకృతుం డయిన
కులదీపకు నవలోకించి. 43

ఉ. త్రిప్పకు మన్న మామతము దీర్ఘములైన త్రివర్గపాఠముల్
దప్పకు మన్న నేఁడుమనదైత్యవరేణ్యుని మ్రోలనేము మున్
చెప్పిననీతి గాని మఱి చెప్పకు మన్న విరోధినీతులన్
విప్పకు మన్న దుష్టమగు విష్ణుచరిత్రకథార్థజాలముల్. 44

వ. అని బుజ్జగించి దానవేశ్వరుసన్నిధికిం దోడి తెచ్చిన. 45

సీ. అడుగడ్డునకు మాధవానుచింతనసుధా
మాధుర్యమున మేను మఱచువాని
నంభోజగర్భాదు లభ్యసింపఁగ లేని
హరిభక్తి పుంభావ మైనవాని
మాతృగర్భము చొచ్చి మన్నది మొదలుగాఁ
జిత్త మచ్యుతుమీఁదఁ జేర్చువాని
నంకించి తనలోన నఖిలప్రపంచము
శ్రీవిష్ణుమయ మని చెలఁగువాని

తే. వినయకారుణ్యబుద్ధివివేకలక్ష
ణాదిగుణముల కాటపట్టయినవాని
శిష్యు బుధలోకసంభావ్యుఁ జీరి గురుఁడు
ముందటికిఁ ద్రొబ్బెఁ దండ్రికి మ్రొక్కుమనుచు. 46

క. శిక్షించితి మన్యము లగు
పక్షంబులు మాని నీతిపారగుఁ డయ్యెన్
రక్షోవంశాధీశ్వర
వీక్షింపుము నీకుమారువిద్యాబలమున్. 47

వ. అని పలికిన శుక్రకుమారకువచనంబు లాకర్ణించి దానవేం
ద్రుండు దనకు దండప్రణామంబు చేసి నిలుచున్న కొడుకును

దీపించి బాహాదండంబు సాఁచి డగ్గఱఁ దగ్గఱం దిగిచి గాఢాలింగనంబు చేసి తనతొడలమీఁద నిడుకొని చుంచు దువ్వి చుబుకంబుఁ బుడికి చెక్కిలి ముద్దుగొని శిరంబు మూర్కొని ప్రేమాతిరేకసంజనితబాష్పసలిలబిందుసందోహంబుల నతనివదనారవిందంబు దడుపుచు మందమధురాలాపంబుల నిట్లనియె. 43

శా. చోద్యంబయ్యెడినింతకాలమరిగెన్ శోధించి యేమేమి సం
వేద్యాంశంబులు చెప్పిరో గురువు లేవెంటంబఠింపించిరో
విద్యాసార మెఱుంగఁ గోరెద భవద్విజ్ఞాతశాస్త్రంబులోఁ
బద్యంబొక్కటి చెప్పిసార్థముగఁదాత్పర్యంబుభాషింపుమా.

శా. నిన్నున్ మెచ్చరు నీతిపాఠమహిమన్ నీతోడిదైత్యార్భకుల్
గన్నారన్నియుఁజెప్ప నేర్తురుగదా గ్రంథార్థముల్ వత్సులై
యున్నారెన్నఁడునీవునీతివిదుఁడౌదంచున్ మహావాంఛతో
నున్నాఁడన్ ననుఁగన్న తండ్రిభవదీయోత్కర్షముంజూపవే.

వ. అనినం గన్నతండ్రికిఁ బ్రియనందనుం డయినప్రహ్లాదుం డిట్లనియె. 51

క. చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థముఖ్యశాస్త్రంబులు నేఁ
చదివినవి గలవు పెక్కులు
చదువులలో మర్మమెల్లఁ జదివితిఁ దండ్రీ. 52

మ. తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్
వందనా,ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీ
ర్తనల్ చింతనం,బనునీతొమ్మిదిభక్తిమార్గముల సర్వాత్మున్

హరిఁ నమ్మి సజ్జనుఁ డై యుండుట భద్రమంచుఁ దలఁతుఁ
సత్యంబు దైత్యోత్తమా. 53

శా. అంధేందూదయముల్ మహాబధిరశంఖారావముల్ మూకస
ద్గ్రంథాఖ్యాపనముల్ నపుంసకవధూకాంక్షల్ కృతఘ్నావలీ
బంధుత్వంబులు భస్మహవ్యములు లుబ్ధద్రవ్యముల్ క్రోడస
ద్గంధంబుల్ హరిభక్తివర్జితులరిక్తవ్యర్థసంసారముల్. 54

సీ. కమలాక్షునర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించుజిహ్వ జిహ్వ
సురరక్షకునిఁ జూచుచూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కుశిరము శిరము
విష్ణు నాకర్ణించువీనులు వీనులు
మధువైరిఁ దవిలినమనము మనము
భగవంతు వలగొనుపదములు పదములు
పురుషోత్తమునిమీఁదిబుద్ధి బుద్ధి

తే. దేవదేవునిఁ జింతించుదినము దినము
చక్రహస్తునిఁ బ్రకటించుచదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడిగురుఁడు గురుఁడు
తండ్రిహరిఁ జేరుమనియెడితండ్రి తండ్రి. 55

సీ. కంజాక్షునకుఁ గానికాయంబు కాయమే
పవనగుంఫితచర్మభస్త్రి గాక
వైకుంఠుఁ బొగడనివక్త్రంబు వక్త్రమే
ఢమఢమధ్వనితోడిఢక్క గాక

హరిపూజనము లేనిహస్తంబు హస్తమే
తరుశాఖనిర్మితదర్వి గాక
కమలేశుఁ జూడనికన్నులు కన్నులే
తనుకుడ్యజాలరంధ్రములు గాక
ఆ. చక్రిచింత లేనిజన్మంబు జన్మమే
తరళసలిలబుద్బుదంబు గాక
విష్ణుభక్తి లేనివిబుధుండు విబుధుఁడే
పాదయుగముతోడిపశువు గాక. 56

శ్రీ ర స్తు.

శ్రీమదాంధ్రవచనభారతము

ఆరణ్యపర్వము - ద్వితీయాశ్వాసము.

అగస్త్యుఁడు వాతాపియనుదానవుని జీర్ణింపఁజేయుట

ఇల్వలుండు నెదురేగి వారలఁ దనవీడు సేర్చి యంతట నాతిథ్యంబునకుఁ బ్రార్థించి యెప్పటియట్ల మేషరూపధారి యయినవాతాపిని వధించి తన్మాంసంబు వండుచుండె. ఆసడి యెఱింగి యారాజులు సంభ్రమంబు గదుర నద్దానవాధముని దురుద్యోగంబుఁ దేటపఱుప నగస్త్యుఁ డిందుకు విషాదంబు వలదు వానిం గబళింతు ననిబోధించి యారాజుల నూఱార్చె. ఇల్వలోపకల్పితం బయినయాసనంబునఁ గూర్చుండి వానివడ్డించినవాతాపిమాంసం బంతయు మెల్లన నమలి యొక్కఁ త్రేఁపు త్రేఁచె. అట నిల్వలుం డెప్పటియట్ల వాతాపీ! వెడలిర మ్మని పలుమాఱులు పిల్వఁగ నగస్త్యుండు నవ్వుచు నోయిల్వలా! యింకను వాతాపి గలఁడే? వాఁడు నాజఠరంబున జీర్ణుఁడయ్యెననిన విషణ్ణుండై యిల్వలుండు కేల్దోయి మొగిచి మునిపుంగవా! యేల వీరితోడ వచ్చితిరనిన నగస్త్యుం డసురపతీ! నీ వెల్లవారికంటె ధనికుఁడ వని విని ధనార్థులమై వచ్చినవారము. నీపోష్యజనపోషణంబునకు విఘాతంబు గాదేని యీరాజులకుఁ బ్రత్యేకంబ పదివేలమొదవుల, నన్ని గద్యాణంబులను నా కిరువదివేలమొదవుల, నన్ని గద్యాణంబులను, మనోవేగంబులయిన యుత్తమాశ్వంబులం బూన్చినయొకసువర్ణరథంబును విచారించి యి మ్మని చెప్పిన నిల్వలుండు తత్క్షణంబ వాని నెల్లఁ దలంచి తెప్పించి మునిచెప్పినట్ల యారాజుల కంతయు నొసంగి యతనికి విరావ సురావంబు లనుగుఱ్ఱములం బూన్చినకాం

చనరథంబు, నిరువదివేలమొదవుల, నన్ని గద్యాణంబుల నొసంగె. వానిం
గైకొని యగస్త్యుం డారథంబు నారాజులతోడ నారోహించి యతివేగంబున
నాశ్రమంబు సేరి యారాజులఁ దత్తత్పురంబులకుఁ బోననుజ్ఞ చేసి పత్నికో
రినప్రకారంబు నన్నియుం గల్పింప నాలోపాముద్ర యెంతయు సంతో
షించి యింక నపత్యోత్పాదనంబుఁ గావింపు మనిన నగస్త్యుఁ డిట్లనియె.
కల్యాణీ! నీవృత్తంబునం జేసి సంతుష్టుండ నైతి. వేవురఁ గొడుకులఁ గోరికొ
నియెదవో, పదుగురఁ బోలెడువారల నూఱుగుర నపేక్షింతువో, నూఱు
గురఁ బోలెడువారలఁ బదుగుర వలతో, వేవురం బోలెడు వాని నొక్కనిఁ
గాంక్షింతువో యని యడుగ లోపాముద్ర పెక్కండ్రకంటె వేవురఁబో
లెడివాని నొక్కనిఁ బ్రసాదింపుము. ఒక్కరుఁడైన సర్వగుణవిలసితుండు
గావలయుఁ గాని యప్రయోజకులు పలువు రేల? యని చెప్పినం దదభిప్రా
యం బెఱింగి యగస్త్యుండు శుభసమయంబునం జిత్తానువర్తి యగు నాలో
పాముద్రకు గర్భాధానంబుఁ గావించి తపోనుష్ఠానార్థంబు వనమునకుఁ
జనియె. అట లోపాముద్ర యేడేఁడులు గర్భంబుఁ దాల్చె. అంత నెనిమి
దవయేఁట గర్భస్థుఁ డగుకుమారుఁడు సాంగవేదములఁ జదువుచు దృఢస్యుఁ
డనఁబరఁగె. అమ్మునికిఁ దేజస్వియనువాఁడు పుట్టి చిఱుతప్రాయమునం దె
యగ్నిపరిచర్యార్థంబుగ నిధ్మంబులఁ దెచ్చుటంజేసి యిధ్మవాహుండునాఁ
బరఁగె. ఇవ్విధంబున నగస్త్యసంతానంబు పుత్రపౌత్రాభివృద్ధిఁ బొందు
టయుఁ దత్పితృదేవత లుత్తమలోకంబులం గాంచిరి. నాఁటఁగోలె నియ్యా
శ్రమం బగస్త్యాశ్రమం బన విశ్రుతం బయ్యె. ఇది భాగీరథి. తల్లివలె నీద
క్షిణదిక్కు నెల్లఁ బవిత్రీకరించునది. ఇందు మునుఁగుము. ఇది భృగుతీర్థంబు.
ఇందుఁ బరశురాముఁడు తొల్లి శ్రీరామాపహృతం బైనతన తేజంబుఁ
గ్రమ్మఱ నధిగమించె. నీవు నిందుఁ దమ్ములతోడను, ద్రౌపదితోడను స్నానముఁ
గావించిన దుర్యోధనాపహృతం బైనరాజ్యంబుఁ గ్రమ్మఱ సాధింతు వని
రోమశుండు నిరూపించిన ధర్మరా జందు సానుజుండు సభార్యుండుగా

స్నాన మొనరించి దేవపితృతర్పణం బొనరించి యప్రధృష్యతేజంబుఁ బడసి రోమశుం జూచి మునిపుంగవా! పరశురాముని తేజంబును శ్రీరాముఁ డేల యపహరించె. క్రమ్మఱ నతఁడెట్లు దానిఁ బొందె నని యడుగ నమ్ముని యతని కిట్లనియె.

నారాయణుండు రావణవధార్థంబుగ దశరథపుత్త్రుఁడుగ నవతరించె ననుట సుప్రసిద్ధంబు గదా. ఆ శ్రీరామునిపరాక్రమంబు నెఱుంగఁ బరశురాముఁడు తనవిల్లుగొని యయోధ్యకుఁబోవుటయు దశరథుఁడు జామదగ్న్యుని దమదేశముఁ జొచ్చిన వానిఁగ నెఱింగి రాముం బంపె. పరశురాముఁడును దాశరథిం జూచి నవ్వుచు రాజేంద్రా! నీబలంబు చూతము. ఈవిలు మోపెట్టు మని దర్పంబునం బలికిన దాశరథి యీమాటల నేమి ప్రయోజనంబు? ఇదె చూడు మని చెప్పి తత్క్షణంబ పరశురామునిచేతివిల్లు గొని యశ్రమంబున మోపెట్టి సకలభూతంబు లుద్విగ్నంబులుగాఁగ నొన యమ్ము సారింపుచు నిఁక నేమి చేయవలయు నని యడిగె. అడుగుటయుఁ బరశురాముఁడు రాముం జూచి యోహో! మోపెట్టినమాత్రన వీర్యవంతుఁడ వైతివో? ఈ యమ్ము నందు సంధింపుము. ఇందుఁ జూతము నీబలం బని చెప్పి యొకబాణ మిచ్చిన శ్రీరాముఁడు దాని వేగంబ సంధించి కోపదీపితుండై జామదగ్న్య! బ్రాహ్మణులు క్షమావంతు లని లోకవిశ్రుతంబు. నీయందు శాంతియన్న సున్న. తేజ మొక్కండు క్షత్త్రియులకంటె నెక్కుడుగఁ బూని యుండెదవు. బ్రహ్మప్రసాదంబున నన్నధిక్షేపించి పలికెదవు. వృథా గర్వం బుడుగుము. దివ్యదృష్టి నొసంగెద నన్నుఁ జూడు మనియె. అనవుడు నాదివ్యదృష్టిప్రభావంబునఁ బరశురాముఁడు శ్రీరామునిశరీరంబున వసురుద్రాదిత్య సిద్ధసాధ్యదైత్యదానవ యక్షరాక్షసగుహ్యకగంధర్వ పితృమరుద్గణంబుల, గ్రహనక్షత్త్రముల, నగ్నుల, వాలఖిల్యాదిఋషుల, దేవర్షుల, సముద్రముల, సకలనదుల, నిఖిలపర్వతముల, సర్వతీర్థముల, మూర్తిమంతంబులయిన సర్వవేదవేదాంతయజ్ఞవషట్కారంబుల, మేఘబృందములనుం గాంచి

భయవిస్మయభ్రాంతస్వాంతుండై యుండ శ్రీరాముఁ డాబాణము నత
నిపైఁ బ్రయోగించె. ప్రయోగింపఁగ నది పాంసువర్షంబును, జంఝా
వాతంబును, గొఱవ్రలను సంకటం బఱపించుచుఁ బుడమి వడఁక నాజామ
దగ్న్యుని తేజంబు గ్రహించి చనియె. జామదగ్న్యుఁడు నయ్యస్త్రంబు
సోఁక మూర్ఛవోయి కొంతవడికి లబ్ధచేతనుండై లజ్జాభయంబులు పెనంగొ
నఁగ శ్రీరామునకుఁ గృతప్రణాముఁడై యనుజ్ఞఁ గొని మహేంద్రపర్వ
తంబుఁ జేరె. అంత నొక్కవర్షంబు చన నతనిపితరులు మదం బుడిగి దుః
ఖింపుచున్న యాపరశురాముపాలికి వచ్చి పుత్రా! సర్వలోకేశ్వరుం డైన విష్ణు
నెదిరించుటం బట్టి యిట్లు నిస్తేజస్కుఁడ వైతివి. సర్వలోకపూజ్యుం డైన
యమ్మహానుభావుఁ జెనకవచ్చునే? వధూసర యనునదికిఁ జనియందు దీప్తోదం
బనుతీర్థంబాడుము. అందే భవత్ప్రపితామహుం డైనభృగుమహర్షి తీవ్ర
తపంబు సలిపె. తొల్లింటి తేజంబుఁ బొందఁగల వని బోధించిరి. వారి వచనం
బునఁ బరశురాముఁడు తొల్లి యాతీర్థంబునాడి నిజతేజం బధిగమించె ననిన
విని ధర్మరాజు రోమశమునీంద్రా! యగస్త్యచరితంబు సవిస్తరంబుగఁ జెప్ప
వేయని యడుగుటయు నమ్ముని యతని కిట్లనియె.

ఇంద్రుఁడు వజ్రాయుధమున వృత్రాసురుం జంపుట.

ధర్మనందనా! యుద్ధదుర్మదులు, పరమదారుణులు నగు కాలకేయు
లనురాక్షసులు వృత్రాసురునాశ్రయించి నానావిధాయుధంబులం బూని సుర
లకు వివిధబాధలఁ గావింప నమరులు తత్పరాక్రమంబు నివారింప నేరక
యింద్రపురస్కృతులై బ్రహ్మపాలికిఁ జని కృతాంజలు లగుటయుఁ బర
మేష్ఠి వారిమనోభిప్రాయం బెఱింగి సురలారా! మీతలంపు నే నెఱుంగుదు.
దధీచమునీంద్రునొద్దకుఁ బోయి యతనియెముకలఁ బ్రార్థించుఁడు. అతండు
భవత్ప్రార్థనంబు వృథ పుచ్చఁడు. ఆయస్థులఁ దీసికొని వజ్రాయుధంబుఁ
జేయించుఁడు. అద్దివ్యసాధనంబున నింద్రుఁడు వృత్రాసురుం జంపు. ఈయు
పాయంబు శీఘ్రంబ చేయుఁ డనియె. సురలును బ్రహ్మయానతిం గొని

నారాయణపురస్కృతులై సంతతక్రూరమృగప్రచారంబు, సామగానానుకారిమధుకరమధురఝుంకారసమంచితంబు, నానాద్రుమలతావితానంబునై భయానకమహనీయరమణీయంబై యున్నదధీచాశ్రమంబునకుఁ జని తపోమహిమంబున నరుణకిరణకరణిఁ దేజరిల్లుచున్న యమ్మునిం గాంచి బ్రహ్మచెప్పిన ప్రకారంబునఁ బ్రార్థించిరి. తత్ప్రార్థనంబు విని దధీచముని యతిప్రీతుండై సురలకు హితంబుచేయుటకంటె నుత్తమంబు వేఱొండు గలదే. అవశ్యంబు నాదేహంబు నిత్తునని చెప్పి యోగవిద్యామహిమంబునఁ బ్రాణముల విడిచె. అంత సంతుష్టులై సిలింపు లమ్మునియెమ్ముల గ్రహించి విశ్వకర్మచే వజ్రాయుధంబుఁ గావించి కాలకేయగణపరివృతుం డైనవృత్రాసురుని దాఁకుటయు దేవదానవులకుఁ బోరు ఘోరంబయ్యె. అట్టియెడ నప్పటప్పటికి వృత్రునకు బలం బధిక మగుటయు నింద్రుఁడు క్షీణబలుం డగుటయుఁ బరికించి నారాయణుండు తనతేజోమహిమంబున నింద్రునకుఁ దేజోవృద్ధిఁ గావించుటయు నమ్మహేంద్రుఁడు మహర్షులకు మహానందంబు గూరఁ బోరు సేయుచుండ వృత్రుఁడు ఘోరరూపంబుగా సింహనాదంబు లొనరించె. ఆఘోరనిస్వనంబునకుఁ బుడమి వడఁకె. దిక్కు లదరె. నభంబు చలించె. అంత నెంతయు సంత్రస్తుండై యాఖండలుండు వజ్రాయుధంబు వానిపై నేసె. ఏయుటయు వృత్రుఁడు పర్వతంబుమాడ్కిఁ బుడమి యద్రువఁ గ్రిందఁ గూలె. అమ్మహాసంభ్రమంబున నిది యిట్టి దని నిరూపింప నేరక దిక్కు దోఁచక యింద్రుఁ డెద్దియేనికొలను సొరఁగఁ గాందిశీకుఁడై కొంతవడికి వృత్రవధంబుఁ దెలిసి క్రమ్మఱి వచ్చి సురలం బురికొల్పి కాలకేయులఁ జెండాడం దొడంగుటయు నాదానవులు విభ్రాంతులై పాఱి సముద్రంబుఁ జొచ్చిరి. చొచ్చి యాకాలకేయు లంతనిలువక త్రైలోక్యవినాశార్థం బుద్యమించి తమలో మంతనంబు సేయువారు ముందుగ విద్యాతపోవిలసితు లగుబ్రాహ్మణుల వధింతము. వీరు పోయిన జగంబు నశించు. మనము పెఱవారికి దురాధర్షం బయినసముద్రంబు దుర్గంబుగా నాశ్రయించితి మనివిచారింప "వినా

శకాలే విపరీతబుద్ధి” యనున్యాయమున బ్రాహ్మణుల వధింప నిశ్చయించిరి. అట్లు కృతనిశ్చయులై యాదానవులు పగలెల్ల సముద్రమున డాఁగి రాత్రులెల్ల మునిపల్లెలకుఁ బోవుచు బ్రాహ్మణుల వధింపు చుండిరి. ఆవిప్రప్రళయంబున వసిష్ఠాశ్రమమున నూటతొంబదియేడ్గురును, చ్యవనాశ్రమంబున నూఱుగురును, భరద్వాజాశ్రమంబున నిరువదుగురును, నింకను ననేకాశ్రమంబులందుఁ బెక్కండ్రును మహామును లాదుష్టరాక్షసులవలనఁ బొలియుటయు భూమియంతయు బ్రాహ్మణులకండలతండంబులను, నెత్తురుటేరులను, బ్రేవులప్రోవులను, భగ్నంబు లయినకమండలువులను, బగులఁ గొట్టినస్రుక్స్రువంబులను, విశీర్ణంబు లయిన యగ్నిహోత్రంబులను నీరంధ్రంబయ్యె. వేదాధ్యయనంబు, యజ్ఞాచరణంబు, తపోనుష్ఠానంబును గథాశేషంబు లయ్యె. అందఱు ప్రాణరక్షణపరాయణులై దోఁచినట్ల పాఱిరి. శూరులు కొందఱు తద్వధార్థం బాయుధపాణులై యంతటను వెదకి సముద్రదుర్గవాసు లగువారలఁ గాంచ నేరరయిరి.

దేవతలు విష్ణుదేవుని స్తుతించుట.

అంత వేదాధ్యయనయజ్ఞాచరణాదిసత్క్రియాకలాపలోపంబున లోకమునకు వినాశ మాసన్న మగుడు వెఱచి వేల్పులు సేంద్రులై శరణత్రాణపరాయణుం డైననారాయణుపాలికిఁ జని నమస్కరించి దేవా! నీవలన జగంబులు పుట్టుఁ బెరుగు నడఁగు. నీవ సకలకారణంబవు. సర్వంబు నీయందసుప్రతిష్ఠితంబు. నీవ తొల్లి వరాహరూపధరుండవై భూమి నుద్ధరించితివి. నరసింహరూపధరుండవై హిరణ్యకశిపుని సంహరించితివి. వామనరూపధరుండవై బలిని త్రైలోక్యరాజ్యభ్రష్టుం జేసితివి. యజ్ఞధ్వంసకుఁ డైనజంభుఁడనుదానవు వధించితివి. నీకృత్యంబుల లెక్కింప మాబోంట్ల కలవియే? భయభ్రాంతుల మైనమాకు నీవే గతివి. వేఱొక్కదిక్కుఁ గానము. కాలకేయులవలనఁ గలిగినయుపద్రవము నివారించి లోకములను, మమ్మును రక్షింపుము. ఆదురాత్ములు పవలెల్ల నగపడరు. రేలెల్ల గండుమీఱి బ్రాహ్మణుల

వధించుచున్నవారు. బ్రాహ్మణులు క్షయించిన భూలోకంబు నశించు. భూలోకంబు నశించిన స్వర్గము చెడు. బ్రాహ్మణక్షయంబ యిట్లు సర్వనాశంబునకు మూలంబయ్యెడి. కరుణింపుము. నీప్రసాదంబునం గాదే సర్వభూతంబులు పెరుగుచున్నయవి. సర్వభూతవృద్ధిచేతఁ గదా హవ్యకవ్యముల మేము దనియుదుము. అస్మదీయప్రత్యవేక్షణంబునంగాదె భూలోకమున మేలుగలుగు. కావున లోకంబు లన్యోన్యాశ్రయంబున వృద్ధిఁగాంచుచున్నవి. భయంబుడిపి కావు మని విన్నవించిన నారాయణుం డిట్లనియె. సురలారా! ప్రజాక్షయకారణంబు నాకు విదితంబు. మీకుం జెప్పెద వినుండు. వృత్రాసురు నాశ్రయించినకాలకేయు లావృత్రు నింద్రుఁడు వజ్రాయుధంబున వధింపఁగఁ బ్రాణరక్షణార్థంబు సముద్రంబుఁ జొచ్చి వెఱపుదక్కి లోకక్షయార్థంబుగ ఋషుల వధింపుచున్నవారు. సముద్రు నాశ్రయించి యుండునంతకు వారల వధించుట దుష్కరంబు. సముద్రము శోషించిన వారు నిరాశ్రయులై మీకుఁ జిక్కి పొలియుదురు. సముద్రంబును శోషింపఁజేయ నగస్త్యుఁడు దక్కఁ దక్కటివా రెవ్వరు వలఁతులుగారు. కావున వేగంబ మీ రగస్త్యునిఁ బ్రార్థించి సముద్రశోషణంబుఁ జేయించి యాదుష్టరాక్షసుల సంహరింపుఁ డనిన విని యమరు లద్దేవదేవునానతిం గొని యగస్త్యాశ్రమంబునకుఁ బోయి ఋషిగణసముపాస్యమానుం డైనయామైత్రావరుణి మునీంద్రుఁ గాంచి మునీంద్రా! నీవు దురభిమానచిత్తుఁ డైననహుషునకు నాకలోకభ్రంశంబుఁ గావించితివి. క్రోధప్రవృద్ధం బయిన వింధ్యపర్వతంబు వృద్ధి మాన్పి సూర్యగమనంబున కప్రతివిఘాతంబుఁ గల్పించి లోకములతమం బడంచితివి. భయగ్రస్తుల మయినమాకు నీవే శరణంబ వని స్తుతించి రనుటయు ధర్మరాజు రోమశమునీంద్రా! వింధ్య మే క్రోధంబునఁ బెరిగె? అగస్త్యుఁడు దాని పెంపు నేల యడంచె నని యడుగఁగ రోమశుఁ డతని కిట్లనియె.

తొల్లి వింధ్యపర్వతంబు సూర్యుం గాంచి యేల నీవు నిత్యంబును మేరు పర్వతంబునకే ప్రదక్షిణంబుఁ జేసెదవు. ఇఁక మీఁద నాకుఁ బ్రద

క్షీణంబు సేయు మనిన సూర్యుఁడు నే నాత్మేచ్ఛమై మేరువును వలగొనను. మఱి యిది లోకప్రచారార్థంబుగా నాకు విధినిర్మితం బయినమార్గం బని చెప్పిన వింధ్యంబు గినిసి యట్లయ్యేనేని నే నింక సూర్యచంద్రులమార్గంబు నిరోధింతు నని పూని యభేద్యంబుగఁ బెరుగసాగె. దాన సూర్యచంద్రాది ప్రచారంబు నిరుద్ధం బగుడు లోకముల నెల్లఁ గటికిచీఁకటి కప్పుకొనఁగ జగంబున సత్క్రియాలోపంబు వాటిల్లె. అంత నమరు లగస్త్యునిపాలికిఁ బోయి మునీంద్రా! వింధ్యపర్వతంబు సేఁత నెఱుంగుదు గదా. దీనిని వారింప నీవుదక్కఁ దక్కటివారలు నేరరు. కరుణించి దాని పెంపు నడఁగించి లోకములఁ గావు మనిన విని యక్కుంభసంభవముని లోపాముద్రతోడ వింధ్యంబునొద్దకుఁ జనుదెంచి పర్వతోత్తమా! నే నొకకార్యంబున దక్షిణంబునకుఁ బోయెద. తెరువు విడు మని చెప్పి యత్యంతవినయంబున భూసమానం బయినయాపర్వతంబుఁ గాంచి క్రమ్మఱ నిది లేచునొక్కొ యని తలంచి నావచ్చునంతకుఁ దొలంగియె యుండు మని చెప్పి దానిం దొలఁగించి దక్షిణంబునకుఁ జనియె. ఇప్పటికి నగస్త్యుఁడు దక్షిణదిక్కు విడిచి రాఁడు. ఇది వింధ్యంబు పెరుగమికిఁ గారణంబు. అది య ట్లుండె.

అగస్త్యుఁడు సముద్రోదకంబు పానంబు సేయుట.

ఆప్రకారంబున సురలు స్తుతింపఁగ నాకర్ణించి యగస్త్యుండు త్రిదశులారా! యేల వచ్చితిరి? ఏమి చేయవలయు నని యడుగ వారు మహాత్మా! సముద్రజలముఁ ద్రాగుము. దాన నాసముద్రంబు శోషించినఁ దద్గర్భవాసు లగుకాలకేయు లనురాక్షసులను మేము వధింతు మనిన నామైత్రావరుణి యట్ల చేయుదునని యొడంబడి దేవమునిమనుష్యోరగయక్షగంధర్వాదిపరివృతుండై యుత్తుంగతరంగంబుల నర్తనంబుఁ జేయునదివోలె, వాయువిధూననంబునఁ జరించునదివోలె, నురుగుతెట్టల నవ్వునదివోలె నొప్పునదియుఁ దిమితిమింగిల నక్రమకరాది యాదోగణనిరంధ్రంబు నగుసముద్రంబుఁ జేర నరిగి దేవముని ముఖ్యులం గాంచి లోకహితార్థంబు నేను దీని ద్రావెద. మీపనికి సన్నద్ధుల

రయి యుండుఁ డనిచెప్పి యందఱుం జూచుచుండఁగ నప్పారావారనీరంబు నెల్ల నొక్కగ్రుక్కగాఁ ద్రావె. త్రావుటయు నమ్మునిమహాప్రభావంబున కచ్చెరువడి యింద్రాదినిర్జరులు కుంభసంభవమునీంద్రా! నీవ మాకు రక్షకుఁడవు, లోకభావనుఁడవు, నీప్రసాదంబున లోకచ్ఛేదంబు దప్పె నని పెక్కువిధం బుల స్తుతించిరి. గంధర్వవిద్యాధరాదులు తౌర్యత్రికంబును, బుష్పవర్షంబు నుం గావించిరి. అట్లగస్త్యపీతం బయి సముద్రంబు శుష్కం బగుటయుఁ గాలకేయులు నిరాశ్రయులై బయలుపడఁగ నమరులు వివిధాయుధంబులం బూని యాదుష్టరాక్షసులం దాఁకి యురువడించి యనేకుల గీటడంచుటయు హతశేషు లగువారు శోణితసిక్తాంగులై పూచినమోదుగలపగిది నొప్పి వేఱొక్కదిక్కు గానక భయసంభ్రాంతులై పుడమి భేదించి పాతాళంబుఁ జొచ్చిరి. అంత నమరులు మైత్రావరుణిమునిం బెక్కుతెఱంగుల స్తుతించి మునీంద్రా! నీవు ద్రాగినజలము నెల్లం గ్రమ్మఱ విడిచి వారిధి నిండింపుమని యడిగిన నగస్త్యుఁ డాసలిలంబు మదీయోదరంబున జీర్ణం బయ్యె. వారిధి పూరణార్థంబుగ నుపాయాంతరంబుఁ జింతింపుఁ డని చెప్పుటయుఁ దదీయ ప్రభావమున కెంతయు విస్మితులై వా రమ్మునీంద్రుననుజ్ఞఁ గొని తమలో నెట్లు మగుడ సముద్రంబు నిండునొక్కొ యని విచారించుచు నారాయణ పురస్కృతులై బ్రహ్మపాలికిఁ జని ప్రాంజలులై దేవా! యగస్త్యపీతంబై సముద్రము శుష్కం బయ్యె. క్రమ్మఱ నది నిండఁగ నుపాయంబుఁ జెప్పవే యని యడుగ బ్రహ్మ వారిం బ్రసన్నదృష్టి నాదరించి జ్ఞాతికారణంబున భగీరథుఁ డనురాజు పెద్దకాలంబునకు సముద్రంబు సలిలపూర్ణంబుగఁ జేయు వాఁడు. మీరు చనుఁ డనిన విని గీర్వాణులు కాలయోగంబుఁ బ్రతీక్షిం పుచు యథాగతంబుగ నరిగి రనిన విని ధర్మరాజు రోమశమునీంద్రా! జ్ఞాతి నిమిత్తమున భగీరథుఁ డెట్లు సముద్రపూరణంబుఁ జేసెనని యడుగ రోమ శుఁడు ధర్మరాజున కిట్లనియె.

పాండవాగ్రణీ! తొల్లి యిక్ష్వాకువంశమున సగరుఁ డనురాజు హైహయులఁ, దాలజంఘులను జయించి రాజ్యం బేలువాఁడు పెద్దకాలంబు సంతతిం గానక వగచుచు వైదర్భి శైబ్య యనుభార్యలతోడఁ గైలాసమునకుం జని మహాదేవుం, బినాకపాణిం, శంకరు, నుమాపతి, నీశ్వరు నుద్దేశించి పుత్రార్థం బుగ్రతపంబు సేసి యందుకు మెచ్చి సన్నిహితుం డైనయీశ్వరునకుఁ బ్రణమిల్లి పుత్రులం బ్రసాదింపు మని వేఁడుటయు నద్దేవదేవుండు నృపాలా! నీకొక్కభార్యయం దఱువదివేవురుకొడుకు లతిశూరులు, పరమదర్పులు జనియింతురుకాని వారు శీఘ్రంబ క్షయింతురు. మఱియొకభార్యయం దొకకొడుకు పుట్టు. వాఁడే కులవర్ధనుం డగునని వరంబు నొసంగి యదృశ్యుం డైన సగరుఁడు నాతిసంతుష్టుఁడై పురంబు సేరె. ఈశ్వరవరంబునఁ దత్పత్నులు కాలక్రమంబున గర్భిణులయిరి. అందు వైదర్భి కొకసొరకాయ పుట్టె. శైబ్య కొక్కకొడుకు జనించె. సగరుఁడును వైదర్భికిఁ గలిగినయలాబూఫలంబుఁ బరిహరింప నెంచుచుండ "నోరాజేంద్రా! తెంపునఁ దుంబీఫలంబుఁ బరిహరింపవలదు. అందలి బీజములనెల్ల ఘృతపూర్ణపాత్రంబుల నుంచి రక్షించుము. దాన నఱువదివేవురుకొడుకులు జనింతు" రని యశరీరవాణి వినిపించె. ఆవచనంబు విని సగరుఁడు శ్రద్ధావంతుఁడై యయ్యలాబూఫలంబునందలివిత్తుల గ్రహించి వేఱువేఱ ఘృతపూర్ణకుంభముల నునిచి తత్సంరక్షణార్థంబు ప్రత్యేకంబ దాదుల నియమించి రక్షింపుచుండఁ బెద్దకాలంబున కీశ్వరవరంబున నఱువదివేవురుపుత్రులుఁ జనించి కాలక్రమంబునఁ బెరిగి యత్యుద్ధతులై దేవగంధర్వాదు లగుసకలలోకవాసుల నేఁచుచుండిరి. అందులకు సహింపక నిలింపులు పంకజాసనుపాలికిం బోయి తదీయదుశ్చేష్టలఁ దేటపఱుప నప్పరమేష్ఠి శీఘ్రంబ సగరపుత్రులు నశింతురు పొండని చెప్పినఁ దదాజ్ఞం గొని సురలు నిజస్థానంబులఁ జేరిరి.

సగరపుత్రులు కపిలమునికోపాగ్నిదగ్ధు లగుట.

అంతఁ గొంతకాలంబునకు సగరుఁ డశ్వమేధదీక్షితుండై యశ్వంబును

దేశంబులం బంచిన సగరపుత్రులు దాని రక్షించుచు నరుగువారు నిర్జలంబైనసముద్రంబునం దంతర్హితం బయినయత్తురంగంబుఁ గానక వగచి తండ్రియొద్దకుఁ బోయి యశ్వంబుపోక నెఱింగించి తదాజ్ఞఁ దాని నన్వేషింపం బూని సముద్రద్వీపనదీపర్వతకందరాదులయందు నెమకి యెచ్చటను నా గుఱ్ఱంబుఁ గానక మగిడి తండ్రికడకుఁ బోయి భూమండలం బెల్ల నన్వేషించితి మయ్యశ్వం బెచ్చటను నగపడ దయ్యె నని తెల్పిరి. తెల్పుటయు సగరుండు దైవవశంబునఁ గ్రోధవ్యాకులుండై కొడుకులఁ బిలిచి "క్రమ్మఱ నరిగి నెమకి గుఱ్ఱముఁ గొనిరండు. అది లేకుండ రావలవ" దని నియమించె. వారు తండ్రిపంపునఁ జని భూమండలంబున నెల్ల దానిం గానక నిర్జలంబైన సముద్రంబు సొచ్చి యందలిసత్త్వములు వెనవేలుగ నార్తనాదంబులు సేయుచు భిన్నమస్తకత్వగస్థిసంధులై మడియుచుండఁగఁ గరుణ మాని పెద్దకాలంబు త్రవ్వి త్రవ్వి సముద్రపూర్వోత్తరభాగంబునఁ బాతాళంబు సొచ్చి కపిలాశ్రమంబునందు సంచరింపుచున్న యాహయంబుఁ గాంచి సంతసిల్లి తపఃప్రభావసముపలబ్ధదివ్యతేజంబున నగ్నివోలె వెలుంగువాని వాసుదేవాంశసంభూతుం డైనవానిఁ గపిలాచార్యునిం గాంచి కాలచోదితులై యుచితం బెఱుంగక యితండె యీగుఱ్ఱమును నాఁచికొని కపటమునివేషంబున నున్నవాఁడని పలుదెఱంగులం బ్రల్లదంబు లాడి యమ్మహాత్మునిం దిరస్కరించి యమ్మునీంద్రునితీక్ష్ణజ్వాలాభీలం బైనవీక్షణానలంబున దగ్ధులయిరి. సగరుఁడును నారదునివలనఁ బుత్రమరణంబుఁ దెలిసి చింతాశోకవ్యాకులుండై శివాజ్ఞం దలపోసి దైవకృతంబున కేమియుం జేయరా దని యించుక యూఱడిల్లి పౌత్రుఁ డైనయంశుమంతుం బిలిచి వత్సా! నానిమిత్తమున నఱువదివేవురుకొడుకులు కపిలమునికోపానలంబున దగ్ధులైరి. నీతండ్రి యగునసమంజసుని ధర్మంబుఁ బరిశీలించి పౌరజనహితార్థంబు దేశముల వెలువరించితి. దానంజేసి బహుపుత్రకుఁడనయ్యు నపుత్రకుని పోలె వనటలఁ గుందవలసె నని చెప్పె ననిన విని ధర్మరాజు సగరుఁ డేల

4

కొడుకును విడిచె! పుత్రుల విడుచువారును జగంబులం గలరే? అని యడుగ రోమశుం డిట్లనియె.

సగరునకు శైబ్యయందు జనించినకుమారుఁ డసమంజసుఁ డనువాఁ డసమంజసస్వభావుండు పురంబునఁ గొండికలం బట్టి తెచ్చి నదిలోఁ ద్రోసి చంపుచుండె. పౌరులు భయవిషాదవిహ్వలులై సగరుం జేరనరిగి కేలుమొగిచి యసమంజసుచేఁతల విన్నవించి మహారాజా! నీవలన మేము శత్రుభయములఁ దొఱంగితిమి. ఇపు డీయసమంజసువలని వెఱపు వాపి గావవే యని మొఱపెట్టుకొనిరి. పౌరవచనంబు విని సగరుండు కొడుకుం ద్రోయ నేరక వగచి కొంతవడికి ధర్మంబు పరికించి మంత్రులఁ బిలిచి నిరపరాధు లగుపౌరబాలుర వధించునట్టిదుశ్శీలు నసమంజసుని నాకుఁ బ్రియంబుగాఁ బురంబు వెలువరించునది యనియాజ్ఞాపించుటయు వారట్లు చేసిరి. ఇది సగరుండు కొడుకుం బరిహరింపఁగఁ గారణంబు. అది యట్లుండె.

సగరుం డట్లు పౌత్రుఁ డైనయంశుమంతునకుఁ జెప్పి వత్సా! పుత్రమరణంబునకు నే నంతగఁ జింతింపను. విధికృతంబుఁ దప్పింప నలవికాదు. యజ్ఞవిఘ్నమున కెంతయుఁ జింతిల్లుదు. కావున నాగుఱ్ఱంబుఁ గొనివచ్చి యజ్ఞము సంపూర్ణముఁ గావింపు మని పంచె. అంశుమంతుండు పితామహు పంపున వెడలి సగరసుతులు త్రవ్వినత్రోవనే పాతాళంబున కరిగి గుఱ్ఱముఁ గనుంగొని పురాణఋషివర్యుం డైనకపిలాచార్యు నవలోకించి భక్తిమై సాష్టాంగదండప్రణామంబు లొనరించి యుపాసించి యుండె. అంత సుప్రీతుండై కపిలమునీంద్రుఁడు వరంబులు గోరికొను మనిన నంశుమంతుఁడు యజ్ఞనిర్వాహార్థంబుగా నాగుఱ్ఱమును, బ్రాహ్మణకోపదగ్ధు లయియున్న తండ్రులకుఁ బావనత్వంబునుం గోరికొనిన నమ్ముని యిట్లనియె. అనఘా! నీకోరినవరంబు లిత్తు. శాంతిసత్యాదులు నీయందు సుప్రతిష్ఠితంబులు. నీవలన సగరుఁడు కృతార్థుఁ డయ్యె. నీప్రభావంబున సగరపుత్రులు స్వర్గంబుఁ గాంతురు. నీపౌత్రుఁడు గంగాదేవిం బ్రార్థించి మహేశ్వరుం దపమున

మెప్పించి సగరసుతులఁ దరింప స్వర్గముపుండి యమ్మహానదిం దెచ్చువాఁడు. గుఱ్ఱముఁ గొనిపోయి నీతాత జన్మంబు పూర్ణంబుఁ గావింపు మనిన నంశు మంతుఁ డమ్మునియనుజ్ఞతోడ నశ్వంబు గ్రహించి కొనివచ్చి పురంబు సేరి సగరునడుగుల కెఱఁగి యావృత్తాంతమంతయుం దెలుపఁగ నతండు పుత్ర శోకం బుడిగి సురలు మెచ్చఁగ నశ్వమేధంబుఁ జేసి సముద్రుం దనకుఁ గొడుకుఁగా భావించుకొనియె. అది మొదలుగా సముద్రంబు సాగరం బనం బరఁగె. అట్లు సగరుండు నిర్వర్తితయజ్ఞుండై పెద్దకాలంబు రాజ్యంబుఁ బాలించి యంతం బౌత్రుఁ డగునంశుమంతునందు రాజ్యభారం బెల్ల నిల్పి త్రిదివగతుం డయ్యె. అట నంశుమంతుండును బహువర్షంబులు రాజ్య మేలి పుత్రుఁ డయినదిలీపునకు రాజ్య మిచ్చి చనియె. దిలీపుఁడు తన పితామహులగతికి వగచుచు గంగను దేఁదలంచి మహాయత్నంబుఁ జేసియుఁ దేఁజాలక కొడుకయినభగీరథుని భూభారధురీణుంజేసి తపోవనంబున కరిగి కాలయోగమున స్వర్గతుఁ డయ్యె.

భగీరథుఁడు భూమికి గంగను దెచ్చుట.

భగీరథుండు దనపితామహులు కపిలమునికోపాగ్నిదగ్ధులై స్వర్గంబుఁ గాంచకున్నవా రని విని సంతప్తచిత్తుండై మంత్రులయందు రాజ్యంబు నిల్పి వివిధధాతువిచిత్రితశిఖరభాసురంబును, గుహాగృహాంతరవిలీనసింహవ్యాఘ్రాదిక్రూరమృగభీకరంబును, హంసకారండవాదిప్రచారరాజితపద్మినీవికస్వర సరిత్సరోవరసమంచితంబును, శుకపికమధుపమయూరసారసాదిమధురస్వర భాస్వరంబును, కిన్నరాప్సరోగణాదిసలీలనిషేవితవిమలవిశాలశిలాతలంబును, నొక్కచోఁ గనకసంకాశంబును, మఱియొక్కచో రజతసన్నిభంబును, వేఱొక్కచో నంజననీలంబు లగుహిమవత్పర్వతంబునకుఁ జని ఫలమూలసలిలంబుల నాహారంబుగాఁ గొని గంగాదేవి నుద్దేశించి దివ్యవర్షసహస్రంబు తపంబు సల్పినం గంగ ప్రత్యక్షంబై నరేంద్రా ! నీమనోరథం బెద్ది? చెప్పుము.

దానిఁ జేయుదు నని వాక్రుచ్చె. వాక్రువ్వఁగ భగీరథుఁడు సంతుష్టుండై తల్లీ! మత్ప్రపితామహులు సగరపుత్త్రులు తండ్రి యశ్వమేధార్థంబుగ పంపినగుఱ్ఱము నన్వేషించువారు కపిలు ననాదరించి యమ్మహాత్మునికోపాగ్నిం గ్రాఁగి గతిరహితులై యున్నవారు భవదీయపావనజలముల నభిషేకించితి వేని స్వర్గముఁ గాంతురు. ఇది మదీయవరంబు. కరుణించి నామనోరథంబు నెఱవేఱఁ బుడమికి విచ్చేయుము మని విన్నవించిన నమ్మహానది సుప్రీతయై భగీరథా! నీకోరినయట్లు చేసెద. నేను నాకలోకంబునుండి భూమికి వచ్చు నపుడు మదీయవేగంబు సహించి నన్ను ధరింప మహాదేవుఁ డొక్కరుఁడు దక్కఁ దక్కటి వారు వలంతులు కారు. అప్పరమేశ్వరుం దపమున మెప్పింపు మని చెప్పి యదృశ్య యయ్యె. అట భగీరథుండు కైలాసమునకుఁ జని తీవ్రతపంబు సలిపినం ద్రిపురాంతకుండు సన్నిహితుండై భగీరథా! నీప్రార్థనంబుమెయి నే గంగను ధరింతు నని చెప్పి పార్షదగణపరివృతుండై హిమవంతంబుఁ జేరి యింక గంగను బ్రార్థింపు మనిన భగీరథుండు సమాహితుండై గంగాదేవిని ధ్యానించె. అంత నప్పరమపుణ్యనది యుత్తుంగతరంగమాలికాప్రచారంబు తారాపథంబు నొరయుచుండ మహర్షులు, గంధర్వోరగయక్షాదులును విస్మయంబునఁ జూచుచుండ నాకలోకంబునుండి మహారయంబున మహానటజటాజూటంబు సొచ్చి ముత్తైపు దండవో నాఁగ నాశూలపాణిఫాలదేశమున ముత్త్రోవల నెనయుచుఁ బైపై నొలయునురుఁగు నునువగవు ననుకరింప, నొక్కొక్కచోఁ గుటిలప్రచారంబు లలిత లజ్జావిలాసంబు తెఱంగు సూపఁ, ఘోషనిస్వనంబు మధురవచనరచనరీతిఁ దెలుపఁ దరుణివోలె హరజటాజూటంబునుండి భూమికి డిగివచ్చి భగీరథుం గాంచి మహారాజా! నీకుఁ బ్రియముసేయఁగ నిటకు వచ్చితి. ఎటు పోవలయు. త్రోవచూపుమనిచెప్పి భగీరథోపదిష్టమార్గమున సగరసుతుల కళేబరంబులున్ననిర్జలసముద్రంబునకుఁ బోయి వారలఁ బవిత్రులఁ జేసె. ఈశ్వరుఁడును భగీరథప్రార్థనంబు నెఱవేర్చి కైలాసంబునకుఁ జనియె. ఇట్లు భగీర

థుండు సగరపుత్రులకు సద్గతిగా సాగరంబు సలిలసంపూర్ణంబుగా గంగానదిని భూలోకంబునకుఁ దెచ్చి యమ్మహానదిం దనకుఁ గూఁతుఁగా భావించికొని పితరుల కుదకదానంబు నొనర్చి పూర్ణమనోరథుం డయ్యె. నాఁటంగోలె గంగానది భాగీరథి యను పేరఁ బరఁగుచున్నయది యని రోమశుం డగస్త్యచరితంబును, గంగావతరణంబునుం జెప్పిన విని ధర్మనందనుం డటఁ జని నందయు, నపరనందయు ననునదుల నాడి హేమకూటంబు సేరి యచట నెల్లప్పుడుం గననగుశిలాపతనంబు, వాతావిధూననంబు, నిత్యవర్షంబు, పఠించువా రగపడకున్నను వేదాధ్యయనఘోషంబు వినవచ్చుట, సాయంప్రాతఃకాలములయం దగ్ని ప్రజ్వరిల్లుట, యీఁగెలుఁ కఱుచుట మొదలుగా నిర్వేదజనకంబు లయినయద్భుతభావంబులం గని ధర్మసుతుం డిదియేమి యని యడుగ రోమశుఁ డిట్లనియె.

విరాటపర్వము - ప్రథమాశ్వాసము.

కౌరవు లుత్తరగోగ్రహణంబుఁ జేయుట.

అంత మఱునాఁడు సూర్యోదయసమయంబున దుర్యోధనుండు భీష్మద్రోణకృపాశ్వత్థామకర్ణసౌబలదుశ్శాసనవివింశతివికర్ణచిత్రసేనదుర్ముఖదుస్సహాదులయినమహారథులతోడ బహుళసేనాపరివృతుండై యెత్తి వచ్చి విరాటనగరంబున కుత్తరముగ ఘోషముల నాక్రమించి యఱువదివేలగోవులఁ బట్టి గోపాలురఁ దన్నిన వారు వెఱచి యఱచిరి? అందులకు భయం బంది గోపాధ్యక్షుండు సత్వరంబుగ రథారూఢుండై మత్స్యరాజధాని కేతెంచి యారాజు త్రిగర్తేశ్వరుపై నెత్తిచనుట నెఱింగి రాజద్వారమున రథము డిగి యంతఃపురమున నున్న భూమింజయుని విరాటపుత్రు నుత్తరకుమారుం గాంచి కృతాంజలియై రాజపుత్రా! కౌరవులు భీష్మద్రోణకృపాదు లగుమహారథులతోడ వచ్చి మనఘోషముల నాక్రమించి గోపాలుర నిగ్రహించి యఱువదివేలగోవుల గ్రహించికొని పోవ నున్నవారు. మత్స్యేశ్వరుండు

పేరోలగంబుండి సభాసదులు వినంగ నస్మత్పుత్రుం డైనభూమింజయుండు శూరుఁడు కులోద్వహుఁడు ధనుర్విద్యావిశారదుఁడు నాకు సమానుం డని ని న్నెల్లప్పుడుం బొగడుచుండు. రాజువచనంబుల కనుగుణంబుగా వారలెవ్వరును లేనియిట్టిసమయమున నీవు విక్రమించి సూర్యకిరణప్రచారంబు గలుగకుండ బాణములనంతటంగప్పి భీకరంబైన తేజంబునం గౌరవసేన నేర్చి గోగణములు మఱల్పుము. శ్వేతతురంగరాజితంబు సింహకేతనవిలసితంబు నగు రథోత్తమం బారోహించి రాక్షససంహారోద్యతుం డైనసురేంద్రు నిరీతిం బోలిచి పగఱ గెలిచి యశముఁ గొనిరమ్ము పాండవులలో నర్జునుండెట్లట్ల నీవు మత్స్యవీరులలో నగ్రగణ్యుండవు. దేశవాసు లందఱు నీవలనం గలిమంతులగుతెఱంగుగా నేఁడు వాఁడిమి మెఱయ వలయు నని గోపాధ్యక్షుం డంతఃపురంబునం జెప్పిన నుత్తరుఁ డుబ్బి యాత్మప్రశంసాపరుండై యిట్లనియె. ఏ నీక్షణము కౌరవులపై నెత్తిపచ్చెద నాకుఁదగినయుత్తమసారథి నశ్వతత్త్వవేది నొక్కనిఁ జూడుఁడు. తొల్లిమాసమాత్రంబు మహాయుద్ధంబైన నప్పుడు నాసారథి హతుండయ్యె. తగినసారథి లభించెనేని యుత్తమరథంబున సింహధ్వజం బెత్తించి యతిత్వరితగతింబఱచి కౌరవులం గూడముట్టి దేవేంద్రుఁడు దానవులఁబోలె భీష్మద్రోణకృపాశ్వత్థామకర్ణాదు లగుమహారథులను దుర్యోధను నోడించి గోవులమఱల్చి ముహూర్తమాత్రమున మగిడి వచ్చువాఁడ. శూరుఁడెవ్వఁడును లేమింజేసి వారు గోధనంబాక్రమించిరి. ఏమిచేయవచ్చు. అప్పుడు నే నుంటినేని వారు గోగ్రహణంబుసేయ నోపుదురే? ఇంకఁ గడచినది విచారింప నేల? ఇప్పుడు వెంబడిం జని యితం డర్జునుఁ డొక్కొయని సంభ్రమించి చూచునట్లుగాఁ గడిందిమగంటిమి నెఱపుదునని యిట్లు పలుతెఱంగుల నుత్తరకుమారుఁ డాత్మప్రశంసఁ జేసికొనుచుండ నర్జునుండు సమయాబ్ధంబులు నిన్నటితోఁ గడచనియె. నిఁక బయల్పడవచ్చు నని తనలో నూహించి సత్యార్జవాదిగుణసమన్వితయుఁ బతిప్రియహితరతయు నయోనిజయు నగ్నివేదీసముద్భూతయు నగుపాంచాలరాజపుత్త్రి నేకాంతంబునం బిలిచి యిట్లనియె. ఉత్తరుఁడు సారథిని వెదకుచున్నవాఁడుగదా. బృహన్నల లెస్సగ

సారథ్యంబు సేయ నోపు ననియు, ఖాండవదహనమున నర్జునునకు సారథియై యతనికి విజయం బాపాదించె ననియుఁ జెప్పి నన్ను సారథిగాఁ గొనిపోవు నట్లు సంవిధానంబుఁ జేయుమని చెప్పఁగ ద్రౌపది నారీమధ్యమునఁ దన్నుఁ బొగడికొన్నవానికి విజయుండు సారథి యగుటకు మనసు గొలుపకుండిన నుపాయంబునఁ గార్యము నెఱవేర్చుట ప్రధానంబని నిశ్చయించి లజ్జితయుం బోలె మెల్లన వానిఁజేరం జని యిట్లనియె. రాజనందనా! మత్తశుండాలంబుచాడ్పునఁ బ్రియదర్శనుండై తారుణ్యంబున నుల్లసిల్లు మనబృహన్నల సారథ్యం బెంతయు నేర్చు. అస్త్రవిద్యాచాతుర్యంబున నర్జునుండే యనఁ బరఁగి యమ్మేటివిలుకాని కెన్నియేమాఱులు సారథ్యంబుఁ జేయుచుండఁగ నేఁ జూచితి. ఫల్గునుండు ఖాండవం బేర్చునపు డీబృహన్నలయే సారథియై యవ్వీరునకు విజయం బాపాదించె. అట్టిసారథిని నే నెచ్చటనుం గానను తత్సారథ్యమున నీవును విజయంబుఁ గొనుమనిపలికిన విని యుత్తరుండు సైరంధ్రీ! పేడి సారథ్యము సేయు ననుట యొప్పునే? ఐనను నీవు చెప్పుటం జేసి బృహన్నలను సారథిగా గ్రహింతు. నాకు సారథి వగుమని నేన యా పేడితో నెట్లు చెప్పుదు నని మాఱుపలికినం బాంచాలి వెండియు నతని కిట్లనియె. కుమారా! నీవు తచ్చాతుర్యం బెఱుంగమింజేసి యిట్లు పల్కెదువు. బృహన్నల సారథి యైన నీవు కౌరవుల గెలిచి యవశ్యము గోగణంబు మఱలించివచ్చుట నిక్కంబు. బృహన్నలతో నీయర్థముఁ జెప్పఁగ నీచెలియలగు నుత్తరం బంపుము. తద్వచనంబు దెస నాదరంబుకలిమింజేసి బృహన్నల భవత్సారథ్యం బియ్యకొను ననిన నట్లయని యుత్తరుం డుత్తరం బిలిచి యమ్మా! బృహన్నల సారథ్యం బెంతయు నేర్చు ననియు నర్జునునకు ఖాండవదాహమున సారథియై జయం బాపాదించె ననియు సైరంధ్రి చెప్పె. కావున నీవు బృహన్నలయొద్దకుఁ బోయి యిపుడు నాకు సారథిగా నొడంబఱిచి తోడికొని రమ్మని పనిచె.

ఉత్తరుఁడు బృహన్నలను సారథిఁగాఁ జేసికొని కౌరవులపై నెత్తిచనుట.

పనిచిన నత్తన్వి మయూరపింఛమౌక్తికహారాద్యలంకారకాంతులఁ గపిలంబైన నెమ్మేని మెఱుఁగు తెఱువున కొకవింతకాంతిఁ బచరింపఁ జన్నుఁగవ వ్రేఁగున నసదుకౌను వడఁకఁ బృథునితంబోరుభారము గమనమాంద్యముఁ బొందుపఱుప మణిమేఖలాకింకిణీమృదురవంబు సొంపు పెంపార నంబుద మండలంబుఁ దఱియంజొచ్చుక్రొక్కాఱుమెఱుంగుతెఱంగున నర్తనాగారంబున కరిగి మదగజేంద్రంబుఁ జేర నరుగుకరేణువుచాడ్పున నర్జును డాయం జని తామరఱేఁకులంబోలుకన్నులఁ గటాక్షించి యతనిఁ గనుంగొనుచున్నంత నతండు నగుచు విరాటరాజపుత్త్రీ! యేల యిపుడు వేగంబ వచ్చితివి? నీమొగంబుఁ గనుంగొనఁ గార్యవిశేషంబునం జేసి కాఁబోలు నెప్పటియట్ల ప్రసన్నంబుగా నున్నది. ఎయ్యది కర్తవ్యంబు చెప్పుమనియడుగఁ బ్రేముడి గడలుకొనంగ సఖీమధ్యమున నాసుదతి యిట్లనియె. మాగోగణంబులఁ గౌరవులు నిగ్రహించి పట్టికొనిరని కూయి వచ్చిన విని మాయన్న యగునుత్తరుం డెత్తిచని వారల గెలిచి గోగణంబుల మఱల్చి రాఁ దలంచి తనసారథి మున్నొకసంగరంబున హతుఁడగుటం జేసి తగినసారథి నరయుచుండ సైరంధ్రి వచ్చి నీవు హయతత్త్వంబు లెస్స యెఱింగి సారథ్యంబుఁ జేయ నోపుదు వనియుఁ, బాండవవీరుం డైన యర్జునునకుఁ దొల్లి సారథివై చెప్పరంబు విజయం బాపాదించితి వనియు, నీవు సారథి వైనం గౌరవుల గెలుచుట చులుకన యనియుం జెప్పె. సైరంధ్రివచనము విని మాయన్న నన్నుఁ బిలిచి నిన్ను సారథ్యమున కియ్యకొల్పు మనిపచించిన నేను నీయెడ నొకించుక చనువు కలిమిం జేసి యట్లయని వచ్చితి. కౌరవు లింతకుఁ బసుల నెంతయు దవ్వు గొని పోయియుండుదురు. ఆలసింపక మాయన్నకు సారథివై యరుగుము. నామాట వినక యొప్పరికించి చూచెదవేని జీవితముఁ ద్యజింతు నని చెప్పిన నుత్తరా వచనంబు విని యర్జునుండు దానిమాట త్రోచిపుచ్చనివానివోలె నియ్యకొ

నినయట్లు భావించి యారాజపుత్త్రి తోడరాఁగ నుత్తరునొద్దకుఁ జనియో అతం డర్జును దవ్వునం గాంచి బృహన్నలా! ధనంజయుండు తొల్లి నీవు సారథి గాఁగ ఖాండవదహనంబును దిగ్విజయంబునుం జేసి జయంబుఁ గొనియె నని సైరంధ్రి వచించె. పాండవుల నెల్ల లెస్సగ నెఱింగిన సైరంధ్రిమాట యసత్యంబు గాదు. గోధనము మఱల్పఁగఁ గౌరవులతోడఁ బోరాడఁ జను నాకు సారథి నగు మనిపలికిన విని యర్జునుఁడు గీతవాదిత్రనృత్యంబుల చాతుర్యంబు నేర్చినకొలఁది చూపుదునుగాని నే నెక్కడ? సంగ్రామం బెక్కడ? సారథ్యం బెక్కడ? న న్నిట్టిపనుల నియోగించిన నే మన వచ్చు నని మాఱు చెప్పె. ఉత్తరుఁ డామాటల నాదరింపక బృహన్నలా! నీవే నాకు సారథ్యంబుఁ జేయవలయు. నీచాతుర్యంబు గీతవాదిత్రాదుల నెక్కుడుగ నున్నయట్లు సారథ్యంబునందు నుండు నని తలంచెద. ఇఁక నడ్డము చెప్పవల దని నిర్బంధించి శీఘ్రంబు తేరాయితపఱిచి తె మ్మనిచెప్పి కవచం బొక్కటి తెప్పించి యిచ్చుటయు నర్జునుం డుత్తరుం జూచి రాజనందనా! మీప్రాపున నునికిం జేసి మీయానతి మెయి నడపవలయుం గావునఁ బూనితి ననిచెప్పి యేమియుం దెలియని వానిబోలె నాకవచంబు మీఁది కెత్తి యఱుతం దగిలించికొని యచటియబలాజనంబుల నగిస్ంచి యట సింహధ్వజం బెత్తి తేరు సవరించి వివిధాయుధముల నం దమర్చి తెచ్చె. అంతలో నుత్తరుండు దృఢతనుత్రాణంబుధరించి యుద్ధసన్నద్ధుండై రథారోహణంబు సేయ నున్నంత నుత్తర మున్నుగాఁగల కన్యాజనంబు లర్జునుం జేరవచ్చి బృహన్నలా! భీష్మద్రోణాదు లగుకౌరవవీరుల జయించి వారితలచీరల బొమ్మపొత్తికలకుఁగాఁ దెచ్చి యిచ్చి మాకు మనఃప్రియంబుఁ గావింపు మని యడిగిన నవ్వుచు నర్జునుండు మేఘగంభీరనినాదం బేర్పడ నుత్తరకుమారుఁడు పోరఁ గౌరవుల జయించినం దెత్తు నని యొడంబడి వారికి మనఃప్రియంబు నొనరించి యుత్తరుననుమతిఁ గొని రథంబుఁ దోలుటయు నంతఃపురకన్యకాజనంబులు పౌరపురంధ్రులుం బ్రదక్షిణంబుగా నెదురువచ్చి యర్జుననకు ఖాండవ

దహనాదిసమయంబుల నాపాదించినవిజయంబు నేఁడుకౌరవులతోఁడికయ్యం బున నుత్తరునకు బృహన్నల కావించుత మని దీవించిరి. అట్లు తఱలి పురంబు వెడలి యుత్తరుండు సారథిం బిలిచి బృహన్నలా! రయమున మనరథముఁ బఱపు మనిన నట్లేయని యర్జునుండు గోపాధ్యక్షునివలనఁ గౌరవసేనయున్న చోటెఱింగి గుఱ్ఱములఁ దోలుటయు నయ్యవి యర్జునచోదితంబులై యంత రిక్షంబునొరయుఁరీతిం బలుమాఱులు పూర్వకాయంబు లెగయించుచు నతి రయంబునం బఱచి పరేతనిలయపరిసరప్రదేశంబునం బాండవు లాయుధములు నిక్షేపించిన శమీవృక్షంబు డాయం జనుటయు నుత్తరుండు గగనంబునం జరించు నానాపాదపసంకీర్ణారణ్యంబుచాడ్పున సైనికచరణఘట్టనసముత్థిత ధూళీపటలం బెగసి తారాపథంబున నతిసాంద్రంబయి యెసంగ సర్వభూత ములకు దృష్టిప్రతిఘాతంబుఁ గావించుచున్న కౌరవసైన్యంబును బహుళ గజరథహయపదాతిసంకులంబైనదాని భీష్మద్రోణకృపాశ్వత్థామకర్ణ దుర్యో ధనప్రముఖధనుర్ధరశేఖరసురక్షితంబైనదాని, సాగరంబువోలె ఘూర్ణిల్లుచున్న దానిం గనుంగొని భయాతిశయపులకితశరీరుండై పార్థున కిట్లనియె.

ఉత్తరుఁడు కురుసేనం జూచి భయభ్రాంతుఁ డగుట.

బృహన్నలా, కౌరవసేనం జూడఁగ మేను భయమున గరుపాఱె. కురువీరులతోఁడిపోరాట నాకు వలదు. దేవతలసైనం జెనకరాని చతురంగబల సమన్వితం బయినభారతసైన్యంబు మార్కొన నే నెంతవాఁడను? భీష్మ ద్రోణకృపాశ్వత్థామకర్ణ వికర్ణబాహ్లికసోమదత్త దుర్యోధనదుశ్శాసనాదు లగుమేటిమగలం జూచినప్పుడే నామనంబు కలగుండువడియె. మాతండ్రి త్రిగర్తయోధులతోడఁ బోరాడఁగ సైన్య మంతయుం గొని నన్నొకని వీట నునిచిపోయె. అసహాయుఁడ, బాలుఁడ, నకృతాస్త్రుఁడ, నకృతపరిశ్ర ముఁడ నగునే నెక్కడ? అనేకుల, బాలురు, శస్త్రాస్త్రవిద్యావిశారదులు, సంగరంబుల మేటిబిరుదుల గెలిచి యశముగొనినశూరులు నగుకౌరవవీరు

లెక్కఁడ? రథంబు మఱలింపు మనిన నర్జునుండు వాని కిట్లనియె. రాజపుత్త్రా! శత్త్రుజనులు సంతసించునట్లుగా నీ విట్లు వెఱవనేల? ఇప్పటికి శత్త్రు వేమియుం జేయరైరి. ఇప్పుడే యిట్లు భయపడిన నీఁక నెట్లు వారల నోర్తువు? స్త్రీమధ్యమున నట్లు పౌరుషంబు నెఱయఁ బలికి నన్ను సారథిఁగా రమ్మని పిలిచికొని వచ్చి శత్త్రువులం జూచినంతన వెఱచి పాఱిన నాఁడు వారును నవ్వుదురు. ఇఁక వీరులం జెప్పనేల? కావున గోవుల మఱలింపక యూరక పురంబునకుఁ బోవుట నా కెంతయు నొప్పదు. ఆమిషలోలుపంబులయిన గృధ్రములవిధమున గోధనలోలుపులైనకురువీరులమధ్యమున నీరథముఁ బఱపించెద. వారిధ్వజములకు వెఱవక శూరుండవై పోరాడుము. నీవు పోరాడకున్న సైరంధ్రీస్తోత్త్రంబునను భవద్వచనంబునను వచ్చిననేనైనం గడిందిమగంటిమిఁ దెచ్చికొని కౌరవులతోడఁ బోరాడుదు. ధైర్యమున స్థైర్యం బవలంబింపు మనిపలికిన నుత్తరుండు కౌరవులు గోవుల నితరధనము నాక్రమించికొనిపోయినం బోవుదురుగాక. ఆఁడువారలు సైతము నన్నుఁ జూచి నగిన నగుదురుగాక. నే నీసంగరంబున నిలువ నోపను. ఊరికిఁ బోయి ప్రాణముల రక్షించికొనియెద నని చెప్పి పరిత్యక్తమానదర్పుండై విల్లమ్ముల విడిచి తేరు డిగ్గ నుఱికి పాఱె. పాఱుటయు నర్జునుండు కుమారా! క్షత్త్రియులకియ్యది యనుచితంబు. యుద్ధమునఁ బలాయనము సేయుటకంటెఁ జావైనను మేలు. మఱలు మనిచెప్పుచుఁ దానును రథావతరణంబు చేసి దీర్ఘవేణి వీఁపున వ్రేలుచుండఁగ శుక్లపరిధానంబులు చలించుచుండఁగఁ బలాయనపరుండైనయుత్తరకుమారుం గూడముట్టి నూఱడుగులంతదవ్వు పఱచి వాని నెయిది యాయతబాహువులఁ జాఁచి శిఖాకలాపంబుఁ బట్టి నిలిపె. అర్జునుఁ డుత్తరువెంబడిం బాఱునపుడు కురుసైనికులు కొంఱ అతని వికృతరూపంబుఁ జూచి తత్త్వం బెఱుంగక నగుచుండఁ దత్త్వవిదులైనకొందఱు వాని లెస్స చూచి యెవ్వఁడో యితఁడు నివ్రుఱు గప్పిననిప్పుచాడ్పున నిజస్వరూపంబు దాఁచికొని యున్నవాఁడు. స్త్రీపుంసలక్షణంబులు రెండును వీనియెడం గన్పట్టు

చున్నవి. ఉత్తమాంగంబుఁ గంఠంబుఁ బరిఘప్రాంశువులయిన బాహువులను నడకనుం జూచిన నర్జునుఁడుగానోపు నని యూహ వొడము. అతండు షండరూపంబుఁ దాల్పఁ గతం బెద్దియో యెఱుంగరాదు. మఱియు లెస్స పరిశీలించిన నితండు ధనంజయుండని తోఁచు. అతఁ డొక్కఁడకదా సురలలో నింద్రునిమాడ్కి మనుజులలో నుత్తముఁడు. అవ్వీరుఁడుగాక మఱియొక్కరుండగునేని యొంట దక్కి యసహాయుండై మనల మార్కొని రాఁజాలునె? సుశర్మ దక్షిణగోగ్రహణముఁ జేయఁగ విరాటుఁడు తన సకల సైన్యముతోడ నాత్రిగర్తపతిని మార్కొనఁ జనియుండు మనము నేఁడిచ్చటఁ బసులం బట్టిన నుత్తరుండు బాలభావంబునం జేసి యెఱుంగక వేషప్రచ్ఛన్నుం డైనపార్థుని సారథిఁగాఁ గొని యిచ్చటికి వచ్చినవాఁడు. మత్స్యదేశసుగుణంబుల నరసి పాండవులు విరాటునిప్రోల నున్నవా రని యూహించితిమి కదా. వార లచ్చటనే గూఢముగ నుండుదురు. ఇపుడు పెద్దయుదెప్పరంబు పొసంగుటం జేసి యర్జునుండు వచ్చినవాఁడు. ఉత్తరుఁడును మనలఁ జూచి వెఱచి పఱచినం గిరీటి వానిం బట్టికొనుచున్నవాఁడు. ఇది యిట్లగా నోపు నని తమలో నిశ్చయించుచుండిరి. అట్లుత్తరుం డర్జునుచేఁ బట్టువడి యార్తుండై బృహన్నలా! నామాటవిని తేరు మగిడింపుము. బ్రదికి యుండినం గాలక్రమంబున శుభములఁ బడయవచ్చుఁ గావునఁ బ్రాణరక్షణం బన్నింటికంటె నుత్తమంబు. తేరు మగిడించి నన్ను వీటికిఁ దోడికొని పోయితివేని నీకు నూఱుపసిండి గద్యాణంబులను, స్వర్ణఖచితంబు లయిన యెనిమిదివైడూర్యములను, గాంచనస్తంభపరిష్కృతం బయినరథమును, బది మదపుటేనుంగులను సమ్మానంబుగా నిచ్చెద నని వెఱపునం దాఱుమాఱు పలుకుచుఁ బలవించుచున్న యుత్తరకుమారుని నవ్వుచు మెల్లన రథసమీపమునకుఁ దోడితెచ్చి యుపలాలించి రాజపుత్రా! వెఱపు విడువుము. నీవు కౌరవుల మార్కొనఁ జాలవేని యేను గడిమి మెఱయ వారలతోఁ బోరాడెద. మద్బాహుబలరక్షితుండవై నాకు సారథ్యంబుఁ జేయుము. క్షత్రియకుల

ప్రసూతుం డైనవాఁడోట దక్కి యోపినంత పెనంగవలయుఁగాని నీయట్లు శత్రులు చూచుచుండ వెఱచి పాఱిపోవం దగునే? యని పలుదెఱంగుల నాశ్వాసించి క్రమ్మఱ రథము నెక్కించి తానును రథారోహణంబుఁ జేసె.

అంత నక్కడ కురుసైన్యంబున నున్న మహారథు లుత్తరకుమారుఁడే రెక్కించి రథస్థుండై యున్న యవ్వికృతరూపుని ధనంజయుఁగా నూహించి సంభ్రాంతచిత్తులై యుండఁగ నాచార్యుఁడు వారలయుత్సాహ ప్రతిఘాతంబు నుత్పాతంబులనుం బరికించి యిట్లనియె. ప్రచండవాయువులు పలుగుఱాల ఋవ్వుచున్నవి. భస్మవర్ణం బయినచీఁకటి యాకసంబుఁ గప్పె. జలదంబులు రూక్షవర్ణంబులై యద్భుతముగ నగపడుచున్నవి. ఖడ్గాద్యాయుధము లప్రయత్నముగ నొఱలనుండి జాఱుచున్నవి. నక్కలు సూర్యుఁడున్న దెస నుపలక్షించి పెలుచట నఱచుచున్నవి. గుఱ్ఱములు కన్నీరు నించుచున్నవి. కేతనంబులు కదలింపకున్నం గదలుచున్నవి. ఈయుత్పాతంబులం జూచిన నవశ్యంబు భయమాసన్నం బైనతెఱంగు దోఁచెడి. అందఱు ప్రయత్నపరులై సంగరోత్సాహంబు దోహలంబుగాఁగ వాహినుల నిభృతవ్యూహముల నిలుపవలయు. గోధనము లితరు లాక్రమింపకుండఁగ రక్షింపవలయు నని చెప్పి కురుపితామహు దెస మొగంబై యావచ్చుచున్న క్లీబవేషధరుం డయిన మేటివిలుకాఁడు నిక్కంబ యర్జునుండే. కపికేతనుం డైనయాకిరీటి దుర్యోధనుం గెలిచి గోగణముల మగిడించిపోవుఁగాన రాజుం జిక్కకుండఁగ రక్షింపుము. ఆవిక్రమఘనుండు సురాసురు లడ్డపడివచ్చినను దురంబు సలుపక పోవఁడు. ఇన్నియేం డ్లడవుల నిడుమలఁ బడి యమవర్షవశుం డైనయతండు కౌరవుల నేలకుఁగోలకుం దేకయూరక పోవునే? మనసేనలోఁ వానిం జక్కమార్కొనిపోరువాఁ డొక్కరుఁడుం గనుపట్టఁడు. హిమవత్పర్వతంబునం గిరాతరూపప్రచ్ఛన్నుం డైనమహాదేవుని రణమున నొప్పించినయాతనితోడం బోరాట మెంతబలవంతున కైనను డెప్పరంబు గాకుండునే? మఱియు నిప్పుడతండు దేవతలవలన దివ్యాస్త్రముల సాధించిన వాఁడఁట. ఇఁకఁ జెప్ప నేల?

తగురీతి నాలోచింపవలయు ననుచున్నంతఁ గర్ణుఁ డాచార్యుం జూచి మీర లెప్పు డిట్లే యర్జునుగుణంబుల నుగ్గడించుచు మమ్ము వారికంటె నసదులఁగాఁ జూతురు. ఆరయఁగా నతండు నాకును మనరాజునకుం బదునాఱవపాలివాఁ డగునే? యనిపలికె. అపుడు దుర్యోధనుఁడు కర్ణుం జూచి రాధేయా! యింతేల? వచ్చినవాఁడు పార్థుండ యగునేని మనకార్యంబు నెఱవేఱె. అజ్ఞాతవాసనియమమున నున్నపుడు విజ్ఞాతులైనం గ్రమ్మఱఁ బండ్రెండేండ్లు వనవాసంబు నొక్కయేఁ డజ్ఞాతవాసంబును సల్పునట్లు వారు సంకేతించిరి గదా. అర్జునుండుగా కొండొకం డగునేని నిశితశరజాలంబుల గుప్పించి కూల్చెదనని చెప్పిన నందఱు నగుఁగాక చూత మని యామాట నాదరించిరి.

అర్జునుఁడు శమీవృక్షనిక్షిప్తంబు లైన యాయుధముల గ్రహించుట.

ఇట నర్జునుండు మున్ను తాముకైదువు లుంచినజమ్మిఁ జేరం జని యుత్తరుం బిలిచి కుమారా! నీ వాయుధములు శత్రుసంహారోద్యతుం డైన నాలావునకుఁ జాలవు. ఈశమీవృక్షంబునందుఁ బాండవులు తమవిండులు, తూపులు, మైమఱుపుళ్లు, టెక్కెములు మున్నుగాఁగల సాధనము లునిచిన వారు. అందుఁ గిరీటిగాండీవం బున్నయది. అది శతసహస్రధనుర్వరముల కెన యగునది. ఉపమర్దక్షమంబు, శత్రుసంహారకారకంబు, సువర్ణచిత్రితం, బత్యంతాయతంబు, క్షతివిరహితంబు, దారుణంబయ్యుఁ జారుదర్శనంబు నగునాధనుర్వరంబు నాచేతిలావున కోర్చు. దానిం దెచ్చి యిమ్ము. అందే యుధిష్ఠిరభీమనకులసహదేవుల యాయుధములు నున్నయవి యనిన నుత్తరుఁ డర్జునుం జూచి బృహన్నలా! యిందు మృతకళేబరంబు నిక్షిప్తం బయ్యె నని వినియుందు. దాని నెట్లు తాఁకుదు. రాజపుత్రుఁడు మంత్రప్రత విదుఁడు నగున న్నీనీచకృత్యంబునకుఁ బనుపఁ దగునే? శవస్పర్శము నాయట్టి వాఁడు చేయం జనునే? యని పలికె. అంతఁ బాండవమధ్యముండు వాని

నాశ్వాసించి కుమారా! నీకు నీచకృత్యంబుఁ జెప్పెదనే? శవాకారం బైన యయ్యది కైదువులముడియగాని నిక్కంబ పీనుంగు గాదు. వెఱవక జమ్మి నెక్కి యాయుధసంచయంబు క్రిందికిఁ దెచ్చి బంధనముల విప్పి పరివేష్ట నంబు లెడలించి గాండీవం బెత్తియి మ్మని యొత్తి చెప్పినం గిరీటిమాటం ద్రోచిపుచ్చఁజాలక వైరాటి యట్లయని రథము డిగ్గి శమీవృక్షం బారో హించి యాయుధసంచయబంధనంబులు విప్పి పరివేష్టనంబు లెడలించి పెను బాములపోలిక నున్న గాండివాదు లగువిండుల నైదింటిం గాంచి యుదయ మానభానుప్రముఖగ్రహతేజముం బోలినతత్తేజంబునకు వెఱఁగుపడి భయాతి శయజనితరోమాంచనిబిడగాత్రుండై యర్జునున కిట్లనియె. బృహన్నలా! సహస్రకోటిసువర్ణ చిత్రచిత్రితంబు లైననూఱుకాంచన బిందుచిత్రంబులు గలయీవిల్లు పాండవులలో నెవ్వఁడు దాల్చు? వెనుకటిదెసఁ గనకకవచ చిత్రంబుల సొంపారుచు సుపార్శ్వంబు సుల స్తకంబు నగునీధనుస్సు నెవ్వని యది? కాంచనఖచితం బైనపృష్ఠభాగమున నింద్రగోపచిత్రంబులఁ జెన్నా రుచున్న యీకార్ముకం బెవ్వనియది? సౌవర్ణసూర్యత్రయచిత్ర విచిత్రితం బైనయీచాపం బెవ్వనియది? తపనీయశలభవిచిత్రంబై మణిప్రస్ఫురితం బైనయీశరాసనం బెవ్వనియది? కడానికొనల వెలసి యీఁకల నంతటఁ బెంపారి హిరణ్మయతూణీరముల నున్నయీసహస్రబాణము లెవ్వనియవి? అత్యంతదీర్ఘము లర్ధచంద్రాగ్రములునగునీయేడునూఱుబాణము లెవ్వినియవి? గృధ్రపత్రపరివృతంబులు శిలానిశితంబులు సర్వాయసములయ్యు హారిద్రవర్ణ ములు విషమంబులు పంచవ్యాఘ్రచిత్రలక్షితంబులు వరాహాకర్ణవ్యామిశ్ర ములు నగునీమార్గణములగణం బెవ్వనియది? చిలుకఱెక్కలవన్నె కెనవచ్చు వన్నె నలరుపూర్వార్ధంబులు నాయసంబులయ్యుఁ బీతంబులయినయుత్తరార్ధం బులు హేమపుంఖములుం గలయీశరము లెవ్వనియవి? నిశితములు పీతవర్ణ ములు హేమపుంఖములు త్రిపర్వములు నగునీవిశిఖము లెవ్వనియవి? శత్రు భయంకరమును గురుభారసహంబును మొనను వెనుకను శిలీవిలసితంబును

దీర్ఘము నగునీసాయకం బెవ్వనియది? కడానిపిడియుఁ గింకిణులుం గలిగి వ్యాఘ్రచర్మనిర్మితం బైనయొఱలో నున్నయీఖడ్గ మెవ్వనియది? నిశితాగ్రంబు చిత్రహేమకోశంబు కనకముష్టియుం గలయీనిస్త్రింశం బెవ్వనియది? ప్రమాణరూపసంపన్నంబు హిరణ్మయంబు పీఠంబు నిర్మలంబు గోధాచర్మనిర్మితకోశనిక్షిప్తంబు నగునీఖడ్గ మెవ్వనియది? సువర్ణమయముష్టివిలసితంబు నిషధదేశ ప్రసిద్ధం బప్రధృష్యంబు గవాజినకోశనిక్షిప్తంబు నగునీకృపాణం బెవ్వనియది? నీలవర్ణంబు హేమబిందుచిత్రనిచితం బాశీవిషసమస్పర్శంబు పరకాయప్రభేదనచణంబు గురుభారసహంబు శత్రుభీకరంబు నగునీఖడ్గ మెవ్వనియది? యనిమఱియు ననేకాయుధములలక్షణంబుల వేఱువేఱ నిరూపించి యడుగ భూమింజయునకు ధనంజయుం డిట్లనియె. రాజపుత్రా! నీవు తొలుత నడిగినకార్ముకంబే గాండీవంబు. దానిచే నర్జునుండు దేవాసురమనుష్యాదులం జయించు. తొల్లి యీశరాసనంబు బ్రహ్మదేవుఁడు వర్షసహస్రంబును బ్రజాపతి త్ర్యుత్తరపంచశతాబ్దంబులు శక్రుఁడు పంచాశీతివత్సరంబులు సోముఁడు పంచశతసంవత్సరంబులు వరుణుఁడు శతహాయనంబులును ధరించె. వరుణునివలన నగ్ని గ్రహించి ఖాండవం బేర్చినపుడు సంతృప్తుండై యర్జునున కిచ్చె. అతండు నఱువదేనేండ్లు ధరింపఁగలవాఁడు. సుపార్శ్వం బైనయీధనుస్సు భీమసేనుఁడు ధరించు. దానిచే నతండు తూర్పుదిక్కు జయించె. ఇంద్రగోపికచిత్రం బైనయీశరాసనంబు ధర్మజునియది. సౌవర్ణసూర్యచిత్రవిలసితం బయినయీవిల్లు నకులునియది. కాంచనశలభవిలసితం బైనయీచాపంబు సహదేవునియది. కడానికొనల నలరి యీఁకల నంతటఁ బెంపారి హిరణ్మయతూణీరముల నున్నయీసహస్రబాణములర్జునునియవి. ఆదొనలలో బాణము లెప్పుడు వరప్రభావంబునంజేసి యక్షయ్యంబులై పెరుగుచుండు. ఆయర్ధచంద్రాకారాగ్రంబు లైననారసములు భీమునియవి. హారిద్రవర్ణములు పంచశార్దూలలక్షణలక్షితంబులు నగునామార్గణంబులు నకులునియవి. ఆమార్గణగణమున నతండు ప్రతీచిం

గెలిచె. పూర్వార్థంబున శుక్లవర్ణంబు నుత్తరార్థమున హారిద్రవర్ణంబునుం గలిగి చిత్రాకారంబు లైనయావిశిఖంబులు సహదేవునియవి. హేమపుంఖంబులు త్రిపర్వంబులు నగునాతూపులు ధర్మజునియవి. శిలీపృష్ఠం బైనయాదీర్ఘసాయకంబు నర్జునుఁడు ధరించు. వైయాఘ్రకోశనిక్షిప్తం బయినయాఖడ్గము భీమునియది. చిత్రకోశంబు హేమత్సరునిర్మితంబు నగునాకృపాణంబు ధర్మజునియది. గోధాచర్మనిర్మితకోశనిక్షిప్తం బయినయానిస్త్రింశంబు నకులునియది. గవాజినకోపగుప్తం బైనయాయసివరంబు సహదేవునియది. హేమబిందువిలసితం బయినయాకృపాణం బర్జునునియది. యని యిట్లతం డడిగినవాని కన్నింటికి వేఱువేఱుగా నడియాలములతో వివరించి చెప్పిన విని యుత్తరుండు పాండవు లీయాయుధముల నెల్ల నిచట నిక్షేపించి యెచ్చట నిడుమలఁ బడుచున్నవారో? శత్రుమర్దనులయ్యు వారు దుర్ద్యూత మాడుటం జేసి యిన్నిచేటులపా లైరి. పరమపతివ్రత యైనపాంచాలియు వారి ననుగమించి యడవులకుఁ జనియె. ఆక్లేశం బెట్టు లోర్చెనో? ఇపుడు వా రెచ్చట నజ్ఞాతచర్య నడపుచున్నవారో? యని పాండవులం దలంచుకొని పరివేదనం బడుచున్నవైరాటికిఁ గిరీటి యిట్లనియె.

అర్జునుఁ డుత్తరునకుఁ దన్నెఱింగించుట.

కుమారా! పాండవులు పాంచాలీసహితంబుగా వనములఁ బండ్రెండేండ్లు గడపి యజ్ఞాతవాసనియమము నడప మీరాజధానిం గూఢవృత్తి నున్నవారు. ఇఁక దాఁపనేల? నే నర్జునుఁడను, కంకుఁడు ధర్మరాజు, వల్లవుఁడు భీమసేనుఁడు, దామగ్రంథి నకులుఁడు, తంత్రీపాలుఁడు సహదేవుఁడు, సైరంధ్రి ద్రౌపది, దానినిమిత్తంబ కాదె భీముఁడు గంధర్వులను నెపమునఁ గీచకులఁ జంపె ననిన విని యుత్తరుండు విస్మితచిత్తుండై సారథీ! నీవు నిక్కంబ యర్జునుండవేని యతనికిఁ బదిపేళ్లు గలవు. వానిం జెప్పిన నీమాట నమ్ముదు ననుటయుఁ గిరీటి వైరాటిం జూచి కుమారా! యర్జునుఁడు, ఫాల్గునుఁడు,

జిష్ణుఁడు, కిరీటి, శ్వేతవాహనుఁడు, బీభత్సుఁడు, విజయుఁడు, కృష్ణుఁడు, సవ్యసాచి, ధనంజయుఁడు నన నాకుఁ బది పేళ్లు గల వనిన నుత్తరుఁ డయ్యా! యమ్మహాత్మున కీనామంబులు గలుగఁ గారణంబుఁ జెప్పిన నిన్ను నమ్ముదు ననియడుగుటయు నర్జునుఁ డతని కిట్లనియె. ఏను సకలదేశముల జయించి ధనముఁ దెచ్చి ధనమధ్యమున నుండుటంజేసి ధనంజయాహ్వయుఁడ నైతి. సమరమున దుర్మదు లగురాజుల నెల్ల జయించుటంజేసి విజయనాముఁడ నైతి. నారథమున నుత్తమశ్వేతాశ్వములు పూన్చుటంజేసి శ్వేతవాహనుఁ డనఁబరఁగితి. ఉత్తరఫల్గునీనక్షత్ర విశిష్టకాలమున జనించుటంజేసి ఫాల్గునాభిధానుండ నైతి. సురలకు నజేయులైన రాక్షసుల నేను గెలుచుటకు మెచ్చి యింద్రుఁడు సూర్యసన్నిభం బయినకిరీటం బొసంగుటంజేసి కిరీటినాఁ బరఁగితి. యుద్ధమున శత్రులు బీభత్సంబుఁ జెందునట్లు విక్రమించుటంజేసి బీభత్సు నామధేయుండనైతి. సవ్యదక్షిణహస్తముల గాండీవమునందు బాణముల సంధించి యేయఁజాలుటంజేసి సవ్యసాచి యనంబడితి. భూమండలమున నెచ్చట నెవ్వరికిని దుర్లభం బయిన యవదాతకాంతియుఁ బరిశుద్ధకర్మాచరణంబునుం గలిగియుండుటంజేసి యర్జునాఖ్యుఁడ నైతి. దేవేంద్రునకుఁ బుత్రుఁడనై యపారవిక్రమాటోపంబున వైరుల జయించుటంజేసి జిష్ణునామమున నెగడితి. మాతండ్రి కృష్ణుఁ డనుపేరు పెట్టుటంజేసి కృష్ణాహ్వయమున నెసఁగితినని తెలియఁ జెప్పిన విని విరాటపుత్త్రుండు సంతోషాశ్చర్యనిర్మగ్నచిత్తుండై పార్థునకుఁ గేలుమోడ్చి యేను భూమింజయాభిధానుఁడను. ఉత్తరుఁ డనియు నన్నుఁ బిలుతు రని నిజనామంబులఁ జెప్పి యభివాదనంబుఁ గావించి మహాత్మా! భాగ్యవిశేషమున భవద్దర్శన మయ్యె. అజ్ఞానమునఁ జెప్పిననాపలుకుల మన్నింపుము. అనేకచిత్రకృత్యము లొనరించిననీప్రాపున నుండుటంజేసి నాకు వెఱపు పాసె. అత్యంతభక్తిమై నీరథము నడిపెద. ఎటు పోవఁగ నాజ్ఞాపింతువో యట్లు చేయ నున్నవాఁడ నేమి చేయుదు నని యడుగ నర్జునుఁ డతని కిట్లనియె. విరాటనందనా! నీయెడఁ

ప్రేతుండ వైతి వెఱవకుము. శత్రులనెల్ల నే నుక్కడంచెద. నాపోరాటఁ జూచుచు నెమ్మది నుండు మని యాశ్వాసించె. గాండీవము నక్షయ్యతూణీరములం గ్రహించి యాశమీవృక్షము డిగివచ్చి నిన్నుఁ దెలిసినప్పుడే నాకు భయము వాసె. వాసుదేవునితోనైనను సురేంద్రునితోనైనను సంగరంబు ఘొసంగిన నింక నే వెఱవను. లోకోత్తరరూపబలవీర్యవిలసితుం డైననీ కీపేడిరూప మెట్లు గలిగెనో యని యూహించియూహించియుం గారణము నెఱుఁగ నేరకున్నవాఁడను. నిన్నుఁ జూచినం గ్లీబరూపప్రచ్ఛన్నుండైన మహాదేవుఁడనియు గంధర్వోత్తముఁడనియుం దేవేంద్రుఁడనియుఁ దలంపుదయించు. సందియంబు వాయఁ దత్కారణంబుఁ దేటపఱుపవే యనియడుగ నర్జునుఁడిట్లనియె. జ్యేష్ఠభ్రాతృనియోగంబునంజేసి యొక్కసంవత్సరంబు సత్యవ్రతంబుఁ బాలించువాఁడనై యీరూపు వహించితిఁగాని యేను నిక్కంబ నపుంసకుండఁ గాను. ఆవ్రతంబు నిన్నటితోఁ బరిసమాప్తం బయ్యెనని చెప్పిన విని భూమింజయుండు ధనంజయుంజూచి మహాత్మా! నిన్నుఁ జూచినప్పుడెల్ల నితం డేలొకో క్లీబరూపుఁడై యున్నవాఁడను? ఇట్టివాఁడుం గ్లీబు లగుదురే? కారణమెద్దియే నుండు నని యూహింపుచుంటి. అది యిప్పుడు సంగతం బయ్యె. ఇఁక నీరూపంబు నీకు లేమికి సంతసం బయ్యెఁ. భయ మించుకేనియుం లేదు. దేవతలతోడనైనం బోరాడఁ జాలుదు. నీకు సారథ్యం బొనర్చి కృతార్థుఁడ నగుదు. ఏను సారథ్యతత్త్వవిదులవలన లెస్సగ సారథ్యంబు నేర్చితి. శక్రవాసుదేవులకు మాతలిదారుకు లెట్లట్ల నీ కేను రథచోదకుఁడనై నిన్ను మెప్పింతు. ఈరథ్యములు వాసుదేవరథ్యసమంబులు. తమపదవిన్యాసంబుఁ జూచి యితరరథ్యములు గమనచాతుర్యంబు నేర్చికొనవలయునట్లుగాఁ జిత్రగతుల నడచు. ఈవలపటిగుఱ్ఱము సుగ్రీవముఁ బోలు. ఈడాఁపటిగుఱ్ఱము మేఘపుష్పమున కెనవచ్చు. అందుఁ బార్శ్వమున నున్నతురంగము శైబ్యమునకు సాటి యగు. వలపటిప్రక్క నున్నహయము బలాహకమున కీడగు. ఇట్టిమేలిగుఱ్ఱములం బూన్చిన యీరథము నేను గడపఁగ నీవు రథికుఁడవై

కురుసేనం జెండాడుము. అన్నియు ననురూపంబులై యున్నయవి యని
పలికె. అంత నర్జునుండు శంఖవలయముల నపనయించి తొల్లింటియట్ల కనక
వలయముల ధరించి నీకేశముల మలంచి యెత్తి కట్టి శ్వేతోష్ణీషంబుఁ జుట్టి
ప్రాఙ్ముఖుండై శౌచసమాహితచిత్తంబుతో సర్వాస్త్రములను ధ్యానించిన నయ్యా
స్త్రములు తమతమరూపములతో నమ్మహారథునకుఁ బొడసూపి కేలుమొగిచి
యిదె మేమెల్ల నీపనిచినపనిఁ జేయ నాయత్తపడియుండెద మనిచెప్పుటయు
వివ్వచ్చుఁడు ప్రణతుండై వానిం గ్రహించి నామనస్సున నిల్చితలంచినపుడు
నాకార్యములఁ దీర్పుఁ డనిపలికి ప్రహర్షోత్కర్ష వికసితవదనారవిందుఁడై
గాండీవముఁ జేతఁ గొని యెక్కు పెట్టి గొనయమ్ము సారించుటయుఁ గొండ
లొండొంటిం దాఁకినట్లు ఘోరస్వనం బెసంగె. ఆఘోరస్వనంబునకుఁ బుడమి
వడఁకె. గాలి ప్రచండముగ వీచె. కొఱవులు పడియె. దిక్కు లదిరె. కురు
బలములు బెదరె. ధ్వజములు చలించె. మ్రాఁకు లూఁగాడె. అప్పు డుత్తరుం
డయ్యతిరథోత్తమునకుఁ గేలుమోడ్చి యోశూరాగ్రణీ! సహాయరహితుండ
వగునీవు సహాయవంతు లగునిందఱు మహారథులతోడఁ బోరాడి యెట్లు గెలుం
తువో యనివెఱచి నీముందట నిల్చియున్నవాఁడ ననిన విని యర్జునుఁ డతని
వెఱపుఁ దీర్చువాఁడై యిట్లనియె. దుర్యోధనాదులు ఘోషయాత్రకువచ్చి
గంధర్వులచేఁ బట్టువడినప్పుడు నే నొక్కరుఁడఁగానే విక్రమించి యా
గంధర్వుల గెలిచి దుర్యోధనాదుల విడిపించితి. ఒక్కఁడఁ గానే ఖాండవం
బేర్చి యగ్నికిఁ దృప్తిఁ గావించితి. దేవరాజార్థంబుగా నివాతకవచపౌలో
మకాలకేయులనురాక్షసుల నొక్కడంగాదె యుక్కడంచితి ద్రౌపదీస్వయం
వరమున సకలరాజుల నొక్కరుండఁగదా గెలిచితి. ఇప్పుడు నీమహారథుల నెల్ల
గెలిచి పసుల మఱలింతు. చింతాభయములు విడువుము. కృపద్రోణమహా
దేవమాధవసురేంద్రవహ్నియమాదులవలన దివ్యాస్త్రముల ననేకముల సాధిం
చితి. నావిక్రమంబుఁ జూడు మూఱడిల్లు మని యుత్తరునకు భయంబు వాపి
శమీవృక్షమునకుఁ బ్రదక్షిణముగా రథము బోనిచ్చి యట నిలిపి సింహధ్వజం

౦ విశ్వకర్మనిర్మితంబై దేవమాయామయంబైనకపిధ్వజంబు సన్ని
ంగ నగ్నిదేవుం దలంచుటయు నద్దేవుఁ డతనితలం పెఱింగి భూత
కకపిధ్వజం బెత్తించి తదీయరథోత్తమం బనిచిన నారథము గగన
మార్గంబున వచ్చుప్రోల భూతలమున కవతరించె. వచ్చినయారథమునకుఁ
బ్రదక్షిణంబు గావించి తత్కాలసన్నిహితంబైన నిజకవచంబుఁ దొడిగి
యింద్రదత్తంబైనకిరీటరాజంబు ధరించి బద్ధగోధాంగుళిత్రాణుండై గాండీ
వంబుఁ జేతఁ గొని యుత్తరముగ రథముఁ దోలు మని యుత్తరునకుఁ జెప్పి
తత్సమయసన్నిహితంబైనదేవదత్తం బనుతనశంఖంబు పూరించె. ఆశంఖ
ధ్వానంబు విని రథ్యములు మ్రొగ్గతిలం బడియె. ఉత్తరుఁడు వెఱచి చదికిలఁ
బడియె. అంతనర్జునుండు పగ్గముల బిగియించి గుఱ్ఱముల లేవనెత్తి యుత్తరుం
గౌఁగిలించి యూరార్చి రాజపుత్రా! వెఱవనేల? క్షత్రియునకు శత్రుమధ్య
మున విషాదముఁ బొందఁ జనునే. శంఖధ్వానంబుల, భేరీభాంకారంబులఁ,
గుంజరఘీంకారంబుల నింతకుమున్న విన్నవాఁడవు కావో? ప్రాకృతుని
మాడ్కి నేల యిట్లు వెఱచెద వనియడుగ నుత్తరుఁ డిట్లనియె. శంఖధ్వా
నంబులు, భేరీభాంకారంబులు, కుంజరఘీంకారంబులు, ధనుష్టంకారంబులుం
బలుమాఱులు వినియుందుఁగాని యిట్టిచందపుమ్రోఁతయు, నిట్టిధనుష్టంకా
రంబు నింతకు మున్నెన్నఁడు నెచ్చటను వినను. ఇట్టిధ్వజమును రథమునుం
జూడను. అమానుషంబయిన యీధనుష్టంకారంబును, శంఖధ్వానంబును,
రథనేమిఘోషమును, ధ్వజముననున్న భూతములయార్పును వినినంతన చెవులు
దూటువడి బధిరములయ్యె. మనస్సు కలగుండువడియె. దిగ్భ్రమంబువొడమె.
ధ్వజకాంతులఁజూడ్కి ప్రతిహతం బయ్యె ననిన విని యర్జునుండు వాని
వెఱపు దీర్పం దలంచి భూమింజయా! నొగలపైఁ బదిలముగఁ గూర్చుండి
పగ్గముల బిగియించి దిట్టతనమున నుండుము. ఈతూఁగు చందము మ్రోయింతు
ననిచెప్పి పెలుచ దేవదత్తం బొత్తె. ఒత్తుటయు గుహాలఁ బ్రతిధ్వాను
లెసంగె. గిరు లదరె. పుడమి వడఁకె. దిశలు బీటలువాఱె. సముద్రములు

సంక్షోభించె. ఉత్తరుఁ డించుక వెఱపుతోన రథమున నొఱఁగె. అర్జునుఁ డతనికి వీర్యావహంబులయినసాంత్వవచనముల బోధించి వెఱపు దీర్చె. అంత నక్కడ ద్రోణాచార్యుఁ డానిస్వనముల నుపలక్షించి దుర్యోధనుంజూచి కుమారా! మేఘగర్జితంబుంబోలురథనేమిఘోషమును జ్యాఘాతనిస్వనంబును శంఖారవంబును ధ్వజనిలయభూతగణారవంబును భూకంపంబునుం బరికించిన నారథమున వచ్చువీరుఁ డర్జునుఁడకాని యొండొకండు గాఁడని నిక్కంబుగఁ దోఁచుచున్నది. మనసైన్యంబున శస్త్రములు ప్రకాశింపవు. గుఱ్ఱములు ప్రహృష్టములు కావు. సుప్రజ్వలితంబులయ్యు నగ్నులు లెస్సగ వెలుంగవు. మృగములు సూర్యున కెదురై ఘోరముగ నఱచుచున్నవి. ధ్వజాగ్రములందు వాయసములు వ్రాలుచున్నవి. నక్క సేనామధ్యమునకు వచ్చి వెలుచనఱచి పాఱుచున్నవి. అందఱిమేనులను రోమాంచము గలుగుచున్నది. కోఱవులు పడుచున్నవి. కంకగృధ్రాదులును సేనలో నంతటం దిరుగుచున్నవి. ఈయుత్పాతంబులు చూడఁగ ఘోరసంగ్రామంబును బహుక్షత్రియవినాశంబు నగు నని తోఁచుచున్నది. ఇట్లుండినం బార్థబాణపీడితం బైన సైన్యంబుఁ జూచి దైన్యంబు నొందుదువు. మనసేనలో నందఱు సమరోత్సాహవిరహితులై వివర్ణముఖులై యున్నవారు. కావున గోగణములఁ బనిచి దొడ్డవ్యూహంబుఁ బన్ని యుద్ధసన్నద్ధులమైయుండు టుచితం బనిచెప్పిన విని దుర్యోధనుండు భీష్మద్రోణకృపులం జూచి యిట్లనియె.

దుర్యోధనుఁడు ద్రోణాచార్యు నధిక్షేపించుట.

ఆచార్యు లిట్లు చెప్పుచున్నవారు. నేనుం గర్ణుఁడు నిందుల కుత్తరఁబు మున్న చెప్పితిమి. ఐనం జెప్పెద. పాండవులు వనమునఁ బండ్రెండేండ్లు జనపదమున నజ్ఞాతవృత్తిమై నొక్కయేఁడు నుండునట్లు ప్రతినఁ బూని పోయిరిగదా. అందు వనవాస నియమంబు గడచెఁగాని యజ్ఞాతవాస నియమంబింతకుఁ బరిసమాప్తంబు గాదు. నియమము దీఱకమున్న యర్జు

నుండు వచ్చెనేని సంకేతించినవిధమునఁ గ్రమ్మఱ నానియమంబు వారునడుపు
వారు. లోభమున వారు వచ్చుటయుండె, మోహమున మన మెఱుంగమి
యుండెఁ గావలయు. ఇం దెక్కువతక్కువలు భీష్ములు నిరూపింపఁ జాలు
దురు. అర్థములందు ద్వైవిధ్యము పొసంగిన నెంతవారికైనను సమ్మోహంబు
గలుగు. అందును స్వార్థములయందైన నందఱును మోహవశులే యగుదురు.
వారినియమంబు చీఱకమున్న యుత్తరు రక్షింపఁగ నర్జునుండు వచ్చెనేని
యదియెవ్వరియపరాధంబు? విరాటుపురంబునఁ బాండవులుందురని శంకించి
కాదె మనము నిన్న దక్షిణగోగ్రహణార్థంబు సుశర్మం బంపి నేఁ డిటకు
వచ్చితిమి. నిర్ణయించి వచ్చినకార్యంబున విచారం బేల? సుశర్మ విరాటుం
గెలిచి గోవులఁ బట్టికొని పోవుటయుండె నోడి మనయొద్దకుఁ బాఱుతెంచుట
యుండె నొండు గావలయు. విరాటుఁడు సర్వసేనాపరివృతుండై త్రిగర్త
యోధులతోడఁ బోరాడఁ బోయిన నూర నున్నవాఁ డుత్తరుఁ డొక్కరుండు
మనల మార్కొనవచ్చుచున్నవాఁడు. కాకున్న విరాటుఁడే వచ్చుచున్న
వాఁడు గాఁబోలు. అట్లుంగాక బీభత్సుఁడే వచ్చెనేనియు మనము పోరితంబు
సేయనవలయు. ఎచ్చి పసులం బట్టించినపదంపడి యింద్రయమవరుణాదు
లెవ్వరు వచ్చినను మార్కొనవలయుఁగాని యొదుఁగఁ దగునే? సంగ్రామంబు
సేయక యొక్కఁడైనం బాఱిపోయెనేని యట బ్రదుకఁజాలునే, భీష్మ
ద్రోణకృపాశ్వత్థామవికర్ణాదు లగుచేయంగలవీరు లేలొకో యనవసరమున
సంభ్రాంతచిత్తులై యూరక రథములపైఁ గూర్చున్నవారు. ఆచార్యుఁడు
సైనికులయుత్సాహము సెడఁగ నర్జునుం బ్రశంసింపుచున్నవాఁడు. ఆచా
ర్యుని సమరమునకుఁ బిలువక వెనుక నిలిపిన నిప్పటికి నీతియగు. అర్జును
నందుఁ బ్రీతి యెక్కుడు గావున నతనిఁ బొగడి కురుసైనికులకు వెఱపు
పుట్టించుచున్నవాఁడు. కావున సేనలోఁ జెఱుపు గలుగకుండ నేర్పున నీతి
చేయవలయు. ఏల యతం డర్జును నంతపొగడవలయునో యూహించియుం
దెలియరాదు. మనసైన్యంబు భగ్నంబుఁ జేయఁగఁ దలంపు లేదేని తదీయ

రథశంఖధనుర్ఘోషముల నంత వింతగఁ బొగడనేల? అశ్వములకు హేషితం బులు, గాడ్పులకు వీజనంబును, బర్జన్యునకు వర్షించుటయు, మేఘములకు గర్జనంబును సహజంబులే. ఇట్లు వారల వా విడిచి పొగడఁగ వారిపై నత్యంత ప్రీతియు మనపై ద్వేషరోషములుం గారణంబులు. కావున నాచార్యు లయినవారల యుద్ధవిషయములఁ బిలిచి యడుగరాదు. మఱివారు ప్రాసాద ములఁ గూర్చున్నపుడు, నుద్యానముల విహరించునపుడును జిత్రకథాగోష్ఠి నున్నపుడును, యాగములఁ జేయునపుడును, శస్త్రాస్త్రచమత్కారములఁజూపు నపుడును, మంత్రవిచారంబుల నున్నపుడును, హస్త్యశ్వాదివినోదంబుల నరయునపుడును, గోధనములఁ బరిశీలించునపుడును, భోజనావసరములందును, నితరవినోదసమయంబులందునుం, బిలిచిన వచ్చి తత్తదుచితంబుగా మాట లాడఁదగువారు. కావున శత్రుగుణముల గొప్పచేసి యుగ్గడించుపండితుల వెనుకఁజేసి గోవులం బనిచి పరాజయంబు లేక శత్రుల జయించునట్లుగా నీతిమార్గప్రకారంబున విచిత్రవ్యూహంబుఁ బన్ని తగినతెఱంగున నందు లకు రక్ష గావించి పోరికి సమకట్టియుండవలయు నని దుర్యోధనుఁడు పలికినం గర్ణుఁ డిట్లనియె.

కర్ణుఁడు బింకములు పలుకుట.

మహారథు లందఱు వెఱచి యుద్ధముఁ జేయ మనసుగొలుపనియ ట్లున్నవారు. వచ్చుచున్న రథికుఁడు విరాటుఁడైనను, బీభత్సుఁడైనను సాగ రంబును వేలయట్లట్ల యే నొక్క నిలువరించెద. చేతులలావు మెఱయ నేను వింట సంధించి ప్రయోగించినబాణములు పన్నగంబులవిధంబున నప్రతి హతిం బోవుఁగాని మఱలవు. రుక్మపుంఖము లగుమదీయబాణములు మిడు తలు పాదపంబును బోలె నర్జునుం గప్పు. మదీయతలప్రహారనినాదంబును జ్యాఘోషంబును భేరీరవంబుచందంబున నరిభీకరంబై యెసఁగు. పదుమూఁ డేఁడులు పూఁచిపెట్టికొని యర్జునుఁడు సమరకుతూహలమున నన్నుఁ దాఁకిన

నేను సత్పాత్రభూతుం డైనబ్రాహ్మణున కమితధనంబు నిచ్చుతెఱంగుగా వానికి శరజాలముల నిత్తు. అర్జునుఁడు ముల్లోకములఁ బొగడ్త కెక్కిన మేటి విలుకాఁడు. నేనును వానికిఁ దక్కువగాదు. మాయిరువురయస్త్రచాతుర్యంబు నందఱుం జూతురుగాక. దుర్యోధనుమన్ననం గని బ్రదికిన నేను నేఁడు తత్ప్రియం బైనయర్జునవధంబు సేసి యప్పు దీర్చికొందు. మాయిరువురయస్త్రము లొండొంటిం గలసి శలభములట్లు యాకసంబున నిబిడంబులై యుండ నావేడుక నందఱుం గనుంగొనుఁడు. కౌఱవుల నేనుఁగుంబోలె నశనిసమస్పర్శుఁడు మహేంద్రతుల్యవిక్రముఁ డగుపార్థుని బాణముల నోర్పింతు శక్తిశరాద్యాయుధంబు లింధనంబులు గాఁగ మండి శత్రుల నేర్చువివ్వచ్చుం డనుకార్చిచ్చు నశ్వవేగము పూర్వవాయువుగా రథనేమి నిర్ఘోషము గర్జితంబుగా మేఘురీతి నవలంబించునేను శరవర్షము గురియించి చల్లార్చెదను. నాయరివోసియేసిన బాణములు పన్నగములు వల్మీకంబునుం బోలె నర్జునుం జేరు మదీయదివ్యబాణావృతగాత్రుండై కర్ణికారకుసుమ సంవృత పర్వతంబుచాడ్పున నొప్పుకిరీటి నిపుడు చూడుఁడు. జామదగ్న్య మునీంద్రకరుణాసముపలబ్ధం బైనయస్త్రజాలంబు గలిగి యుడివోనిధీరమునం బొంపిరివోవునేను దేవతలతో నైనం బోరికిఁ గడంగుదు అర్జునుఁ డెంతవాఁడు? కిరీటిధ్వజంబున నున్నవానరుండు మదీయభల్లనిహతుండై భైరవారావముల నొనరించుచు నేలఁ బడి తన్నుకొను. ధ్వజనిలయంబు లయినభూతగణములు మదీయశరప్రహారపీడితంబులై పెలుచనఱచుచుఁ బఱచు. ఇపుడు విరథుండై చేయునది లేక క్రూరపన్నగంబుచాడ్పునఁ జలంబుడింపక రోజునట్టిగాండీవిం జూతురు. నేఁడు బీభత్సుం బిలుకుమార్చి దుర్యోధనుచిత్తమునం బెద్దకాలముగ నున్నశల్యం బపనయింతు. వేడుక గలదేని యందఱుఁ దేరులపై నుండి చూడుఁడు. లేదేని గోధనముఁ గొని పురికిఁ జనుఁడని బింకములు వలుకుచుండఁ గృపాచార్యుండు వానికిట్లనియె. రాధేయా! నీబుద్ధి యెన్నఁడుం గ్రూరతరంబై యుండు. అర్థముల నాలోచింతువుగాని తద్గుణదోషముల

హానివృద్ధుల నెఱుంగవు. అర్థార్జనోపాయములలో యుద్ధ మధమంబని శాస్త్ర విదు లైనపెద్దలు సెప్పుదురు. దేశకాలముల బలాబలముల నెఱింగి నేర్పున నడిపినయుద్ధము జయప్రదంబగుఁగాని విపరీతంబయినఁ దప్పక విపరీతఫలం బగు. పరికించిచూచిన నిప్పుడు కిరీటితోడఁ బోరాట యనుచితంబ. అతం డొక్కరుండేయని తలంతమేని యదియు నొప్పదు. అవ్వీరుఁ డొక్కరుఁడ గాఁడె ఖాండవం బేర్చె. యాదవులనెల్ల నోర్చి సుభద్రం దెచ్చె. కురు కులంబునకెల్లఁ గీర్తి కలుగ దిగ్విజయంబు సేసి యమితధనరాసులం దెచ్చె. రాతరూపప్రచ్ఛన్నుం డైనయుమాపతితోడం బెనంగి గెల్చె. బ్రహ్మచర్య నియతుండై స్వర్గమున నుండి దేవతలవలన దివ్యాస్త్రముల సాధించి వారికిం దుర్జయు లైననివాతకవచపౌలోమకాలకేయులఁ బరిమార్చె. మీ రందఱు ఘోషయాత్ర పోయినపుడు చిత్రసేనుం గెలిచి దుర్యోధనాదుల విడిపించి కులంబు రక్షించె. ఇంద్రుఁడును వానితోడిపోరికి వెఱచు. వాని మార్కొను వానికిఁ జికిత్స యవశ్యకర్తవ్యంబు. క్రూరాశీవిషమునోటఁ బ్రదేశినిం బుచ్చి కోఱఁ జెఱుకఁదలంచుమాడ్కిని, వన్యమదగజంబు నొంటిమై నంకు శంబు లేక యారోహించి పురమునకుఁ బోవుచాడ్పునను, ఘృతార్ద్రవస్త్రము గట్టి యాజ్యమేదోవసావిశేషసమిద్ధం బయినయగ్నిం జొచ్చుకరణిని, బృహ త్పాషాణంబుఁ గుత్తుకం గట్టికొని సముద్రం బీఁదుచందంబునను దుర్బలుఁ డకృతాస్త్రుఁడు నగునీవు బల్లిదుఁడు కృతాస్త్రుఁడు నగుసవ్యసాచిం బోర మార్కొనం దలంచుట యపాయకరంబు. కౌరవు లొనర్చినపరిభవములు హృదయశల్యములయి యెరియించుచుండఁగ నెట్లో యాపదుమూఁడేఁడులు నియమంబు గడపి బంధనము లెడలించినసింహము క్షుద్రమృగములపై దూఁకుచందంబున నేతెంచుచున్న యాఫాల్గునుండు మనలో నొకనినైన నను మిగిలింపఁడు. బావిలో నున్ననిప్పువోలెఁ బ్రచ్ఛన్నుం డైనయర్జునుం దెలియక యెదిరించుటం జేసి పెద్దయు డెప్పరం బయ్యె. కావున సేన నెల్ల, నొకతెఱంగున వ్యూహము పన్ని భీష్మద్రోణాశ్వత్థామ దుర్యోధనులు నీవు,

నేనుం గూడి మనమాఱుగురము దానవులు వాసవుంబోలె వానిం దాఁకుదము గాని యొంటిమై వాని మార్కొనుట దుష్కరం బనినం గర్ణుండు కృపాచార్యుం జూచి మీరంద ఱేలొకో యిట్లు వెఱచెదరు? మీ రోపరేని యూరకుండుఁడు. నేను వానిం గెలిచెద. ఒకరథికున కొక్కరుఁడు చాలక యొందఱు వలయు? కిరీటివిక్రమంబు పెద్దచేసి యెపుడును మీరు మమ్మెల్లిదంబు సేయుచు సమయంబున నిట్లసంబద్ధంబులు పల్కెద రని యధిక్షేపించుటయు నశ్వత్థామ కటకటం బడి యిట్లనియె.

అశ్వత్థామ కర్ణుని నిందించుట

కర్ణా! యిప్పటికిఁ బసులఁ బట్టికొంటివి గాని యింతకు మత్స్యదేశంబునుం గడచనవు. వచ్చుచున్నవీరు నింతకు మార్కొనలేదు. ఇంతలోన నిన్ని యడిబీరపుపలుకు లేల? సంగ్రామంబులు పెక్కులు చేసి పగర గెలిచి ధనము గొనినవాఁడు బింకములు పలుకఁడు. మఱి యగ్ని మాట లాడక గాల్చుచందంబునను, సూర్యుఁ డపచనుం డై వెలుంగులెఱంగునను, భూమి యభాషితయై లోకములధరించుమాడ్కిని నెద్దియుం జెప్పక తనపౌరుషమునఁ గార్యముసాధించు. బ్రాహ్మణులు యజనయాజనాదులు వైశ్యులు బ్రాహ్మణోపకారకృషివాణిజ్యగోరక్ష శూద్రు లుత్తమపరిచర్యలుం గులధర్మంబులుగాఁ జేసినయట్లు క్షత్రియుండు తనకులధర్మం బనుసరించి యజనాధ్యయన దానములఁజేయుచు దేశకాలను లెఱింగి నీతి దప్పక విక్రమంబున శత్రు విజయంబుఁ జేసి రాజ్యంబులు సాధించి సత్కారార్హు లైనగురువుల నారాధించుఁగాని తూలనాడఁడు. జూదమాడి వంచనచే నితరులరాజ్య మొడిచికొని తన్నుఁ దాన పొగడికొనఁగ దుర్నయపరుం డైనయాదుర్యోధనుఁ డొక్కరుఁడు మొనగాఁ డయ్యెఁగాని క్షత్రియకులజనితుం డైనలాఁతివాఁ డెవ్వఁడేనియు నిట్టినీచకృత్యమున కొడంబడునే? వంచన విడిచి సన్మార్గమునం బ్రవర్తించినం బాండవుల గెలువ నలవియే? ఏయుద్ధమునఁ బాండవుల గెలిచి

యింద్రప్రస్థంబు సాధించిరి? ఏసంగరమున నవ్వీరుల జయించి పాంచాలి నాసభకు రప్పించిరి? ఏకవస్త్రయు రజస్వలయు నగునప్పరమపతివ్రతను నిశ్శంకమతిం దెప్పించినపుడు విదురుఁడు సెప్పినది వింటిరే? నివియెల్ల నెట్లు వచ్చు. గంధముఁ గోరి చందనవృక్షంబు నఱికినచాడ్పున సంపదఁ గోరి వంచనమై నాపాపపుజూద మాడి యంత నిలువక తగు నిది తగదని యరయక యాసభకప్పతివ్రతాశిరోరత్నంబును దెప్పించుటయె మీకుఁజేటుల కెల్ల మూలం బయ్యె. క్షమకును మేర గలదు. ఎంతశాంతులకైనను గారణ విశేషంబున క్షమ సెడి కోపంబు గలుగు. వాఁడు ద్రౌపదిని మీపఱచిన పాట్లు పాండవులు క్షమియింపరు. విశేషం బేల? ధార్తరాష్ట్రజయార్థంబె ధనంజయుండు జనియించినవాఁడు. వాఁడు దేవదానవగంధర్వాదుల నేరినైన నొకచీరికిఁ గొనఁడు. ఇఁక మనసైన్యంబున నొక్కనినేనియు మిగిలింపఁ డని చెప్ప నేల? వాఁడు తన పగదీర్చుకొను. నీ విచట దుర్యోధనుండు వినఁగఁ బాండిత్యంబు మెఱయ మాటలనే వానిం గెలుతువు. పన్నగంబుల నిగ్రహించి తనసెల వయినమ్రాఁకుఁజేరు గరుత్మంతునిచందంబున వాఁ డెవ్వని మార్కొనినను దప్పక జయించి మఱిమఱలు. వీర్యమున నీకంటె నధికుఁడు ధనుర్విద్యావిలాసమున నింద్రతుల్యుఁడు యుద్ధమున వాసుదేవసన్నిభుఁడు నగువాని నెవఁడు గొనియాడఁడు. దైవమానుషాస్త్రముల తెఱం గెఱింగి తత్త దస్త్రముల నేసి జయముఁ గొన నేర్చినయాసవ్యసాచి కెవ్వరును సాటిగారు. అట్టివీరు నందఱు నగ్గింపవలయు. ద్రోణాచార్యుండు తనకుఁ బ్రియశిష్యుండై పుత్త్రునకుఁ దక్కువగాని యయ్యర్జునుం బ్రశంసించు. ఇందు దప్పేమి? పాపపుజూద మాడి శకుని పాండవరాజ్యము సాధించి యిచ్చినపు డీదుర్యోధనుఁ డేబీరమునఁ బాంచాలి నాసభకుఁ దెప్పించెనో యాబీరముఁ దలంచి యిపుడు చక్క నిలిచి పోరాడవలయును. దుర్ద్యూతదేవి క్షాత్త్రధర్మకోవిదుఁడు ననియీదుర్యోధను మెచ్చుమానిసియు నతనికి మేనమామయు నగుశకునియే యిపుడు వచ్చినపార్థునితోఁ గయ్యముఁ జేయుఁగాక. పార్థుఁ డిపు డద్ద

సాళ్లె వైవఁడు. నికృతి సేయఁడు. మఱి గాండీవనిర్ముక్తము లైనవాఁడినారసములం గప్పించు. గాండీవనిర్ముక్తంబు లైన క్రూరనారాచంబులు కొండలనైనం దూఁటుచేసికొని పోవుఁగాని మగుడవు. కాలాంతకుఁడు ప్రళయప్రభంజనుఁడు మృత్యుదేవతయు బడబానలంబు నొక్కవేళ మిగిలించిన మిగిలింతురుగాని ధనంజయుఁడు శత్రుశేషము నిలుపఁడు. మీదుర్ణయంబుల కొప్పి సమరంబు సేసినను వచ్చువాఁడు సవ్యసాచి యగునేని నేను బోరాడను. విరాటుఁ డగునేని పోరితంబునకుఁ గడంగుదు నని యాచార్యపుత్త్రుండు క్రోధావమానఘూర్ణమానచిత్తుండై పలికిన విని దుర్యోధనునకు గాంగేయుం డిట్లనియె.

భీష్ముఁడు ద్రోణాదుల ననునయించుట.

ఆచార్యవచనం బుచితంబు. ఆచార్యపుత్త్రవచనంబు లెస్స. కృపాచార్యువచనంబు సంగతంబు. కర్ణుఁడు కేవలక్షాత్త్రధర్మంబునఁ బోరాడం దలంచు. ఆచార్యు లయినవార లెట్టిసమయంబుల నైనను సత్కారార్హులుగాని నిందార్హులు గారు. దేశకాలము లెఱింగి యుద్ధమునకుఁ దొడరుట నామతంబు. యుక్తాయుక్తవిచారంబు సేయువారు తమవారికిఁ గార్యసంకటంబులు పొసంగినం జింతిల్లకుందురే? సూర్యసమతేజస్కు లయిన పాండవు లేవురు నీకు శత్రువులై యుండ నీకు దెప్పరం బగుపట్టున నాచార్యులు వగవకుందురే? ధర్మవిదు లయినపెద్దలును స్వార్థంబున విమోహంబుఁ జెందుదురు. ఇందులకుఁగా నాచార్యుం దూఱవచ్చునే? నామాట నీ కింపగునేని వారి నారాధించి ప్రసన్నులం జేసికొను మనిచెప్పి యట ద్రోణాచార్యపుత్త్రువెస మొగంబై భూసురోత్తమా! కర్ణుఁడు మీకు విక్రమాటోపంబు మఱింతయెక్కువగాఁగఁ బలికినవాఁడుగాని యొండుగాదు. క్షమియింపుఁడు. పార్థుండు దగ్గఱినవాఁడు. పెద్దయు దెప్పరం బగు. ఇట్టిసమయమున మనము పరస్పరభేదముఁ బాటించి యొప్పరికించి చూడఁ జనునే?

ఆదిత్యునియెడ వెలుంగును జంద్రునియెడ శీతలకాంతియుం దఱుఁగనియట్లు మీయెడ నస్త్రవిద్యాచాతుర్యం బొకనాఁడైనం దఱుఁగదు. నాలుగు వేదము లొక్కతలగా ధనుర్వేదం బొక్కటి యొక్కతలగాఁదలంచి బ్రహ్మాస్త్రంబు మున్నగుదివ్యాస్త్రముల నెల్ల సాధించి యున్నవారు. వేదవేదాంతధనుర్వేద పురాణేతిహాసాది పరిజ్ఞానంబున జామదగ్న్యుఁడొక్కరుఁడు దక్కఁ దక్కటివాఁ డెవ్వఁడు ద్రోణాచార్యునకు సమానుఁడు గాఁడని యందఱకుం దెల్లంబు. కృపాచార్యుఁడు ధనుర్వేదవిదులలో నుత్తముఁడు. నీవును దండ్రికి సమానుఁడ వనియే యందఱుం దలంతురు. ఇట్టిమహారథు లగు మీరుండియు దుర్యోధనున కొకటి గలిగెనేని యది మీకుం గలిగినదియ కాదే? కావున నీసమయమునఁ బరస్పరభేదముఁ దలపోయక యుద్ధసన్నద్ధులమై మన మందఱముం గూడి యర్జునుం దాఁకవలయు. క్షమియింపుఁ డని చెప్పిన విని యశ్వత్థామ గాంగేయుం జూచి యయ్యా! మీరింత చెప్పఁ గలరు. దుర్యోధనుదురాచారమునకుఁ బొడమిన క్రోధమునం జేసి పుత్రనిర్విశేషుం డైనప్రియశిష్యునిగుణముల నాచార్యుఁడు పేర్కొనియె. అది యొక్క పెద్దతప్పా? శత్రుఁడైనం గుణవంతుఁ డయ్యెనా తద్గుణముల నుగ్గడింపవలయు. గురువైనను దోషవంతుఁ డయ్యెనా తద్దోషములఁ జూపి చెప్పవలయుంగదా? ఇదియొక్క తప్పుగ భావించి ప్రల్లదములాడిన నెట్లు సైఁపవచ్చు ననిచెప్పుటయుం శాంతనవుండు వెండియుశాంతివచనంబులఁ జెప్పి యతని ననునయించె. అంత దుర్యోధనుఁడు ద్రోణుం జేర వచ్చి యాచార్యా! క్షమింపవలయు. ఇపుడు మీరు భేదముఁ దలంచి యొప్పరికించినం గార్యము సెడకుండునే? మీరు ప్రశాంతులరై ప్రకృతకార్యముఁ జూతురేని నాకు మేలు సేకూఱు నని భీష్మకృపకర్ణసహితుండై ప్రార్థించిన నయ్యాచార్యుఁ డిట్లనియె. కురుపితామహుండు సెప్పినప్పుడే యేను శాంతిం బొందితి. అది యట్లుండె. పదుమూఁడేఁడు లిడుమలఁ బడి యాకోపముఁ దీర్చుకొనంగ గాండీవి యిదె వచ్చుచున్నవాఁడు. వాఁడు తప్పక దుర్యోధను నిగ్రహింపఁ

ప్రయత్నంబు సేయుఁ. సాహసమునఁ గొండె మోహమునఁ గొండెఁ గురురాజు వానిబారిం బడి బమ్మగింపకుండఁగను సేనకు సేఁగి రాకుండఁగను నీతిప్రకారమున వ్యూహముఁ బన్నియుండవలయుఁ. అర్జునుఁ డిపు డించుకేనియు శాంతిఁ బూనఁడు. కావున నెంతేఁ గడంకమై నుండవలయుఁ. పాండవులయజ్ఞాతవాసంబింకను దీఱలేదని తొలుతఁ గురునృపాలుండు సెప్పె. ఆసంశయంబు దీర్పఁగ గాంగేయుండు నేర్పు ననుటయు భీష్ముఁ డిట్లనియె.

భీష్ముఁడు పాండవుల యజ్ఞాతవాస నియమ పరిపూర్తి నిష్కర్షించుట.

కాలచక్రంబు కళాకాష్ఠాముహూర్త దినపక్షమాసర్తుసంవత్సరాది భేదమునం బ్రవర్తిల్లు. అందు గ్రహనక్షత్రచారభేదమునం జేసి యైదేసి యేండ్ల కొక్కతూరి రెండధికమాసంబులు వచ్చుచుండు. ఇట్లీపదుమూఁడేఁడులకు వచ్చినయధికమాసంబులు గణింపఁగా నిప్పటి కైదునెలలుఁ బండ్రెండుసాళ్లు నధికము లగుచున్నవి. దానంజేసి పాండవులనియమవత్సరములు నిన్నటితోఁ గడచె. తమపూనినప్రతియజ్ఞ యథాశాస్త్రంబుగ నడిపియే యర్జునుడిట నగపడుచున్నవాఁడు. ధర్మార్థకోవిదులు మహాత్ములు ధర్మరాజోపదిష్టమార్గప్రవర్తులు నగువార లొక్కనాఁడేనియు ధర్మంబు దప్పి నడతురే? లోభము నూని దుష్కరవ్రతంబు సలిపి వచ్చినవారు లోభవశులై ధర్మంబు దప్పుదురేని నాఁడే యడవులకుఁ బోవక యుద్ధకాంక్షులై నిలిచిరేని దేవేంద్రుఁ డడ్డపడినను జయించి తమరాజ్యముఁ గొనియుండుదురు. వారిపరాక్రమంబు క్రొత్తయే? ధర్మపాశనిబద్ధు లయినయామహాత్ము లనృతంబుకంటెఁ జావు మే లని తలంచి సంకేతప్రకారంబు నడపిరి. ఇంక నిపు డాలసింపరాదు. అర్జునుఁ డిదె వచ్చినవాఁడు. సంగ్రామంబున జయాపజయంబులు నమ్మరాదు. లెస్సగఁ జింతించి యుద్ధసన్నాహ మొండె ధర్మసంయుతం బయిన సంధికార్యంబొండె శీఘ్రంబ చేయవలయు ననిన దుర్యోధనుండు పితామహా!

పాండవులకు నేను రాజ్య మియ్యను. సంధి పొసఁగదు. యుద్ధసన్నాహంబు శీఘ్రంబ సమకట్టుఁ డని పలికె. ఆమాట విని భీష్ముఁడు దుర్యోధనుం జూచి య ట్లగు నేని పోరికైనం దగురీతి సమకట్టవలయు. సర్వప్రకారంబుల నీకు శ్రేయస్సు చెప్పవలసినవాఁడ నగుటం జేసి చెప్పెద. నావచనంబు హితం బని తోఁచిన నట్ల చేయుఁడు. సేనలో నాలవపాలు గొని నీవు పురమునకుఁ బొమ్ము. తక్కటిచతుర్థాంశము గోగణరక్షణార్థంబు నిలుపవలయు. శిష్టంబు లయిన రెండుభాగములఁ గొని యేను ద్రోణకృపాశ్వత్థామకర్ణులుం గట్టి మోహరంబు సేసి బీభత్సు నెదిరింతుము. అతండు గాక విరాటుండు వచ్చె నేనియు దేవేంద్రుఁడు వచ్చె నేనియు నేను సముద్రమును వేలయుంబోలె నిలువరింతు నని చెప్పుటయు దుర్యోధనుం డిది లెస్స యని తత్ప్రకారంబు చేసె. అంత శంతనుపుత్రుండు సేన నొక్కవ్యూహంబుగాఁ బన్ని నడుమ నాచార్యుని డాఁపట నాచార్యపుత్రుని వలపటఁ గృపాచార్యుని నగ్రభాగంబునఁ గర్ణుని నిలిపి తాను సర్వసేనారక్షణపరుండై వెనుకటి వెస నిలిచియుండె.

శ్రీమదాంధ్ర వచన భాగవతము

దశమస్కంధము.

కంసుఁడు రామకృష్ణులకుఁ గీడు సేయ నాలోచించుట.

అంత నక్కడ మథురాపురంబున నున్నకంసు నొద్దకు నారదముని యేతెంచి యశోదకుఁ గూఁతురు పుట్టుటయు దేవకికే యష్టమగర్భంబునఁ గృష్ణుండు జనించుటయు రాముఁడు దొలుత దేవకీగర్భస్థుండై యటరోహిణీసుతుం డవుటయు వెఱపున వసుదేవుఁడు రామకృష్ణుల నాత్మమిత్త్రుం డైన నందునొద్ద నునుచుటయు వార లిప్పుడు నందవ్రజంబున నుండుటయు వారలే పూతనాప్రలంబాదుల వధించుటయుం దెలియఁజెప్పె. మునివచనంబు విని కంసుండు కోపవ్యథితచిత్తుండై వాఁడివాలుఁగొని వసుదేవుని వధింపఁ బూనుటయు నాదేవర్షి వారించె. నారదవచనంబున వసుదేవవధం బుడిగియుఁ గంసుండు తత్పుత్త్రులు దన్నుఁ బరిమార్తు రన్నయలుక పెల్లున నాదేవకీవసుదేవుల లోహపాశముల బంధించె. నారదుం డరిగినపిదపఁ గంసుండు కేశి యనువానిం బిలిచి నందవ్రజంబున నున్న రామకృష్ణులం దెగటార్పఁ బుత్తెంచి ముష్టికచాణూరశలతోసలకప్రభృతులను మఱియుఁ దగినమంత్త్రులను మావంతులనుం బిలిచి యిట్లనియె. వసుదేవునికొడుకులైన రామకృష్ణులు నాకు మృత్యువని నిర్దేశింపఁబడినవారు నందవ్రజంబున నున్నవారఁట. వారినిటకు రప్పింతు. చాణూరముష్టికులు మల్లయుద్ధమున నయ్యుద్ధతులం దెగఁజూడవలయు. అనేకమల్లులుగూడఁగ మంచిమంచియలు సవరించునది. పౌరజానపదులందఱు నావేడుక చూడవలయు. (అయ్యా! నాకాత్మబంధువులతోడిపగకు మూలంబు సెప్పెద నాకర్ణింపుఁడు. తొల్లి యుత్ఫుల్లవల్లీవేల్లితతరునికరములఁ జెలువారు కెంజివుళులను విరులను సొంపు మీఱి యున్నయుద్యానం

బున విహరించుచు ఋతుస్నాతయై పతిసంగమంబు మనంబునం గోరుచున్నంతఁ దన్మనోగతం బెఱింగి ద్రమిడుం డను నొక్కగంధర్వుఁ డుగ్రసేనవేషముతో రమణీయవర్ణుండై యేతెంచి యధర్మమున నాపతివ్రతతోడ సంగమించె. అట నాసాధ్వి వాని నన్యపురుషుంగా నెఱింగి యోరీ! యేల యిట్లు దుర్వృత్తి నడపి తని దూఱి యతండు దనగంధర్వకులమహిమోన్నతి చెప్పి యనులోమసంకరంబు దోషకారణంబు కాదని నిరూపించిన నాసతి సర్వభూతచేష్టితంబులకు సాక్షులైన భూజలానిలానలాకాశ సూర్యచంద్ర దిక్కాలధర్మాదుల సరకుగొనక తప్పుసేసి తని యదలించుచున్నంత నాతండు శాపంబునకు వెఱచి నాచేసినయది తప్పుగాదు. నావీర్యంబు వృథవోదు. శ్రీమంతుండు ధీమంతుఁ డుత్సాహవంతుండు నగుకొడుకు నీకుఁ బొడమెడు. నామాట తప్ప దని చెప్పె. చెప్పినం బాతివ్రత్యహానికిఁ గుందుచు మాతల్లి యోరీ! ధర్మమర్యాద యతిక్రమించి యుత్పథంబున నున్మార్గంబున నడచుచుఁ బాపములొనర్చునీకుఁ బొడముకొడుకు క్రూరుండు సాహసప్రియుండు నిర్ఘృణుండు దేవద్విజతాపసుల కననుగ్రాహ్యుండు నయ్యెడు నని పల్కుటయు నట్టులైన నాకంసు నీవారికిఁ బగవాఁడగు నని యతండు పలికి యంతర్ధానంబు నొందె. అట నస్మజ్జనని యావృత్తాంత మితరుల కెఱిఁగింప వెలియకుండ గోప్యంబు గావించి యుద్యానంబునుండి యింటి కరుదెంచి గంధర్వధారితం బైనయాగర్భమునం దతితో నన్నుఁ గనియె నని తొల్లి నారదుండు నాకుఁ జెప్పియుండెఁ. అది కారణంబుగా నే నుగ్రసేనవసుదేవాదు లగుస్వజనులతోఁ బగఁ బాటించియుండుదు. వారిని వారికిఁ గూర్చువారినిం బరిమార్చిన నాకేమియు దోషంబు గలుగదు. రామకృష్ణులం దొలుతఁ జంపించిన నెల్లయు నిర్వృత్తప్రాయం బగు.) నందవ్రజమునుండి రామకృష్ణులిటకు వచ్చునంతకు మల్లయుద్ధమున కేర్పఱుపంబడు రంగస్థానంబు నాఁకిటఁ గువలయాపీడనామకం బైనమదవేదండంబు నిలిపి తొలుతనే వారి నవ్వారణంబునకు బలి పెట్టవలయు. ఆగామిచతుర్దశినాఁడు ధనుర్యాగంబు వొడరుదు. భూతరాజునకు మేధ్యపశువుల విశసింపుఁడని వారి కానతి యొసంగె.

రామకృష్ణులం దోడితేర నక్రూరునిఁ గంసుండు పంపుట.

అవ్విధంబునఁ గార్యతంత్రములందు నియోజ్యుల నియోగించి కంసుం డక్రూరుని బిలిచి యయ్యదుపుంగవు కేలు దనకేల నిముడుచు నిట్లనియె. దాశపతీ! యాదరంబున మిత్త్రకార్యం బొనర్పుము. వృష్ణిభోజులలోపల నీకంటె నొండొక్క హితుండు నాకుఁ గానంబడఁడు. ఇంద్రుండు విష్ణువు నాశ్రయించి స్వార్థము సాధించినవిధంబునం గార్యార్థభరంబు దొడరినదాన నేను నిన్నే సౌమ్యా! యాశ్రయించితి. నందవ్రజంబున కరిగి యందు దున్నవసుదేవసూనుల నీరథమునం దోడితెమ్ము. విష్ణుదేవునిప్రాపుఁ గాంచినసుర లారామకృష్ణుల నాకు మృత్యువుగా నిర్దేశించిరఁట. కావున వారిని వారికిఁ బ్రాపైన నందాదిగోపాలకుల నుపాయనైపుణ్యంబున నిటకు నీవు తోడితెచ్చిన నిందుఁ గాలాంతకతుల్యం బైనయీకువలయాపీడవేదండమున వారిం బొలియింతు. దానికిఁ దప్పి రేని పిడుగువంటిమల్లులం బురికొలిపి చంపించెద. వారిద్దఱు మడిసిరేని తద్బంధువులైన వసుదేవాదులగుయదువృష్ణిభోజదశార్హప్రభృతులను వృద్ధుండయ్యు రాజ్యముఁ గోరునాతండ్రి నుగ్రసేను నతనితమ్ముని దేవకుని మఱియు నాపగవారి నెల్లను బరిమార్చి భూతలంబు నిష్కంటకంబు గావించి నాగురు వగుజరాసంధుండు నాచెలు లగుద్వివిదశంబరనరకబాణప్రముఖులును దోడ్పడం జేర్చి దేవపక్షంబువారి నెల్ల నొక్కొక్కనిఁగా నున్మూలించి యీమహి యెల్ల నేన యేలుదు. ఇయ్యర్థంబు నీమది నునిచి యిచ్చట నడుపంబడు ధనుర్మఖంబు వేడుకలు సూడను మధురాపురవిభవంబుఁ గనుంగొనను గా నారామకృష్ణులం దోడితెమ్మని చెప్పినం గంసున కక్రూరుం డిట్లనియె. రాజేంద్రా! నీకీడు దప్పించికొన నీవు పన్నినయుపాయంబు లగ్గగుం గాని దైవాధీనంబు లైనసిద్ధ్యసిద్ధులకుఁ దుల్యుండ వగుము. జనుండు దైవోపహతంబు లైనకోర్కులు పెంచుచుం గోరి తదీయసిద్ధ్యసిద్ధులయెడ హర్షశోకములం గుడుచు. ఐన నీశాసనంబు సేయుదు నని యక్రూరుం డొడంబడుటయుఁ గంసుఁ డతనిం దక్కినమంత్రులను వీడుకొలిపి యంతర్గృహంబునకుఁ జనియె. అక్రూరుండు నిజనివాసంబున కరిగె.

శ్రీకృష్ణుఁడు కేశి యనురాక్షసునిఁ జంపుట

అటఁ గంసునిపంపునం గేశి యశ్వరూపముఁ గొని ఖరఖురవిఘట్టనం బునంబుడమి బీఁటలువోవ సటాపటలవిధూననంబున నంబరంబున నంబుదం బులు విమానంబులును సంకులత్వంబు నొంద హేషితఘోషణంబునకు నిఖిల సత్త్వంబు వెఱచఱచి పఱవ విశాలనేత్రంబు వికటవక్త్రకోటరంబు బృహ త్కంఠంబును లోకభీకరంబై యమర నంజనాచలసదృశంబై యెరికిం దేఱి చూడరాకుండ నుద్దండంబై గంసునకు హితము సేయ నెంచి నందవ్రజమునకుఁ జను దెంచె. పరమభీకరాకారంబుతో నట్లు వచ్చి గోకులంబునం దన్ను వెదకు చున్న యామాయాహయముం గాంచి కృష్ణుండు సింహనాదంబు సేసి దానిం బోరికిఁ బిలుచుటయు నయ్యది యయ్యార్పు విని యాకసంబు మ్రింగు భంగి నోరు దెఱచి పాఱుతెంచి పిమ్మటి కాళులం గృష్ణు నడిచె. అరవిందలోచ నుం దత్తాఁకు దప్పించికొని పన్నగగ్రహణతీవ్రుం డైనవైనతేయునిచాడ్పున వీఁక నడరి యయ్యశ్వము కాళుల రెంటిని దనబాహువులం బట్టి యెత్తి నూఱువిండుల పెట్టుకోలఁదిక్ నేలతో విసరి వైచిన నది మూర్ఛిల్లె. కొం డొకవడి కాసైంధవంబు దెలిసి లేచి రోషమున నోరు దెఱచి హరిని మార్కొన నేతెంచుటయు నమ్మధుసూదనుండు బిలమున నురగముంబోలె దానివ్యాత్తవక్త్రంబునఁ దనవామభుజముం జొనిపె. చొనుపుటయుఁ గ్రాఁగిన యినుపకట్టియం దాఁకిన నెట్టు లట్టులు భగవద్భుజంబు దాఁకి దానిపండ్లు రాలి పడియె. తురంగవక్త్రకుహరాంతరగతం బైన యచ్యుతభుజంబు దఱితోఁ దగిన చికిత్స లేక యుపేక్షితం బైనరోగంబురీతిం బ్రతిక్షణంబునం బెరుగుటయు నాఘోరనిశాటఘోటకంబు వాయుసంచారంబునకుఁ దనలో నెడగానక కాళులు దన్నికొనుచు మేనఁ జెమ్మటలు గ్రమ్మఁ గన్నులు గ్రిందికి మీఁదికిఁ దిరుగుడువడ లద్దివెట్టి యసువులం బాసి నేలం బడియె. లో నుబ్బినయచ్యుత భుజసమ్మర్దమునం జేసి దోసపండువోలె బ్రద్దలువాఱిన యాగుఱ్ఱపుఁ

పీనుఁగుబోఁటియుండి చతుర్భుజుండు దనభుజ ముపలీలం దీసికొని యందల కబ్బురంబునొందిన దివిజుల ప్రస్తుతులకుం బ్రసూనవృష్టికి నిచ్చ మెచ్చె.

నారదుఁడు శ్రీకృష్ణునొద్దకు వచ్చుట.

అట్టియెడ భాగవతవర్యుం డైన నారదుం డేకాంతమున నారమా కాంతుసన్నిధికిఁ జనుదెంచి యిట్లని విన్నవించె. కృష్ణా! యప్రమేయాత్మ! యోగేశ్వరేశ్వరా! జగదీశ్వరా! వాసుదేవా! యఖిలాధారా! యదువర్యా! సమిత్తులలో నెల్ల నగ్ని యెట్టులట్టులు సర్వభూతములలో నీ వనుస్యూతుండవై గూఢుండవై బుద్ధికి నతీతుండవై సర్వసాక్షివై పరిచ్ఛిన్నమతులకు దుర్బోధుండవై సర్వేశ్వరుండవై వెలయుదువు. నీవు స్వతంత్రుఁడవై యాత్మేచ్ఛను దొలుత నాత్మమాయాయోగమునఁ గుణముల సృజించి సత్యసంకల్పమున నాగుణముల నీజగములకు సృష్టిస్థితిలయముల నొనర్తువు భూభారంబైన దైత్యదానవాదులఁ బరిమార్పను సాధువులఁ బ్రోవను నీ వవతరించినవాఁడవు. తన హేషితంబునకే యనిమిషులు త్రివిమునఁ దొఱంగి పఱవ విక్రమంబున మెఱయునీకేశి నశ్వరూపధరుని భాగ్యమునం బరిమార్చితివి. రేపు గడప నుఱునాఁడు చాణూరుని ముష్టికుని మఱియుఁ గొందఱ జెట్లను మత్తమాతంగంబును గంసునిం జంపుదువు. ఆనృశంసు ననువర్తించుపంచజన యవన మురనరకాదులను గ్రమంబునఁ బొలియింతువు. ఇంద్రు నోడించి తల్లోకమున నుండు పారిజాతముం బుడమికిఁ దెత్తువు. వీర్యశుల్కమున వీరకన్యకలం బెండ్లి యవుదువు. ద్వారకను నృగునకు శాపముక్తిఁ గావింతువు. భార్యయగు జాంబవతితోడ స్యమంతకమణిం దెత్తువు. మహాకాశ పురమునఁ బ్రాహ్మణునకు మృతపుత్త్రుఁ బ్రతికించి యిత్తువు. పౌండ్రకుని వధింతువు. కాశీపురిం గాల్తువు. దంతవక్త్రుం దెగటార్తువు. ధర్మరాజురాజసూయమున శిశుపాలుం బొలియింతువు. మఱియు నీవు ద్వారకలో వసించి యేయేకార్యముల నిఁకఁ జేయుదువు వానినెల్ల నేను గనుంగొనంగలవాఁడ. లోకసంహారార్థంబు కాలరూపుఁ డైననీవు సవ్యసాచికి సారథియై బహుళాక్షౌహిణులం బిలుకుమార్ప

నేను జూడ నున్నవాఁడ. ఆత్మపరమానందనిష్ఠ నఖిలకామములఁ బరిపూర్ణుండై నిజచిచ్ఛక్తిమహిమమున నాత్మమాయాకార్యగుణప్రవాహోపరతిం గాంచి సత్యసంకల్పుఁడై జ్ఞానైకమూర్తియై వెలయు నిన్నాశ్రయించెద. ఆత్మమాయాకల్పితవివిధవికల్పము లాశ్రయించి లీలార్థంబు యదుకులంబున మానుషవేషముం బూని స్వాశ్రయుండై యొప్పునీకు మ్రొక్కెద నని పలికి యాదేవర్షిప్రవరుండు భగవంతునకుఁ బ్రణామం బాచరించి తదాజ్ఞంబడసి తద్దర్శనానందమున నుప్పొంగుచు నిజేచ్ఛం జనియె.

శ్రీకృష్ణుఁడు వ్యోమాసురుం జంపుట.

అట భగవంతుఁడు కేశివధసంతుష్టచిత్తులైన గోపాలకులు వెరసి నడప గోగణంబులఁ దోలుకొని సాయాహ్నంబున వ్రేపల్లియకుఁ జనియె. అంత నొక్కనాఁడు కృష్ణరక్షితులైన గోపాలురు కొండనెత్తములం బసులమేపుచుఁ దమలోఁ గొందఱు మ్రుచ్చులు గాఁగఁ గొందఱు గావలివారు గాఁగ నమరి నిర్భయులై డాఁగురింత లాడఁ దొడరి కొందఱు మేఁకలఁగా నెన్ని చోరాయితులు మ్రుచ్చిలించికొని యరిగి దాఁచుచుండిరి. అట్టియెడ మహామాయుఁడైన మయునికొడుకు వ్యోమాసురుఁ డనువాఁడు గోపాలరూపముం గొని వచ్చి గోకులంబు సొచ్చి మేషచోరాయితులైనయయ్యరుగలవారిం గొనిపోయి కొండగవిలోనికిం జొనిపి పృథుపాషాణంబున వాఁకిలి గప్పె. అట్లతండు నలువురేవురు దక్కఁ దక్కినగోపాలకుల నెల్ల నాగిరికందరంబున నడంచు టెఱింగి సాధురక్షకుం డైనహరి మేఁకం బట్టుతోఁడేలు వీఁకం బ్రబలి తా నాగోపహరిం బట్టిన నాపెట్టిదుండు కొండవోలె మేను వెంచి కోలఁదికి మీఱి కడంగియుఁ గృష్ణునిపట్టు తప్పించుకొనఁ జాలక బమ్మరించుచుండె. అచ్యుతుం డట్టులు బిట్టు పట్టి వానిం గ్రిందఁ ద్రోచి చూచుఖేచరులు పిచ్చలింపఁ బశువుం జంపురీతి వానిం జంపి గుహావాఁకిటం బెట్టిన పాషాణముఁ దొలఁగించి యందున్నగోపాలకుల వెలువరించి సురలు ప్రస్తుతింప నాపన్నిర్ముక్తులైనగోపకులు పొగడ మగిడి గోకులంబునకుఁ జనుదెంచె.

అక్రూరుఁడు నందవ్రజమునకుఁ జనుదెంచుట.

అక్కడ నక్రూరుం డారేయి గడపి వేకువను రథమారోహించి నంద వ్రజమునకుఁ జనుదేరఁ దఱలి తెరువునఁ దనమనంబున భగవద్భక్తిఁ గలువాఱ నిట్లని తలపోసె. ఏ నేమిసుకృతంబు సేసితినో యేయుత్తమతపంబు సల్పితినో యేదాన మేసత్పాత్రమున నర్పించితినో నేఁడు కేశవుం జూడఁ బోయెద. శూద్రునకు వేదోచ్చారణంబువోలె విషయాత్ముఁడగు నాకు హరి దర్శనంబు దుర్లభంబు. నదిలోనం బ్రవాహవేగమునఁ బోవుతృణాదులొక్కొకతఱిం గట్టు సేరునట్టు లధముఁ డగు నాకు నొకతఱి యాదృచ్ఛికంబుగఁ గాలగతిం బురుషోత్తమదర్శనంబు పొసఁగెడు. నేఁడుగదా నాయమంగళంబు నశింప జన్మము ఫలవంతంబు గాఁగ యోగిధ్యేయుని పాదారవిందమునకు మ్రొక్కుదు. హరిచరణకమలదర్శనంబు గూర నన్నుఁ బంపినకంసుఁడును నాకుఁ బెద్దయు మే లొనర్చెనని తలంపవలయు. అమ్మహనీయపదారవిందనఖకిరణములఁ దవిలి తొల్లింటి పెద్దలు భవసాగరంబు నిస్తరించిరి. బ్రహ్మాదు లర్చింపఁ బెంపు గాంచి గోపీకుచకుంకుమంబునఁ గెంజాయ రంజిల్లి యనుచరులతోడఁ బసుల మేపుచు నడవుల నడచునాకృష్ణుచరణముఁ గన్నులారఁ గనుంగొందు. సుందరకపోలనాసికావిలాసంబై స్మేరావలోకరుచిర నయనకమలాభిరామంబై సొంపారునారమాపతి నెమ్మొగమ్ముఁ జూతు. మృగము లెల్ల నన్ను డాఁపలించి యరిగెడు. భూభారంబు హరింపనాత్మేచ్ఛమైమనుష్య జన్మ మెత్తినలావణ్యధాముని దర్శనంబు నాకు నేత్రసఫలత్వంబు గావింపదనుట గాదు. ఎవ్వండు కార్యకారణంబుల కీక్షణకర్తయయ్యు నహంకారహీనుండై నిత్యస్వరూపసాక్షాత్కారమున నజ్ఞానమును దత్కార్యంబైన భేదమును దన్మూలకంబైన భ్రాంతినిం బాసియు నీక్షిత యగుతనయీక్షణంబున నాత్మ మాయాయోగమునం బ్రాణేంద్రియములతోడఁ దనయందే రచియింపంబడిన జీవులతోడ బృందావనంబునందును గోపికామందిరంబులందును లీలమైఁ దత్త

తాత్పర్యము లొనర్చి రక్తునిరీతిం దోఁచు సకలపాపహారంబులై పరమమంగళంబులైనయెవ్వనిగుణకర్మజన్మములతోడం గూడినవాక్కులు జగంబులకు జీవనంబును శోభనంబును బావనత్వంబు నొదవించు నట్టి వాక్కులం బడయనివారిసర్వాలంకారములు శవాలంకారంబు లగు నప్పరమపురుషుండు తన ధర్మసేతువుఁ బాలించువారికి సుఖముఁ గావింప యదుకులంబున నవతరించి దేవగీయమానం బశేషమంగళంబు నగునాత్మకీర్తిని వ్రజమునం బ్రకటించుచుండెను. మహాత్ములకు గమ్యుఁడైనవాని సర్వగురుండైనవానిఁ ద్రైలోక్యరమణీయంబై నయనానందసంధాయకంబై శ్రీదేవీకమనీయంబైనదివ్యసుందరమూర్తిఁ దాల్చినవాని నమ్మహాపురుషు నేను గాంతును. వేకువను నాకు శుభశకునంబులు పెక్కులు గానంబడియె. ఏను నందవ్రజంబు సేరి తేరు డిగ్గి వెనువెంటన జగదీశ్వరులైనరామకృష్ణులచరణముల నాత్మలాభముఁగోరు యోగు లాత్మచిత్తములందు ధ్యానింపఁబడినవానిని వారితోడఁ జెలిమిసేయు గోపాలురనుం బ్రణమిల్లుదునొకో. ఆజగద్విభుండు కాలము పేరిటిసర్పము వడికి వెఱచి తన్నాశ్రయించినవారి కభయ మొసఁగుతనకరారవిందము నడుగులపయిం బడిననాశిరంబుపై నునుచు నొకో. అమ్మహాత్మునికరకమలంబు నర్చించి యింద్రుఁ డింద్రపదముం బొందె. బలి తనతలపై దాని ధరించి యిఁక నింద్రుఁడు గాచుండెడు. సౌగంధికసౌరభముఁ బిసాళించు నప్పాణి పంకజంబకదా వివిధవిహారముల నలసి సొలసినప్రేశలయులయికలం దీర్చెడు. క్షేత్రజ్ఞుఁడైతాను నిర్మలదృష్టిం బ్రపంచమున నఖిలభూతముల బాహ్యాభ్యంతరవృత్తులరయు నయ్యచ్యుతుండు కంసునిపంపున వచ్చినతద్భృత్యుం డని నాపై నరిబుద్ధి సేయఁ డని తలంతు. తన యంఘ్రిమూలమునఁ జాఁగిలఁబడి లేచి కేలు మొగిచియుండునన్నుఁ గరుణార్ద్రం బైనస్మేరవిలోకనమునఁ జూచునొకో. దాన నేను బాపములనెల్లఁ బాసి శంక దక్కి పరమముదంబెనయుదు. సుహృత్తముఁడు జ్ఞాతి యనన్యదైవతుఁడు నగునన్నుఁ దనదీర్ఘబాహువుల నాకరుణానిధి కౌఁగిలించు. దాన నేను బరమపావనుండ నగుదు.

కర్మబంధముల నెల్ల నెడలుదు. కౌఁగిలించి కృతాంజలి యైననన్నుఁ దాత! యక్రూరా! యని పిలుచు. అప్పుడుగదా నాజన్మంబు ఫలవంతంబగు. కృష్ణుని యాదృతిం గానని నిర్భాగ్యునిజన్మంబు గాల్పనే? తన కొక్కఁడు ప్రియుఁ డొక్కఁడు ద్వేష్యుఁ డొక్కఁడు సుహృదుఁ డొక్కఁ డుపేక్షణీయుఁ డనుట లేకున్న నమ్మహాత్ముఁడు కల్పవృక్షమురీతిం గొల్చువారికిఁ దగినట్టులు ఫల మొసంగు. బలరాముఁడు కృతాంజలి యైననాచేయి పట్టుకొని గృహంబులోనికిఁ దోడ్కొని యరిగి యుచితసమస్త సత్కృతు లొనర్చి బంధువులలోఁ గంసభృత్యుఁ డనియెన్నక నగవు దొలఁకుమొగమున మన్నించునే యని తనలోఁ జింతించుచు నక్రూరుండు బడమర రవి గ్రుంకునంతకు నందవ్రజంబుఁ జేరం జనియె.

అక్రూరుండు బృందావనంబున రామకృష్ణులఁ గాంచుట.

చని యచ్చట లోకపాలకిరీటసేవితపరాగపరీతంబు లైనపద్మనాభు నడుగులం బద్మయవాంకుశాదిరేఖాలాంఛితము లైనవానిం గాంచి పరమాహ్లాదంబున మేను గరుపాఱ నానందాశ్రుజలంబులు గ్రమ్ముదేరం దేరు డిగ్గి బళే యివ్వి యయ్యచ్యుతుచరణరేణువు లని యుబ్బొంగుచు వానిపయిం బడి యయ్యక్రూరుండు పొరలాడె. దంభమును భయమును శోకమునుం ద్యజించి యాశ్వఫల్కతనయుండు దన్నుఁ గంసుఁడు పనిచినక్షణంబు మొదలు హరిస్మరణశ్రవణదర్శనాదుల మనంబు తన్మయంబుఁ గావించె ననుటే దేహధారులకుం బురుషార్థంబు. అతండట్లు పెద్దయుం బ్రొద్దు కృష్ణునడుగుల జాడపయిం బొరలిపొరలి లేచి రామకృష్ణులు గోష్ఠమధ్యంబున నున్నా రని గోపకుమారులవలనం దెలిసి తే రెక్కి సూర్యునివెలుంగు గనుపట్టునప్పుడే యయ్యీశ్వరుల గనుంగొనఁ గోరి రయంబునఁ బఱతెంచి గోదోహనస్థానంబున నున్న రామకృష్ణులం గాంచె పీతనీలాంబరధరులు శరత్కమలనేత్రులు నీలపాండురగాత్రులు శ్రీవిలాసపాత్రులు పీనాయతభుజులు సుందరవదనులు కరికలభవిక్రములు ధ్వజవజ్రాదిరేఖాలసత్పదకమలభాస్వరులు వనమా

లాదిమాల్యధరులు పుణ్యగంధానులిప్తులు సర్వాలంకారలక్షణసమంచితులు భూభారహరణార్థంబు నిజాంశమున నరరూప మెత్తిన ప్రధానపురుషులు నగు నాకృష్ణుని రాముని గాంచి యక్రూరుండు దటాలునఁ దేరుడిగ్గి నిజప్రభల దెసలు వెలిఁగించుచు రజతమరకతశైలంబులకరణిం దేజరిల్లు నారామకృష్ణుల యడుగుల ముందరఁ జాఁగిలం బడి భగవద్దర్శనాహ్లాదమున మేనం బులక లంకురింపఁ గన్నుఁగవ నానందజలంబులు గ్రమ్ముదేర నత్యుత్కంఠాభరమునఁ దన్నుఁ జెప్పికొనఁజాలకుండె. అదియెఱింగి భక్తవత్సలుం డైనభగవంతుఁడు చక్రలాంఛితం బైనతనకరంబున నతనిఁ జేరం జీరి కౌఁగిలించి కొనుటయుం బలదేవుఁడును బ్రణమిల్లియున్న యయ్యక్రూరుని లేవ నెత్తి కౌఁగిలించి కొని నిజపాణిపల్లవంబునఁ దదీయహస్తంబు గ్రహించి తమ్ముఁడును దాను నతనిం గృహాంతరంబునకుఁ దోడ్కొని చనిరి. అట నందుఁ డతని స్వాగతం బడిగి యుత్తమాసనంబునఁ గూర్చుండఁ జెప్పి విధియుతంబుగాఁ బాదప్రక్షాళనంబు సేసి గోవుతోడ మధుపర్కంబు నివేదించి మార్గాయాసంబున నలసిన యాశ్వఫల్కతనయునకుఁ బాదసంవాహనమున డప్పిపుచ్చి పావనం బైన రసవదన్నంబుఁ గుడువం బెట్టి భోజనానంతరము ముఖవాసంబుల గంధమాల్యంబులనుం బరమప్రీతి నాపాదించి యిట్లనియె. దాశార్హవర్యా! యాత్మప్రాణతర్పణపరుండై చెలియలి కుయ్యాలింపక యద్దేవకీదేవిబిడ్డలఁ జంపిన నృశంసుఁ డైనకంసుఁడు బ్రదికియుండఁ గటికవానియొద్ద నుండుగొఱియల తెఱఁగున నెల్లకాలం బాపాపాత్ముప్రాపునఁ దత్ప్రజలై యుండు మీకుశలం బేమని విమర్శింతు ననిపలికిన నమ్మధురవచనంబుల కానందమొంది యక్రూరుండు మార్గాయాసంబు వాసె.

రామకృష్ణు లక్రూరునితో సంభాషించుట.

అవ్విధంబున నందగోపకృతసత్కృతులం బడసి యక్రూరుండు పర్యంకమున సుఖాసీనుండై తాను వచ్చునెడఁ దెరువునఁ దనమదిలోఁ గోరిన కోరికలెల్లఁ బడసె. శ్రీనివాసుఁ డైనభగవంతుఁడు ప్రసన్నుఁడై నం బడయ

రాని యర్థముం గలుగునే? ఐనను భగవద్భక్తులు దేనింగోరరు. అట్టియెడ శ్రీకృష్ణుండు రాత్రిభోజనంబు నిర్వర్తించి యక్రూరునియొద్దకుఁ జనుదెంచి తమవారియెడం గంసునివర్తనంబు నతనిచికీర్షితంబును వినఁ గోరి యాశ్వఫల్కసంభవున కిట్లనియె. తాత! సౌమ్యా! స్వాగతంబే? కంసునిపంపున వచ్చితివి. మీకు మేలయ్యెడు. సుహృదులకు జ్ఞాతులకు బాంధవులకును సుఖము నారోగ్యమునుం గలుగునే? మాకు మేనమామ యనుపేర మనకులమునకు రోగం బైనకంసుఁడు వర్ధిల్లుచుండ మనవారికిఁ దత్ప్రజలకుఁ గుశలం బేమని యడుగుదు? అక్కటా! మావలనం దల్లిదండ్రులకుఁ గష్టంబులు గలిగె. మానిమిత్తమునంగాదె పుత్త్రమరణంబులు వారి కయ్యె. కాంక్షితం బైన స్వజనసందర్శనము మాభాగ్యమున నేఁ డొనగూడె. మీర లరుదెంచిన పని యేమని యడుగుటయు నక్రూరుండు కంసునకు యాదవులపైఁ గలిగినవైరానుబంధము వసుదేవుం జెఱఁజూడఁ బూనుటయు నారదువచనంబున నతండు రామకృష్ణులు వసుదేవసూను లనియెఱుంగుటయుఁ దన కతండు పనిపంచిన యుద్దేశంబును రామకృష్ణులఁ మధురకుఁ దోడికొని బోవఁ గంసునిపంపునఁ దాను దూతయై వచ్చుటయు మున్నుగా నెల్లవృత్తాంతముం దెలియఁ జెప్పె. నందుఁ డప్పుడు గోపాలుర నందఱం బిలిపించి యెల్లి మధురానగరంబునకుఁ బోవలయు. రాజున కటఁ గానుక వెట్టఁగ గోరసముల నెల్ల గొనుఁడు. శకటములఁ బూన్ప నేర్పాటు సేయుఁడు. అందుఁ బ్రవర్తిల్లు ధనుర్యాగంబు సూడ దేశవాసు లందఱును వత్తురఁట. మనము నవ్వేడుక చూచి వత్త మని చెప్పి నందుఁడు వ్రేపల్లియలో నెల్లెడం బ్రయాణంబుఁ జాఁటించె.

గోపికలు మధుర కరుగుకృష్ణువిరహమున కడలుట.

చాఁటించుటయు గోపికలు రామకృష్ణుల మధురకుఁ దోడ్కొని పోవ నక్రూరుండు వచ్చె ననియు రేపకడ వారు దఱలుదు రనియు విని భావివియోగమునకుఁ జింతించుచు మోము వాడినవారును వస్త్రవలయకేశపాశంబులు వీడినవారును కృష్ణుఁ జింతించుచుఁ బెఱవృత్తులు సాలించినవారును ముక్తిఁ బొందినవారితీరున నీలోకము మఱచినవారును గృష్ణుఁడు చిత్రముగ

ననురాగాతిశయమునం బలికిన హృదయంగమవచనములఁ దలపోసి మోహ మొందువారును స్మేరావలోకరుచిరంబు లైనయాలీలాగోపాలునిశోకహర కార్యంబుల నుద్దామచరిత్రంబులఁ జింతించువారునై యయ్యచ్యుతుపైమనంబు నిలిపి భావితద్వియోగంబున కడలుచు నశ్రుపూర్ణలోచనలై తమలో నిట్లని వగచిరి. విధాతృఁడా! యక్కటా! నీకొక్కనిమీఁదనైనం గరుణ లేదుగదా? మైత్రినిఁ బ్రణయమునను దొలుతఁ బ్రాణులఁ జేర్చి వారలు కృతార్థు లగుటకుమున్న యెడఁబాపుదువు. పిల్లవానియాట లెట్లట్లు నీచెయ్వులు నిరర్థకంబులు. నీలకుంతలావృతంబై సుందరకపోలనాసికావిలసితంబై శోకహరదరహసితరుచిరంబై యొప్పుముకుందుని నెమ్మొగమ్ముం జూపి యట నదృశ్యంబు గావింపఁబూనితి విది సాధుకృత్యంబుగాదు. నీ సకల సృష్టిసామర్థ్యంబులకెల్ల నేకాశ్రయం బైనగోవిందువదనంబుఁ గాంచినమాకన్నుల నక్రూరవ్యాజమున నోక్రూరుఁడా! హరింపఁ బూనితివి. ఆనందనందనుఁ డన్ననో క్షణభంగురసౌహృదుండు గావునఁ గ్రొత్తక్రొత్తలు మెచ్చుచుఁ బతిపుత్రబాంధవగృహాదులం ద్యజించి తన కూడిగంబు సేయవచ్చినమా వెసం జూడఁడు. క్రేగంటిచూడ్కుల వేడ్క సేయులేనగవుజిగులందుఱఁగలిగొనుముకుందువదనము చూచుమధురాపురసుందరులకు రాత్రి సుప్రభాతం బగు. కోర్కులు సత్యము లగు గోవిందుఁడు ధీరుఁడయ్యుఁ బిత్రాదిపరతంత్రుఁడయ్యె నన్నాగరికవిలాసినుల లజ్జాలలితవిభ్రమంబులనను, మధురభాషితంబులనుం జొక్కి యిక్కడి గ్రామ్యుల నిఁకఁ దలంపునకుఁ దెచ్చునే? గుణాస్పదుం డైనశ్రీరమణుం జూచుపాంథులకును మధురానగరవాసులకును గన్నులపండువు గాఁగలయది. మమ్ము నూరార్చక ప్రాణములకంటెఁ బ్రియుండైన నందనందనుం జూడ్కిమేర మీఱఁ దోడుకొని పోవ నరుదెంచిన యీనిర్దయున కక్రూరుండను పేరుచెల్లదు. అతిక్రూరుఁ డైనయతని కక్రూరనామం బెట్టులు గలిగెనో యూహింపరాదు. కఠినచిత్తుఁ డైనకృష్ణుండు తేరుపూన్చినంతన యారోహించి తఱల మనసు వెట్టెను. దుర్మదు లైన యీవృద్ధగోపకులు నతనిమతంబనువర్తించి బండ్లు గట్టించుచున్నవారు. దైవమును మనకుఁ బ్రతికూలం

బయ్యె. మనమేగి మాధవుని వారింతము. ఒకనిముసమైన విడువరానిముకుంద సంగమును దైవమునఁ బాసి రిత్తవోయినచిత్తమ్ముల నుమ్మలించుమనలం గుల వృద్ధబాంధవు లేమి సేయంగలవారలు? రాసగోష్ఠియందు సుందరమందహాసముల నపాంగవిలోకముల గాఢాలింగనములను రేలెల్ల నొక్కనిముసంబకాఁ గడపి సుఖించినమన మెట్టు లీదురంతవియోగతిమిరంబు నిస్తరింతుము? గోరేణువులు గ్రమ్మినయలకలు గప్పిననెమ్మొగముతో లలితముగఁ బిల్లనగ్రోవి యూఁదుచు విలాసమునఁ గటాక్షించుచుఁ బ్రదోషవేళల వ్రేపల్లెకు గోపపరివృతుండై రామునితో నేతెంచుముకుందునిఁ గానక యొక్క నిముసంబైన నెట్టులుండ నేర్తుమని గోపసుందరులు గోవిందుని పయిని డెందము నిలిపి తద్వియోగంబునకు వగచుచు సిగ్గు విడిచి గోవింద! దామోదర! మాధవా! యని పెలుచ విలపించిరి.

అక్రూరుఁడు రామకృష్ణులఁ దోడ్కొని మధురకుఁ జనుట.

హరివిరహమునకు వగచుచు గోపిక లట్టు లడలుచుండునంతఁ బ్రొద్దు వొడుచుటయు నక్రూరుండు స్నానసంధ్యావందనాదికృత్యంబులు నిర్వర్తించి తేరు పూన్పించి తెచ్చి రామకృష్ణుల నందుఁ గూర్చుండఁ జెప్పి వారు రథారూఢు లగుటయుఁ దాను సారథికృత్యంబునకుఁ బూని తఱలె. నందప్రభృతు లయినగోపాలురును శకటంబులపై నానాగోరసముల రాజునకుఁ గానుక వెట్ట సంగ్రహించి కృష్ణుని తేరివెంబడి నడిచిరి. గోపికలు ప్రయాణోన్ముఖుండైనముకుందునొద్దకుఁ జని మగిడి త్వరితంబుగ వత్తు నని యత్తామరసాక్షుండు సెప్పినమాట కూఱడిల్లి రథకేతనంబు నటఁ బరాగపటలంబు నగపడు నంతకు నచ్చటన తమమనమ్ముల నమ్మాధవుని వెంటఁ బంపిరో నాఁగఁ జెయ్వులు దక్కి చిత్తరువులట్టు లుండియుండి పెద్దయుం బ్రొద్దు కృష్ణుండు మగిడి వచ్చునో యని చూచిచూచి యిఁక రాఁ డని యయ్యాశ విడిచి యింటికిఁ జనుదెంచి కృష్ణచరిత్రంబులఁ గీర్తించుచుఁ దలంచుచు వనట యుండిరి. అక్కడ నక్రూరుఁడును రామకృష్ణులును వాయువేగంబైనరథంబున యము

నానదికిఁ జనిరి. అట హరి తా నన్నయుఁ దేరు డిగ్గి మధురనిర్మలం బైన తన్నదీజలంబు లాచమించి త్రావి తరుతలంబునఁ గొండొకవడికూర్చుండి యటఁ దేరెక్కె. అక్రూరుఁడు వారిం దేరిపై నాసీనులఁ జేసి తదామంత్రణంబు వడసి స్నానార్థం బమ్మహానదికిం జనియె.

అక్రూరుఁడు యమునలోపల రామకృష్ణులఁ జూచుట.

చని యక్రూరుండు వేదమంత్రముల జపించుచు యమునానదిమడుఁగులో మునిఁగి యచ్చట రామకృష్ణులంగాంచి రథస్థులై యున్నవీరలిట కెప్పుడు వచ్చిరి? తేరిమీఁద లేరు కాఁబోలు నని తలంచుచు లేచి తొల్లింటిచందమున స్యందనమున నున్నవారింగాంచి యిది యేమి యిప్పుడు వీరు నీరిలో నగపడి రిటఁజూడఁ దేరిపయి నున్నవారు. వాస్తవముగ జలములోపల లేరో కో యని వితర్కించి క్రమ్మఱ నమ్మడువులోన మ్మునిఁగి యందు సహస్రఫణామండలప్రభలు వెలుఁగ శిఖరనికరవిలసితం బైనకైలాసశైలంబుచాడ్పునఁ దెల్లనిచాయ నుల్లసిల్లి యవనతకంధరు లైనసిద్ధగంధర్వాదుల ప్రస్తుతు లాలించుచున్నబలదేవమూర్తియైనయనంతునినీలాంబరోజ్జ్వలం బైన సుందరగాత్రంబునఁ బీతాంబరమరీచు లెసఁగఁ బీనాయతచతుర్భుజసముల్లాసంబు వెలయఁ బుండరీకాయతలోచనద్యుతు లలర సుందరభ్రూకర్ణనాసికారుణాధరప్రసన్నవదనంబున స్మేరవిలోకనమాలికలు నిగుడఁ గౌస్తుభవనమాలోజ్జ్వల వక్షస్స్థలంబున శ్రీదేవి మెఱయ వళిత్రయవిరాజితం బైనయశ్వత్థదళాకారోదరంబు దనరఁ గంబుకంఠంబు నిమ్ననాభివివరంబు బృహత్కటితనుశ్రోణికరభోరుజానుజంఘాద్వయంబులును జెలంగ నుత్తుంగ గుల్ఫంబు లరుణనఖంబులు మృదులాంగుళ్యంగుష్ఠంబులు నెసంగ నొప్పుపాదారవిందద్వయంబును సొంపార మణికటకకటిసూత్ర కిరీటకేయూరాది భూషణకిరణంబులు నెఱయ శంఖచక్రగదాపద్మంబులు కరముల నుల్లసిల్ల సునందనందాదు లైనపార్షదులయు సనకాదియోగులయు బ్రహ్మేశగీర్వాణులయుం మరీచ్యాది ప్రజాపతులయుఁ బ్రహ్లాదనారదాది భాగవతప్రవరులయు

వివిధవిమలవినుతుల నాకర్ణించుచు శ్రీపుష్టివాక్కీర్తి కాంతితుష్టీలోర్జా విద్యావిద్యాశక్తిమాయాదులు పరివేష్టించి కొలువఁ గొలువైయున్న భగవంతుని గనుంగొని పరమభక్తిభరంబున రోమాంచకంచుకితగాత్రుండై బాష్పసంభృతనేత్రుండై యయ్యక్రూరుండు ధైర్యముఁగొని కృష్ణుఁడే భగవంతుఁడని తెలిసి సాష్టాంగప్రణామం బొనర్చి నిటలతటంబున నంజలిపుటంబు ఘటియించి మెల్లమెల్లన గద్గదస్వరంబుతో నిట్లని ప్రస్తుతించె.

అక్రూరుఁడు భగవంతుని స్తుతించుట.

ఎవ్వనినాభిలోనం బుట్టినబ్రహ్మవలన నీలోకంబు గలిగె నయ్యఖిలకారణకారణాత్ముఁడైననారాయణున కాదిపురుషున కాద్యున కవ్యయునకేను మ్రొక్కెద. దేవా! పంచభూతంబు లహంకారము మహత్తత్త్వము ప్రకృతి పురుషుఁడు మనస్సింద్రియంబులు సర్వేంద్రియార్థంబులు సురలు ననంగ గలుగుజగత్కారణంబులెల్ల నీయంగమునం బుట్టె. అయ్యవియెల్లననాత్మభూతము లవుటంజేసి నీస్వరూపం బెఱుఁగఁజాలవు. జీవుఁ డాత్ముఁడయ్యు మాయాగుణబంధనిమిత్తమున నెఱుంగఁ జాలకుండెడు. కొందఱు సాధుయోగు లధ్యాత్మాధిభూతాధిదైవసాక్షియై యంతర్యామిమహాపురుషుఁగా నిన్నుఁ గొల్తురు. కర్మయోగు లైనకొంద ఱైంద్రాదినానాదేవతారూపముల నిన్నే త్రయీవిద్యచే నానాయజ్ఞముల నారాధింతురు. జ్ఞానులైనకొందఱు సర్వకర్మములు నీయందు సన్న్యసించి యుపశమంబుఁ గొని జ్ఞానస్వరూపుఁడైననిన్ను జ్ఞానయజ్ఞమున ధ్యానింతురు. శైవవైష్ణవదీక్షలం బొందినకొందఱు తదాగమోక్తప్రకారబహుభేదముల నానామూర్తి నేకమూర్తినిగా నిన్ను పాసింతురు. అందఱును దత్తద్దేవతానామభేదమున భిన్నమతులై నానాదేవతాభక్తులైనకొందఱు సర్వదేవతామయుం డైననిన్నే పూజింతురు. వర్షము గురియ జలపూర్ణంబులై పాఱునానాగిరినదు లయ్యైమార్గములఁ దుదిసముద్రమునే చేరుచందమున భిన్న భిన్నప్రకారంబు లైనపూజ లన్నియుఁ దుదినిన్నే చెందెడు. సత్త్వము రజస్సు తమ స్సనునివి మూడును బ్రకృతిగుణ

ములు. బ్రహ్మాదిస్థావరాంతంబు లైనభూతంబు లన్నియు నందు బ్రోతంబులు. అయ్యాది నీయం దుండెడు. అవిద్యాకృతం బైనయీసంసారము దేవమనుష్య తిర్యగ్దేహాభిమానులందుఁ బ్రవర్తించెడు. వానిందవులక సర్వసాక్షియైసర్వాత్ముండై వెలయునీకుఁ బ్రణామంబు. దేవా! నీ కగ్ని ముఖము భూమి పాదము సూర్యుఁడు నేత్రము నభంబునాభి దిక్కులు శ్రవణంబులు దివంబు మూర్ధంబు సురలు భుజములు సముద్రములు కుక్షి వాయువు ప్రాణబలంబులు వృక్షౌషధులు రోమంబులు మేఘములు కేశములు పర్వతము లస్థినఖము లహోరాత్రములు ఱెప్పపాటులుఁ బ్రజాపతి మేఢ్రంబు వర్షము వీర్యము నగు. అవ్యయాత్మా! పరిపూర్ణుఁడు మనోవృత్తివ్యంగ్యుఁడు నగునీలోపల బహుజీవసంకులంబు లైనలోకంబులెల్ల జలాంతరమున సూక్ష్మప్రాణ్యండరాసులును మేడిపండులోపల సూక్ష్మ మశకంబులు నెట్టు లట్టులు చరించుచుండెడు. నీవు క్రీడార్థం బేయేరూపముల ధరింతు వయ్యేరూపముల నిరస్తశోకులై జనులు నీకీర్తిం గీర్తింతురు. కారణమత్స్యరూపమునఁ బ్రళయార్ణవంబున విహరించియు హయగ్రీవుఁడై మధుకైటభుల వధించియుఁ గూర్మంబై మందరము వహించియు వరాహంబై భూమి నుద్ధరించియు నరసింహమూర్తివై హిరణ్యకశిపుని బరిమార్చి సాధువులకు భయంబు వాపియు వామనుఁడై పాదక్రమమున ముల్లోకము లాక్రమించియు భార్గవరాముఁడై దుష్టక్షత్రియులఁ దెగటార్చియు రఘురాముఁడై రావణుంజంపియు వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధరూపముల యదుకులమునందు దుష్టశిక్షణశిష్టరక్షణార్థ మవతరించియు బుద్ధరూపమున దైత్యదానవాంశజులకు మోహముఁ గావింపను గల్కిరూపమున మ్లేచ్ఛప్రాయులగురాజులఁ దెగఁజూడను దలంపు గొనియు వెలయునీకు మ్రొక్కెద. నీమాయ కీలోకమెల్ల మోహమొంది యేను నాయది యనునభిమానమునం గుంది కర్మమార్గములఁ బరిభ్రమించుచుండెడు. ఏనును దేహపుత్త్రకళత్రబంధువిత్తగృహాదు లగుస్వప్నతుల్య పదార్థంబులు సత్యములని తలంచి మూఢుఁడనై యందే భ్రమించుచున్నవాఁ

డను. అనిత్యము లగు దేహాదులయెడ నాత్మబుద్ధిం జేసి వ్యత్యస్తమతినై ద్వంద్వములం దవిలి తమంబునం బడి యాత్మప్రియుం డైననిన్నుఁ దెలియ నయ్యెద. తృణచ్ఛన్నంబైన జల మరసి కనుంగొన నేరక యెండమావులకుఁ బఱచుజలార్థి తెఱంగున మాయాశబలితుం డైననిన్ను విచారించి తెలిసికొననేరని పరాఙ్ముఖుండనై సంసారమునం ద్రిమ్మరుచుండెద. కామకర్మహతంబై విషయసంబద్ధంబు లైనయింద్రియముల నిటునటు నీడువంబడుమనస్సును కృపణమతి నైనయేను నిరోధింపఁ జాలనయ్యెద. అట్టినే నిప్పుడు నీపాదమూల మాశ్రయించితి. ఈశ్వరా! యియ్యదియు నీయనుగ్రహంబ కాని యొండు కాదు. పురుషునకు సంసారమోక్షము గలుగఁ గాలము గూడినప్పుడే సాధుసేవామూలమున నీపాదపద్మములపై బుద్ధిఁ బ్రవర్తించెడు. జ్ఞానస్వరూపుఁడు సర్వజ్ఞానకారణాత్ముఁడు పురుషులకు సుఖదుఃఖము లొదవించు కాలాదులకు నియామకుఁడు పరిపూర్ణుఁడు మాయాశక్తియుక్తుఁడు చిత్తాధిష్ఠాతృవాసుదేవస్వరూపుఁ డహంకారాధిష్ఠాతృసంకర్షణాత్ముఁడు బుద్ధ్యధిష్ఠాతృప్రద్యుమ్నరూపుఁడు మనోధిష్ఠాత్రనిరుద్ధస్వరూపుఁడు నగునీకు నమస్కారము. శరణాగతుఁ డైననన్ను రక్షింపు మని యక్రూరుండు ప్రస్తుతించి ప్రార్థించుచుండునంత నటుఁడు నాట్యముఁ జూపినట్టులు భగవంతుఁ డాశ్వఫల్కతనయున కాజలంబునఁ జూపినరూప ముపసంహరించె.

భగవంతుఁ డంతర్హితుం డగుటయు నక్రూరుం డమ్మడువు వెడలి మధ్యాహ్నక్రియలు నిర్వర్తించి విస్మయమానమానసంబుతో రయంబున నేతెంచి తేరెక్కుటయు హరి యయ్యా! భూమినిఁగాని యాకాశమునఁగాని జలమునఁగాని నీ వెయ్యదేనియుఁ జిత్రంబుఁ గనుంగొంటివే? నీరూపంబాచందమునఁ గనుపట్టుచున్న దనియడుగ నక్రూరుండు దేవా! భూమ్యంతరిక్షసలిలంబులలో నెల్లఁ గలుగుచిత్రంబుల కన్నిటికి నాశ్రయంబై పరిపూర్ణుఁ డైననిన్నుఁ గనునా కొండొకచిత్రంబు దోఁపదనిచెప్పి రయమునం దేరుదోలి మార్గమున నచ్చటచ్చట గ్రామవాసులు రామకృష్ణులం బ్రీతిబంధు

రంబునకుఁ గనుంగొనుచుండఁ బ్రొద్దుపడమరకు వ్రాలినపదంపడి మధురోపాం తమునకుఁ జనియె. అంతకు నందప్రముఖులైన గోపాలురు మున్ దరిగి మధురానగరిబహిరుద్యానంబులందు రామకృష్ణులరాక వేచియుండిరి. అట్టియెడ భగవంతుఁడు వినయావనతుం డైన యక్రూరునికరంబుఁ దనపాణితలంబున గ్రహించి నవ్వుచు నయ్యా! నీవు మున్ దరుగుము. ఏ మీదిన మిచట విడిసి రేపు నగరి కరుదెంతు మనిన నగ్గాంధినీసుతుండు దేవకీసుతున కిట్లనియె. భక్తవత్సలా! ఏను మిమ్ము విడిచి మధురాపురంబుఁ జొర నొల్లను. నీకు భక్తుఁడైననన్ను విడువఁదగదు. నీవు నన్నును సకలగోపాలురను జెలులనుం దోడుకొని మదీయగృహమునకు విచ్చేసి మమ్ము నాథవంతులఁ గావింపుము. నీపాదపరాగమున గృహస్థులైనమాగృహములకుఁ బవిత్రత్వం బాపాదింపుము. భవత్పాదశౌచతీర్థమునఁ బితరు లగ్ను లమరులునుం దనియుదురు. నీపాదయుగళముం గడిగి బలి పుణ్యకీర్తి నుల్లసిల్లి యింద్రపదంబును బరమభక్తగతినిం గాంచె. నీపాదశౌచసలిలంబులే గంగానదియై పాఱుటయుం శర్వుండు శిరంబున ధరించె. అమ్మహనీయతోయంబులే కదా సగరసుతులకు స్వర్గతిం గలిగించె దేవదేవ! జగన్నాథ! పుణ్యశ్రవణకీర్తన! యదూత్తమ! యుత్తమశ్లోక! నారాయణ! నీకుఁ బ్రణామం బని వేఁడికొనియె. అవ్వేఁడికో లాకర్ణించి కృష్ణుం డయ్యా! యేను యాదవద్రోహి యగుకంసుం బరిమార్చి సుహృదులకుఁ బ్రియము సమకూర్చి యార్యసమన్వితుండనై మీగృహంబునకుఁ జనుదెంతుఁగాని యిప్పుడు పీడుకొను మనిచెప్పుటయు నక్రూరుండు మాఱుపలుక నేరక యెల్లసివానిరీతి నూరకుండి యట నమ్మధుసూదను వీడ్కొని మధురాపురంబు సొచ్చి తనపనియెల్లఁ గంసునకు నివేదించి నిజగృహంబునకుఁ జనియె.

రామకృష్ణులు మధురాపురముఁ బ్రవేశించుట.

అంత నపరాహ్ణము గడవం జల్లప్రొద్దున రామకృష్ణులు మధురానగరంబు చూడ నెంచి గోపాలపరివృతులై స్ఫటికగోపురద్వారముల నొప్పు

దానిఁ గనకకవాటతోరణంబుల నలరుదానిఁ దామ్రారకూటమయధాన్యాద్యగారముల వెలయుదాని నగాధపరిఖాపరివృతం బైనదాని రమ్యోపవనోద్యానముల శోభిల్లుదానిఁ గాంచనచతుష్పథంబులను మేడలను గృహారామములను నొక్కొకతెగవారిసభలను నితరగృహములను విలసిల్లుదాని వజ్రవైదూర్యనీలవిద్రుమమౌక్తికమయంబు లైనకోణిగలను వేదికలను తోరణగండ్లసందులను గుట్టిమంబులనుం గూర్చున్నకపోతమయూరముల మంజురావముల నమరుదాని సలిలసంసిక్తంబు లైనరాజవీథులందు నాపణవీథులందును మార్గములందును జత్వరములందును నిండారఁ జల్లిననవమాల్యాంకురలాజాక్షతతండులంబుల నింపారుదాని దధిచందనసిక్తంబు లైనపూర్ణకుంభములను బల్లవప్రసూనఫలవృంతముల నొప్పురంభాక్రముకతరువులను గేతనంబులను జెలంగు ద్వారదేశములఁ బ్రకాశించుదాని నమ్మధురానగరిం జొచ్చుటయు నారామకృష్ణులం గాంచ వేడుక వొడమి పౌరచారుముఖులు సంభ్రమంబున మేడ లెక్కిరి. తమ వచ్చునంతకు రామకృష్ణులు మిగిలి యరుగుదురో యను తత్తఱంబున నత్తెఱవలు తబ్బిబ్బులు గాఁగఁ గట్టియుఁ దొడిగియుం జతలుజతలుగఁ జైసేయం దగినకటకకుండలాదుల నొక్కొక్కదానినే ధరించియు నొండొక్కదానిం దాల్పమఱచువారై యొక్కకంటికే కాటుక వెట్టి రెండవదానికిఁ బెట్టనివారై చేయుచుండినభోజన ముడుగువారై తలయంటికొని జలక మార్పనివారై నిద్రించుచుండి చక్క సవరించికొననివారై పాలు గుడుచుచున్న బాలురఁ దిగనిడుచువారై వడింబాఱుతెంచుటయు నరవిందలోచనుండు విలాసప్రౌఢస్మేరాపాంగవీక్షణంబుల వారిచిత్తంబు లాకర్షించుచు గజేంద్రగమనంబున నన్నతోడ నన్నగరవీథులం జనియె. నయనానందసంధాయకుం డైన యాలీలాగోపాలునిం గాంచి పౌరకామిను లమ్మహాత్ముచిమందహాసామృతంబుఁ జిలుకులలితవిలోకనంబులకుఁ జొక్కి యయ్యానందమూర్తి నాత్మమానసములఁ గౌఁగిలించికొని పులకలు మేనం గ్రమ్ముదేరఁ బరమానందము నొంది మనోవ్యథలు వాసి ప్రేమాతిశయంబున నెమ్మొగమ్ము లుల్లసిల్ల నారామకృష్ణుల

వయిం గుసుమవర్షంబుఁ గురిసిరి. ద్విజులు ప్రముదితులై దధ్యక్షతచందన మాలికాపూర్ణకుంభము లుపాయనంబులుగా నర్పించి యయ్యన్నదమ్ముల నర్చించిరి. నరలోకమహోత్సవాకారు లైనయీసుకుమారులఁ బ్రతిదినంబు గనుంగొన గోపికలు దొల్లి యెంతతపంబు సేసిరో యని పౌరులెల్ల విస్మితులై ప్రశంసించిరి.

శ్రీకృష్ణుఁడు రజకుని వధించి వస్త్రముల గ్రహించుట.

అవ్విధంబున మధువైరి మధురానగరంబున నన్నతోడ నరుగుచు రంగరి యైనరజకుం గాంచి యోచాకలీ! మాకిరువురకుం గట్టఁగ మేలి నిర్మల వస్త్రము లిమ్ము. దీన నీకు నిస్సంశయముగ మే లగు నని యడిగిన నాచాకలి కంసుపరిచారకుండు గావున దుర్మదుండై రోషమున నధిక్షేపించుచు యదు వీరుల కిట్లనియె. బాలిశులారా! యడవులను గొండలను నుండువా రద్వృత్తులై నిత్య మిట్టివస్త్రములం గట్టిరే? రాజద్రవ్యముల నేల కోరుదురు? తొలఁగి చనుఁడు. బ్రదుకఁ గోర్కి గలదేని యిఁక నిట్టికోర్కులు గోర వలదు. రాజభటులు సూచిన నిట్టివారిం గట్టియుఁ గొట్టియు సొమ్ము హరింతు రని పెక్కులు ప్రేలుటయు నలిగి దేవకీసూనుండు వానితలఁ బదాగ్రమునఁ దన్ని క్రిందఁ ద్రోచె. అంత నారజకునియనుచరులు దమతమచలువలమూటలటఁ బాఱవైచి యెల్లెడలం బఱచిరి. రామకృష్ణు లావస్త్రరాసులలోఁ దమకుఁ గూర్చుమేలియంబరంబులం గొని కట్టి కొన్నింటిని దమతోడిగోపాలుర కొసంగి మిగిలినవాని నట విసర్జించి యరిగిరి.

శ్రీకృష్ణుఁడు తంతువాయమాలాకారుల సమ్మానించుట.

అట్లరుగుచు వారు ముందర నొకతంతువాయుం గాంచిన నాతండు వారికి విచిత్రవస్త్రము లొసంగి యలంకారంబు సేసినం గృష్ణుఁడును రాముఁడును బర్వమున నలంకృతగాత్రంబు లైనకరికలభములకరణిం జూడనొప్పిరి. వానికిఁ బ్రసన్నుఁడై పన్నగశయనుం డాత్మసారూప్యమును శ్రీవిభవంబును

బలైశ్వర్యస్మృతీంద్రియపాటవంబులనుం బ్రసాదించె. అట నయ్యన్న దమ్ములు సుదాముఁ డనుమాలకరియింటికిఁ జనుటయు నమ్మాలాకారుండు వారిం గాంచి తటాలున లేచి చాఁగిలం బడి మ్రొక్కి యుత్తమాసనంబునఁ గూర్చుండఁ జెప్పి పాద్యము నర్ఘ్యము నొసంగి సకలపరికరంబులం బూజించి మేలిపూఁతలఁ బూసి విరిదండలఁ గైసేసి తాంబూల మర్పించి యారామ కృష్ణులను వారివెంట నేతెంచిన గోపాలురనుం బ్రీతిమై నర్చించి యయ్యదు పుంగవుల కిట్లనియె. ఈశ్వరులారా! మీరలు మాయింటికి విచ్చేయుటంజేసి నాజన్మము సార్థకంబయ్యె. కులము పాలితంబయ్యె. నాపితరులు దేవతలు ఋషులును దృప్తినొందిరి. జగత్కారణాత్ములైనమీర లీవిశ్వముభవమున కును క్షేమమునకు నీరూపముల నిందవతరించినవారలు. సర్వభూతములకు సములు సుహృదులునై భజించువారల భజించుచుమీ కెందును వైషమ్యంబు గలుగదు. భృత్యుఁడైననన్నుఁ దగినపని సేయం బంపుఁడు. మీకు నియోజ్యుఁ డగుటను టింతయే పురుషునకుఁ బరమానుగ్రహం బని విన్నవించి సుదా ముఁడు రామకృష్ణు లుత్తమమాల్యములఁ గోరుదు రని వారియభిప్రాయంబుఁ దాన యరసి క్రొత్తనెత్తావుల నలుగడలఁ బిసాళించునవమృదులకు సుమవిసర ములఁ గూర్చినకోమలమాలిక లర్పించి నేర్పునం గైసేసె. అయ్యలంకారంబు నకును వానిభక్తిభావంబునకును గడు మెచ్చి యచ్యుతుండు ప్రణతుండైన యమ్మాలకరిం బిలిచి వరములు గోరికొ మ్మనిచెప్పిన నాతం డాసర్వాత్మునిపై నచంచలం బైనభక్తిని భాగవతులతోడి చెలిమిని సర్వభూతదయను వరంబు లుగా నడిగినం గరుణించి హరి యాసుదామున కవ్వరములం బ్రసాదించి వంశవృద్ధిమంతం బైనశ్రీయు బలము నాయువును యశమును గాంతియుం నొసంగి యన్నతోడ నన్నగరసౌభాగ్యముఁ గనుంగొన నరిగె.

శ్రీకృష్ణుఁడు కుబ్జదాసికి సౌందర్య మొసఁగుట.

అట్లరిగి మాధవుం డారాజమార్గంబున మైపూఁతలు నించిన పాత్రలం గొని పోవుచున్న యొకకుబ్జను గాంచి నవ్వుచు నోసుందరాంగీ! నీవెవ్వతె

వీయనులేపనం బెవ్వరియది? మాయిరువురకును మేల్మిమైపూఁత లిమ్ము నీకు వేగంబ మే లయ్యెడు ననిన నది యిట్లనియె. సుందరాంగా! యేను దాసిని. నా పేరు త్రివక్ర యనంబడు. రాజునకుఁ గలపంబులు మున్నగువానిం గూర్చి నగళుల నమర్చుట నాపని. నా కూర్చుకలపంబులు కంసునిమదికి మీఁదు మిక్కిలి గూర్చు. మీయట్టివారికిఁ దక్క నిం కెవ్వరికి వీని నే నిత్తు నని పలుకుచు నాకుబ్జ కృష్ణునిరూపలావణ్యసౌందర్యమాధుర్యస్మేరాలాపవీక్షణం బులకు మోహించి రామకృష్ణులకు వలసినంతయనులేపనం బొసంగె. తమ సితాసితద్యుతులకు వ్యతిరేకంబు గావించునయ్యభినవాలేపనంబులు పూసి రామకృష్ణులు శోభాతిశయంబున వెలింగిరి. దానియెడం గరుణించి హరి తన దర్శనమునకు ఫలముగలుగ దానివక్రతం బాపఁ దలంపు గొని దాని ముంగాళులు దనపాదములం ద్రొక్కి రెండువ్రేళు లెత్తుగా గడ్డము క్రిందఁ జేయి వెట్టి మేను లేప నెత్తుటయుఁ గటిపక్షగకంఠముల మూఁడింట వక్రతం గాంచి త్రివక్ర యానం బరఁగి విరూప యైనయాదాసి వాసుదేవుఁ డెత్తి నవరించిన కతంబున నాకౌటిల్యముం బాసి ఋజుత్వంబు నొంది బృహన్ని తంబ పయోధరాదిసౌష్ఠవంబునం బెంపారిన సౌందర్యమున నుల్లసిల్లి యటఁ జనుచున్న యన్నలినాక్షును త్తరీయంబు పట్టి పురుషోత్తమా! మాయింటికి విచ్చేయుము. నిన్నువిడువ నొల్లను. నిన్నుఁ గాంచి నీపై మనస్సు దవిలిన న న్ననుగ్రహింపు మని విన్నవించె. అవ్విధమున నయ్యది వేఁడుకొనినం గృష్ణుండు చూచుచున్న యనుచరులను బలదేవునిం గాంచి నవ్వుచు నోజవ్వనీ! వచ్చిన పనిదీర్చి యటఁ బురుషులకు మనోవ్యాధు లుడుపునీయింటికివచ్చెద. గృహ రహితు లైనపాంథులకు నీవు పరమాశ్రయంబ విపుడు పొమ్మని మంచిమాటల నాదాసిని వీడుకొలిపి వణిజు లర్పించుతాంబూలంబులను జందనంబులను మాల్యంబులను బలువిధంబు లైనకానుకలనుం గ్రహించుచుఁ గృష్ణుఁడన్నయుఁ దాను విపణింజనుచుండఁ దదవలోకనమున మదనుఁ డుదయింపఁ దద్వ

కారము నంజేసి పౌరకాంతలు చీరలు జాఱుటయుఁ గొప్పుముడి వీడుటయుఁ బువ్వులు రాలుటయుఁ దెలియంగనిపరాకునఁ జిత్రప్రతిమలట్టు లైరి.

కృష్ణుఁడు కంసునిధనుశ్శాలలోని విల్లు విఱుచుట.

అట్లరిగి కృష్ణుండు పౌరుల నడిగి కంసునిధనుర్యాగస్థానంబుఁ దెలిసికొని యచ్చోటికిఁ జని యాశాలలోనికిం జొచ్చి యందు బహుపురుషరక్షితంబై యత్యంతపూజితంబై యింద్రచాపంబుభంగి నద్భుతంబై యున్న యొక్క యుద్దండకోదండముం గాంచి కావలివారు వలదువలదని వారించినను నిరాకరించి తాఁగేల నావిల్లు గొని యెక్కువెట్టి చెఱకుగడ విఱుచుమదపుటేనుంగుభంగి నందఱు చూడ నాకార్ముకంబు నడిమికి విఱిచె. అవి విఱుఁగు నెడం బుడమియు నాకసంబు నిండఁ బొడమినయులివునకుఁ గంసుం డదరిపడియె. కావలివార లావిల్లు విఱుచుట కలిగి కైదువులంగొని పరివారంబుతోడం దలపడి కృష్ణుం బట్టికొనువారై పట్టుఁడు కట్టుఁ డని యార్చుటయు రామకృష్ణు లావింటితునియలఁ గొని వారలఁ బిలుకుమార్చి కంసుఁడు పంచిన మూఁకలనుం దెగటార్చి యట నాశాల వెడలి నగరిసౌభాగ్యంబు చూచుచుం దిరుగుచుండిరి. వారి యద్భుతవిక్రమంబు నుత్సాహంబును బ్రగల్భత్వమునుం గాంచి పురజను లద్దిరా! వీరు మానవులు గారు దేవతోత్తము లని తలంచిరి. అట్టియెడ నాదిత్యుం డస్తగిరిశిఖరంబున కరుగుటయు రామకృష్ణులు దమ వెంట వచ్చినగోపాలకులతోడఁ బురంబువెలుపల బండ్లు విడిసినచోటికి నేతెంచిరి. కృష్ణుండు నందవ్రజంబు వెడలునెడ గోపికలు తద్విరహమునకు వగచుచు నేఁడు మధురాపురంబువారి భాగ్యము ఫలించుననుట మున్నుగా నాడిన మాటలు యథార్థములు గాఁగ శ్రీదేవి లాఁతులనెల్ల విడిచి సేవించిన హరిగాత్రసౌందర్యముం గాంచి మధురాపురవాసులకుఁ దదీయదర్శనంబు గన్నులపండు వయ్యె. అట్లు రామకృష్ణులు విడిదల కరిగి యందుఁ బాదప్రక్షాళనంబొనర్చి క్షీరాన్నంబు భుజియించి కంసునితలం పెఱిఁగి యారాత్రి సుఖముండిరి.

అక్కడఁ గంసుండు ధనుర్భంగము కావలివారిం బరిమార్చుట తన పంచిన సేనలఁ జంపుట మున్నగు రామకృష్ణులలీలలు విని యారేయి కన్నుఁ గవం గూరుకు వొరయక వనరుచు మేల్కనునపుడు నించుక నిద్రించునపుడు నాత్మమృతి సూచించు నుత్పాతంబులు పెక్కులు గనియె. మేల్కనియున్నపుడు వానికిఁ దనశిరంబు దర్పణాదులందుఁ బ్రతిఫలించి యున్నను గాన్పింపఁ బడదయ్యె. ద్వితీయరూపంబు లేకున్నను జంద్రాది తేజస్సులు ద్విరూపంబులై తోఁచె. తనప్రతిబింబంబున రంధ్రములు చూపట్టె. కర్ణపుటంబులు గప్పిన విన నగు ప్రాణఘోషంబు వినంబడకుండె. వృక్షములు స్వర్ణవర్ణంబులుగాఁ గనుపట్టె. తనయడుగులు కనుపట్టకుండె. నిద్రించునెడఁ బ్రేతాలింగనము గర్దభారోహణము బిసభక్షణము నలదమాలికాధారణము తైలాభ్యంగము వస్త్రహీనత్వము మున్నగునవి తోఁచె. అట్లు స్వప్నజాగరదశలందును వివిధోత్పాతములం గాంచి కంసుండు మరణభీతుఁడై నిద్దుర గానక కుందుచుండె.

కంసుఁడు మల్లయుద్ధరంగస్థానమునకు వచ్చుట.

అంతఁ దెలతెల వేగుటయు సూర్యోదయానంతరమునం గంసుని పంపున మల్లక్రీడామహోత్సవంబు నెఱవేర్ప నాధికారికులు దొడరి యయ్యై వారి నయ్యైపనులం బంచుటయు రంగస్థానంబున బహువిధాలంకారంబు లొప్పారె. భేరీప్రముఖవాదిత్రంబులు మ్రోసె. పతాకావస్త్రమాల్యతోరణపరిష్కృతంబులై మంచస్థానంబులు వెలసె. బ్రాహ్మణులు క్షత్త్రియులు మున్నగాఁ బౌరజానపదులెల్లఁ దమతమ కని నియమించిన మంచె లెక్కిరి. రాజులేతెంచి తన్మంచంబు లారోహించిరి. కంసుండు మంత్రిపరివృతుండై మండలేశ్వరమధ్యస్థుండై రాజమంచ మధిరోహించి యంతర్హృదయమున వగలం బొగులుచుండె. తూర్యనాదం బెసంగ మల్లతాళధ్వనులు సెలంగఁ జాణూరముష్టికకూటశలతోసలాదులైన మల్లవీరులు సమ్యగలంకృతాంగులై యుపాధ్యాయులతోడ నారంగస్థానంబునకుఁ జనుదెంచిరి. ఆభోజరాజు నాహ్వానము

బడసి నందగోపప్రముఖు లైనగోపాలకులు దమతెచ్చిన కానుక లారాజు నకుఁ జెల్లించి యొక మంచెపయిం గూర్చుండిరి.

కృష్ణుఁడు రంగద్వారమునఁ గువలయాపీడగజముం జంపుట.

భేరీనిర్ఘోషమును మల్లధ్వనులను విని రామకృష్ణులు కృతశౌచులై యా మల్లయుద్ధరంగస్థానంబునొద్దకుఁ జనుదెంచిరి. ద్వారమున మావటీఁడు పురికొలుప నడరుచున్న కువలయాపీడం బనుమత్తశుండాలముం గాంచి హరి నడికట్టు గట్టి మొగంబుపై వ్రాలినకుటిలకుంతలంబుల సవరించి హస్తిపకుని దెసం జూడ్కి నిగుడించి యోరీ! యాధోరణా! వారణముం దొలఁగించి మాకు మార్గ మొసఁగుము. ఒసంగవేని యేనుంగుతోడ నిన్ను యమపురికిఁ బంపుదు ననిపలికినం గినిసి మావంతుఁ డంతకాకారం బైన యమ్మదవారణంబును శౌరిపైఁ బురికొలుపుటయు నయ్యది రయమున నడరి తొండమునం బుండరీకాక్షుం బట్టికొనియె. దానిపట్టు దప్పించుకొని కృష్ణుండు దానిం దన్ని యగపడకుండ దానికాళులక్రింద నణఁగి డాఁగె. అందుల కలిగి యయ్యేనుం గిటునటుం జూచుచుఁ గృష్ణుని యున్నచో టరయనేరక వాసనఁబట్టి శుండాదండమునం బట్టఁబోయినం గోపాలబాలుండు బలాత్కారమున నట వెనుకకు నడచి పన్నగంబును గరుడుం డెట్టు లట్టు లయ్యేనుఁగు తోఁకఁ బట్టి యిరువదేనువిండ్ల కొలందికి లాఁగి యయ్యది డాఁపలించినం గేశవుండు వలపలించియు నయ్యది వలపలించినం దాను డాఁపలించియుఁ గ్రేపుతోడ నాడు గోపబాలునిలీల నొప్పుచు నవ్వేదండంబు నాడించుచుఁ దొలంగి యటఁ జక్కసరిగాఁ బాఱుతెంచి కరతలంబున నాగంధద్విపంబు నడిచె. అడిచిన నయ్యేనుంగు రోషమునం గాలఁ దాఁచుటయు నాతాఁకు దప్పించికొన వనజాక్షుండు నేలకు వ్రాలె. అది కృష్ణుని పాటుగాఁ గొని యాకరివరంబు క్రోధోద్ధతిం గొమ్ములం గ్రుచ్చునంతలోఁ శ్రీకాంతుండు దొలంగినం దానికొమ్ములుఁ నేలం గ్రుచ్చికొనియె. అట్లు దనవిక్రమంబు ప్రతిహతం బైనం గనలి యాకుంజరంబు మావంతులు పురికొలుపఁ బేర్చి

దామోదరుం డాఁకటయు నమ్మహామహుండు దనకరంబున దానిశుండాదండముం బట్టి నేలం బడఁ ద్రోచి పై కుఱికి సింహవిక్రమంబున మెఱయుచుఁ దదీయదంతముం బెఱికి దాన నావంతాపళంబు నడిచి మావంతులం గూల్చి యయ్యేనుఁగుపీనుఁగును విడిచి నేలకు లంఘించి తద్గజదంతముఁ గేలం బూని నిలిచె.

రామకృష్ణులు మల్లరంగముఁ బ్రవేశించుట.

అవ్విధంబున మధుసూదనుండు కువలయాపీడనామకం బైనమత్త మాతంగముం జంపి దానిదంతము మూఁపుపై నమర్చి తదీయమదరుధిరబిందు సందోహసంకలితగాత్రుండై చెమర్చినమోముదమ్మితో నుల్లసిల్లి యన్నయుఁ దానును గోపాలురగొందఱు వెంట జెరసి యరుదేర మల్లవీరులకుఁ బిడుగై పురుషులకుఁ బురుషోత్తముఁడై సుందరులకుఁ గందర్పుఁడై గోపాలురకు బాంధవుఁడై యసద్రాజులకు శాసకుఁడై దల్లిదండ్రులకు బిడ్డయై కంసునకు మృత్యువై యవిద్వాంసుల కపర్యాప్తుఁడై యోగులకుఁ బరతత్త్వంబై యాదవులకుఁ బరదేవతయై తోఁప నారంగస్థానంబుఁ జొచ్చె. కువలయాపీడముం జంపుట వినియు నారామకృష్ణులమూర్తిశోభావికాసంబుఁ గాంచియుఁ గంసుఁడు ధీరుఁడయ్యు నుద్వేగంబు నొందె. విచిత్రవేషభూషణమాల్యాంబరంబులఁ గైసేసికొని రంగముఁ జొచ్చినయమ్మహాభుజు లిద్దఱుత్తమవేషముల ధరించిననటులరీతిం జూడ నొప్పి చూపఱ డెందముల నాకర్షించుచున్నంత మంచాంతర్గతు లైననాగరజానపదరాజు లందఱు ప్రహర్షోత్కర్షభరితలోచనంబుల వారిం గ్రోలునట్టులును జిహ్వను లేహనంబు సేయునట్టులును నాసికంబుల మూర్కొనునట్టులును బాహువులఁ గౌఁగిలించుకొనునట్టులునుం జుబ్బనచూఱగాఁ జూచి యేప్రొద్దునకుం దనియక తదీయరూపగుణమాధుర్య ప్రాగల్భ్యములు దమ్ముఁ దలఁపించి నట్లుపోలె విన్నదానికిఁ దక్కువగానివారి రూపమహిమంబులకు విస్మితులై తమలో నిట్లనిరి. బలేవీర లిరువురును సాక్షాన్నారాయణుని యంశమున వసుదేవునింట నవతరించినవారలు. ఈకృష్ణుండు.

దామోదరుం డాఁకటయు నమ్మహామహుండు దనకరంబున దానిశుండాదండముం బట్టి నేలం బడఁ ద్రోచి పై కుఱికి సింహవిక్రమంబున మెఱయుచుఁ దదీయదంతముం బెఱికి దాన నాదంతావళంబు నడిచి మావంతులం గూల్చి యయ్యేనుఁగుపీనుఁగును విడిచి నేలకు లంఘించి తద్గజదంతముఁ గేలం బూని నిలిచె.

రామకృష్ణులు మల్లరంగముఁ బ్రవేశించుట.

అవ్విధంబున మధుసూదనుండు కువలయాపీడనామకం బైనమత్తమాతంగముం జంపి దానిదంతము మూఁపుపై నమర్చి తదీయమదరుధిరబిందుసందోహసంకలితగాత్రుండై చెమర్చినమోముదమ్మితో నుల్లసిల్లి యన్నయుఁ దానును గోపాలురు గొందఱు వెంట బెరసి యరుదేర మల్లవీరులకుఁ బిడుగై పురుషులకుఁ బురుషోత్తముఁడై సుందరులకుఁ గందర్పుఁడై గోపాలురకు బాంధవుఁడై యసద్రాజులకు శాసకుఁడై దల్లిదండ్రులకు బిడ్డయై కంసునకు మృత్యువై యవిద్వాంసుల కపర్యాప్తుఁడై యోగులకుఁ బరతత్త్వంబై యాదవులకుఁ బరదేవతయై తోఁప నారంగస్థానంబుఁ జొచ్చె. కువలయాపీడముం జంపుట వినియు నారామకృష్ణులమూర్తిశోభావికాసంబుఁ గాంచియుఁ గంసుఁడు ధీరుఁడయ్యు నుద్వేగంబు నొందె. విచిత్రవేషభూషణమాల్యాంబరంబులఁ గైసేసికొని రంగముఁ జొచ్చినయమ్మహాభుజు లిద్ద ఱుత్తమవేషముల ధరించిననటులరీతిం జూడ నొప్పి చూపఱడెందముల నాకర్షించుచున్నంత మంచాంతర్గతు లైననాగరజానపదరాజు లందఱు ప్రహర్షోత్కర్షభరితలోచనంబుల వారిం గ్రోలునట్లులును జిహ్వను లేహనంబు సేయునట్లులును నాసికంబుల మూర్కొనునట్లులును బాహువులఁ గౌఁగిలించుకొనునట్లులునుం జుబ్బనచూఱగాఁ జూచి యేప్రొద్దునకుం దనియక తదీయరూపగుణమాధుర్యప్రాగల్భ్యములు దమ్ముఁ దలఁపించి నట్లపోలె విన్నదానికిఁ దక్కువగానివారి రూపమహిమంబులకు విస్మితులై తమలో నిట్లనిరి. బలే వీర లిరువురును సాక్షాన్నారాయణుని యంశమున వసుదేవునింట నవతరించినవారలు. ఈకృష్ణుండు

ఎఱుగునేము నీభోజపతియేలుబడికి లోఁబడినవారము కావునఁ దత్ప్రియా చరణంబు మాకుం గర్తవ్యంబు. అయ్యదియే మాకుఁ బరమానుగ్రహంబు. ఐన నేము బాలురము గావున మాయీడువారితోడం బోట్లాడు టుచితంబు. బాహుయుద్ధమున మల్లసదస్యుల కధర్మంబు దొడరఁ జనదుకదా యనుటయుఁ జాణూరుఁ డయ్యా! నీవును బలుఁడును బాలురుగారు. కుంజరసహస్రబలవంతం బైనకువలయాపీడమును నీ వవలీలం గూల్చినప్పుడే నీ బాలత్వం బేర్పడియె. కావున మీరు బలియురతోడం బోట్లాడఁ జాలుదురు. ఇందేమియు నన్యాయంబు గనుపట్టదు. నీవు నాతోడఁ బెనంగుము. ముష్టికుండు బలుని తోడం బోటులాడువాఁ డని నిరూపించె. చాణూరవచనంబు విని కృష్ణుం డాత్మసంకల్పానుగుణంబుగా వాఁడు పలికెనని తనలోఁ దలంచి వల్లెయని చాణూరుని మాఱుకొనియె. రాముఁడు ముష్టికుని దలపడియె. అట్లు కృష్ణుఁడు మల్లవీరుం డైనచాణూరుని మార్కొనుటయు నయ్యిద్దఱు చేతులు సఱచియుఁ దొడ లప్పళించియుఁ బలుమాఱులు దొలంగియుఁ గదిసియుఁ గవిసియుఁ జేతులఁ జేతులను బాదములఁ బాదములను బరస్పరవిజిగీషామనీషం బెనంగియు నీడ్చియు మోఁచేతుల నొండొరుల మోఁచేతులను మోఁకాళ్ల నొకళ్లొకళ్ల మోఁకాళులను దల నితరేతరశిరంబును ఱొమ్మున నన్యోన్యవక్షంబును నడిచియుఁ బ్రెక్కణంబుఁ గలయం గ్రుమ్మరియు ముందరికి నెట్టియు భుజములం బట్టు పట్టియుఁ గ్రిందఁ ద్రోచియు ముందరికిఁ దోలఁగం బాఱియుఁ బిఱిందికి నడచియుఁ గ్రిందఁ బడునెడఁ గాళులు మోఁకాళులు ముడియ గట్టి నేలతో వ్రేసియు నట్టివానిం జేతులఁ బై కెత్తి యేసియు నేచి మెడఁ బట్టికొనినం దప్పించికొని త్రోచియు నేల నదిమి కాలుసేతులు సేర్చి ముడియ గట్టియు నొండొరులకు మీఱి యయ్యిద్దఱును దద్దయుం బోక పెనంగుచున్నంత బాలురకును బలవంతులకునుం బ్రవృత్తంబైనయా పోట్లాటం జూచి వేడుక సూడ వచ్చినవెలందు లందఱును గారుణ్యమే పారఁ దమలో నిట్లనిరి. కేవలబాలకులను బలియు రగుమల్లులతోడిపోట్లాటకుఁ

జొనిపి వేడుక సూచుచున్న యీరాజసదస్యుల యధర్మం బింత యగునే? వజ్రసారంబులై నడగొండలు వోలె నుండు దృఢగాత్రముల నొప్పునీజెట్టి మానుసు లెక్కడ? జవ్వనమురాని యతిసుకుమారులైనయీబాలకు లెక్కడ? నిక్కం బీసమాజమున ధర్మము విపరీతం బయ్యె. అధర్మం బెందుఁ బొడమునం దొక్కింతతడవైన నిలువం జనదు. సభికులదోషములు దెలియ వచ్చినం బ్రాజ్ఞున కాసభకుఁ బోవఁ దగదు. సభలోఁ గలిగినదానిం జెప్పకున్నను విపరీతముగఁ జెప్పినను నరుండు కిల్బిషంబుఁ గుడుచు. శత్రునియెదురఁ దిరుగుకృష్ణుని నెమ్మొగమ్ము గంటిరే జలబిందుపరీతం బైనసరోజంబుచాడ్పున స్వేదబిందుసందోహసాంద్రం బయ్యె. అయ్యదియె యరుణలోచనాభిరామం బైన బలదేవవక్త్రము దన్ను మార్కొన్నముష్టికునిపై నలుక యాదరహాససంరంభశోభనంబై యొప్పుచున్నది. శంకరాద్యర్చితపదుం డైన యీ పురాణపురుషుఁడు నరవేషప్రచ్ఛన్నుఁడై వనములఁ జిత్రమాల్యముఁ దాల్చి వేణుగానంబు సేయుచు గోవుల మేపుచుఁ జరించుటం జేసి బృందావన భూములు పరమపావనంబులయ్యె. లావణ్యసారంబై నిస్సమాధికంబై యనన్యసిద్ధంబై శ్రీనివాసంబై యితరదురాపంబైనయియ్యీశ్వరునిరూపముం బ్రతి సమయమునం గన్నులఁ గ్రోలఁగ గోపిక లేమితపంబు సలిపిరో. పాఁడిపితుకుట వడ్లు దంచుట మదనోద్దీపకంబులైనపూఁతలు గూర్చుట యుయ్యేల లూఁగుట యేడ్చుబాలురను బుజ్జగించుట తరుజలసేచనంబు సేయుట నీరు చల్లుట మున్నగుపనులు సేయుచుండియు వలపునం జిత్తము కృష్ణునిపైఁ జేర్చి కన్నుల నానందజలమ్ములు గ్రమ్ముదేరఁ దత్కీర్తింబాడుదురు. ప్రాతఃకాలమున వ్రేపల్లియనుండి గోగణంబులఁదోలుకొనిపోవునెడను సాయంకాలమున వనము నుండి గోకులంబునకు వచ్చునెడనుదదీయరమణీయవేణునాదంబువిని యాగోపకాంతలు రయంబున నిల్లు వెడలి పఱతెంచి స్మేరకరుణావిలోకనమున సొంపారు తద్వదనారవిందముఁ గనుంగొన నెంతపుణ్యముఁ జేసియుండిరో యని యవ్వనితలు దమలోఁ బలుకుచున్నంత యోగేశ్వరుం డైనహరి యరిం బోరి

మాల్పఁ జిత్తంబునఁ దలంచె. ఆన్నెలఁతలపలుకులు విని తల్లిదండ్రులు కొడు
కులబలిమి యెఱుఁగక పుత్త్రస్నేహమునం జేసి యడలిరి. అవ్విధంబునఁ జాణూ
రుఁడును గేశవుఁడును ముష్టికబలరాములును వివిధబాహుయుద్ధభేదంబు
లేర్పడ నీడంబోక పెనఁగుచున్నంతఁ బిడుగుపాటునకు సాటివచ్చునచ్యుతు
పోటునకు మేనెల్ల నలిఁగులియఁగుటయుఁ బెద్దయు నొచ్చియుఁ జాణూరుండు
పోటుమానిసి గావునఁ జలంబు నెఱయ బలంబు మెఱయఁ దొలంగి
వేగచాడ్పున మీఁది కెగసి యట వడిం బేర్చి వచ్చి రెండుచేతులం గూర్చి
యొక్కపిడికిలిగా నమర్చి దానవాంతకునురమ్ము బిట్టు గొట్టె. మదవేదం
డంబు పూదండ తాఁకు నెట్లట్లు తత్ప్రహారంబు సరకుగొనక చలింపక చలంబు
డింపక హరి యాజెట్టిబాహువులం బట్టి నిగ్రహించి పలుమాఱులు గిరగిరం
ద్రిప్పి నేలతో విసరివైచి క్రిందం బొరలించి నలఁగించిన నమ్మల్లుండు పెల్లుగఁ
దల్లడిల్లి విస్రస్తభూషణకేశమాల్యుండై విగతజీవితుండై యింద్రధ్వజంబు
చాడ్పునం గూలె. అట ముష్టికుం డేచి గాఢముష్టిప్రహారంబున బలదేవుని
నొంచుటయు నారౌహిణేయుం డలిగి బలిమిమై నఱచేతఁ దన్నుటయు
నతండు నోరనెత్తురు గ్రక్కుచుఁ బ్రాణములం బాసి పెనుగాలికిఁ బాదపంబెట్టు
లట్టులు నేలంగూలె. అందులకుఁ గోపించి కూటుఁడు రాముని శలుఁడు తోసల
కుఁడుం గృష్ణుని మార్కొనుటయు బలుండు కూటుం బిడికిటఁ బొడిచి యవ
లీలం.జంపె. హరి కాలఁ దలలు దన్ని శలతోసలకులం బిలుకుమార్చె. అట్లు
చాణూరముష్టికకూటశలతోసలకులు చచ్చినం దక్కినమల్లురెల్లఁ బ్రాణభీతిం
బఱచిరి. అట్టియెడ రామకృష్ణులాత్మవయస్యులైన గోపాలురం గూర్చుకొని
యారంగంబున వాదిత్రనాదంబు ప్రవర్తిల్లుచుండ నూపురరవంబు తాళలయా
నుగతి నభిరామంబై యెసంగ విలాసనృత్యంబు సేయుచు విహరించుటయు
వేడుకచూడ వచ్చినబ్రాహ్మణాదిజనులు కంసుఁడొక్కండు దక్కఁ దక్కిన
వారెల్ల మేలుమేలని యయ్యాట మెచ్చుచు నెమ్మనమ్ముల సమ్మదమ్ము నొందిరి.
మల్లవీరులలోనం బ్రధానులు హతు లగుటకును దక్కినవారు వెఱచిపఱచు

టకను మనం బడలఁ గంసుండు వాద్యవాదనంబు వారించి యాత్మభటుల వెస మొగంబై దుర్వృత్తు లైనయీవసుదేవసుతులంబురంబు వెడలంగొట్టుఁడు. గోపాలురధన మెల్ల నపహరింపుఁడు. దుర్మతి యగునందగోపుని బంధింపుఁడు. అసాధుతముఁడు దుర్బుద్ధియు నగువసుదేవుని బరపక్షపాతి యగునాతండ్రి నుగ్రసేనుని దదనుసారులను వేవేగ వధింపుఁ డని యాజ్ఞ చేసె.

శ్రీకృష్ణుఁడు కంసుని సంహరించుట.

అక్కఱణిం బెక్కులు ప్రేలునక్కంసునిపైఁ బెద్దయు నలిగి యవ్యయుం డైనహరి తదారూఢరాజమంచముమీఁదికి లాఘవంబున లంఘించుటయుం మృత్యువుపోలెఁ దనమీఁది కురువడించి యేతెంచు నచ్యుతుం గాంచి కంసుండు దటాలున లేచి బీరంబున వాలుఁ బలకయుం గొని యనికి సమకట్టె. మింటఁ దిరుగు డేగపగిదిఁ దన్నుఁ దప్పించికొన డాఁపలికి వలపలికిం దొలఁగుచుఁ బాయుచుఁ జేతివాలు జళిపించుచున్న కులపాంసనుం డైనకంసునిం గృష్ణుండు పన్నగగ్రహణవ్యగ్రుం డైనగరుడుని వడువున నుగ్రతేజంబున మెఱసి వడిం బేర్చి పట్టుకొని కిరీటంబు పడఁ దన్ని సిగఁ బట్టికొని యయ్యున్నతమంచమునుండి రంగమునం బడఁ దటాలునఁ ద్రోచి యేచి వానిమేను గులగులలుగాఁగ నాత్మతంత్రతం దాను వాని పయిం బడి పొరిమాల్చి యేనుంగు నీడ్చుసింగము భంగి నాకంసునిపీనుఁగు నీడ్చుటయును నారంగమున నెల్లజనులహాహానినాదం బెసంగి నింగి ముట్టె. కంసుఁ డెల్లప్రొద్దును దినుచుఁ ద్రావుచు నడచుచుఁ గూర్చుండుచు శ్వాసము విడుచుచు నుద్విగ్నచిత్తంబునఁ జక్రాయుధుం దలంచుచుండినకతంబున నయ్యీశ్వరుసారూప్యంబుఁ బ్రాపించె. కంసునిచావు విని వానితమ్ములు కంకన్యగ్రోధకాదు లెనమండ్రు దీండ్రించునలుకతో నన్నఋణము దీర్చువారై యొక్కయుమ్మడిం దాఁకుటయు బలరాముఁడు పశువిశసనోదగ్రుం డైనమృగేంద్రంబుపోలికం బేర్చి యచ్చట నున్నయినుపగుదియఁ గొని యయ్యాతిరభసోద్యతుం బిలుకుమార్చె. అప్పుడు దివంబున దేవదుందుభులు మొరసె.

బ్రహ్మేశాదులు పుష్పవృష్టిఁ గురిసి రామకృష్ణులం బ్రశంసించిరి. సురసుందరులు నృత్యం బొనర్చిరి. కంసపత్నులును దద్భ్రాతృభార్యలును మగలచావునకుఁ బెన్వగలం బొగులుచుఁ గన్నీరు జాలువాఱఁ దలలు వగుల నడిచికొనుచు నచ్చటికి వచ్చి వీరశయనంబునం బడియున్న పతులపయింబడి కౌఁగిలించికొని యెలుంగు రాల్పడ నిట్లని పలవించిరి. ఓప్రాణనాథా! యోప్రియతమా! యోధర్మజ్ఞా! యోకరుణామయా! యోదీనవత్సలా! నీవు చచ్చుటం జేసి యేమును గృహములతోడం బ్రజలతోడఁ జచ్చినవార మైతిమి. పతియగునిన్నుఁ బాసి యీనగరి మాయట్లపోలె నుత్సవమంగళంబు లుడిగి శోభింపకుండెడు. తప్పు సేయనిభూతములకు ద్రోహము సేసినదాన నీ కిట్టిదశం బడయ వలసె. భూతములకుఁ గీడు రోసి యెవ్వం డివ్విశ్వమున మేలొందు? ఈకృష్ణుండే సర్వభూతములయుత్పత్తికిని బాలనమునకును సంహారమునకుం గారణంబు. అట్టి మహాత్మున కెగ్గు చేసినవాఁ డెన్నఁడైన నెక్కడనైన సుఖముఁ బడయ నేర్చునే యని రాజమహిళలు రోదనంబు సేయుచుండ లోకేశ్వరుండైన కృష్ణుండు వారల నూరార్చి కంసునకును వానితమ్ములకునుం గ్రమంబునఁ బరలోకక్రియలు సేయం బనిచె.

రామకృష్ణులు దేవకీవసుదేవులఁ గని యూరార్చుట.

అంత నయ్యదుకుమారులు దల్లిదండ్రులైన దేవకీవసుదేవులకుఁ గంసకృతబంధంబు దప్పించి తదీయపాదములపై నాత్మశిరంబులు సోఁకఁ జాఁగిలంబడి మ్రొక్కుటయు రామకృష్ణు లీశ్వరు లనుతలంపున శంకించి యాజననీజనకులు వారిం గ్రుచ్చి కౌఁగిటఁ జేర్చి దీవించు టుడిగిరి. అట్టియెడఁ బురుషోత్తముం డౌరా! వీర లిప్పుడే పరమార్థం బెఱింగి రియ్యది ప్రకృతకార్యవిడంబనంబున కనువుగా దని తమలో నూహించి సకలజనసమ్మోహనంబైనయాత్మమాయాయోగంబు వారిపయిం బరఁగించి యన్నయుం దాను వారిచేరువకుఁ జని వినయమునఁ దల వాంచి యోయమ్మ! యోనాయనా! యని పిలిచి ప్రీతి పుట్టించుచు నిట్లనియె. తండ్రీ! మామీఁద నిత్యోత్సుకత్వంబు

గలిగియున్నను మీకిరువురకు మాబాల్యపౌగండకైశోరక్రీడలుచూడ వలనుగాకుండె. లోకమునఁ దండ్రియింటనుండి బాలురు వారిలాలనలం బడసి ముదమొందుదు రాభాగ్యంబు మాకు లేకుండె. సర్వార్థసాధనం బైనదేహ మెవ్వరుగని పెంచఁ బెంపుగాంచు నాతల్లిదండ్రులఋణమును మర్త్యుండు నూఱేండ్లకైనం దీర్పఁజాలఁడు. సమర్థుఁడయ్యుఁదల్లిదండ్రులకు దేహమునను ధనమునను వృత్తిఁ గల్పింపనిపుత్త్రుని యమభటులు పరలోకమున నిజమాంసముఁ దినిపింతురు. తల్లిని వృద్ధగుతండ్రిని బతివ్రత యగుభార్యను బాలుఁడైన పుత్త్రుని గురువులను దన్నాశ్రయించినబ్రాహ్మణుని సమర్థుఁడయ్యు భరింపనిపురుషుఁడు జీవన్మృతుఁ డనంబడు. కంసునకు వెఱచి యసామర్థ్యమున మీకుఁ బరిచర్య సేయక యిన్ని నాళ్లు వ్యర్థముగఁ గడపితిమి. శత్త్రుపీడ నలజడిపడుమీకింతకాలము పరాధీనతానిమిత్తమున శుశ్రూష గావింపనిమాతప్పు సైరింపవలయు నని యిట్లు మాయామానుషవేషుఁ డైనయవ్విశ్వాత్ముండు దెల్పిన నమ్మాటలకు మోహ మొంది దేవకీవసుదేవు లాకుమారులఁ గౌఁగిటం గ్రుచ్చి ముదం బంది తొడపయిం గూర్చుండఁ బెట్టుకొని యానంద బాష్పములఁ దన్మస్తకంబులఁ దడుపుచు స్నేహపాశసమావృతు లై బాష్పనిరుద్ధకంఠులై యేమియుం బలుక నేరక మిన్నకుండిరి.

శ్రీకృష్ణుఁ డుగ్రసేనుని రాజ్యమున నియమించుట.

అట్లు తల్లిదండ్రుల నూఱడించి దేవకీనందనుండు మాతామహుఁడైన యుగ్రసేనుని రాజుం జేయఁ దలంచి యతనిదెసం జూడ్కి నిగుడించి యిట్లనియె. మహారాజా! నీప్రజలైనమాకుఁ బని పంపుము. యయాతి శాపమున యాదవులకు రాజ్యాసనం బారోహింపరాదు. కావున నేము దాని కనర్హులము. ఏను భృత్యుఁడనై కొలుచుచుండుటం జేసి దేవాదులు వినమ్రులై నీకు బలి యర్పింతురు. తక్కినరాజులఁ జెప్పనేల యని చెప్పి యుగ్రసేనుని రాజ్యాసనం బారోహింప నొడంబఱచి యనిలుం బిలిచి యయ్యా! నీ వేగి

సుధర్మాభిధానం బైనయింద్రసభ నీరాజునకుఁ దెచ్చి యిమ్మని యానతిచ్చె. నని విని పవమానుం డరిగి యయ్యర్థ మాఖండలునకుఁ జెప్పుటయు దేవపతి కృష్ణప్రభావం బెఱింగినవాఁడు గావున దాని నిచ్చినం దెచ్చి మారుతుం డర్పించినం గృష్ణుఁ డం దుత్తమాసనంబున నుగ్రసేను నాసీనుం జేసి రాజ భావమునం బూజించె. కంసునకు వెఱచి నానాదేశములకుఁ బఱచినయదు వృష్ణికుకురాంధకాదు లైన స్వజనుల రావించి సత్కరించి బహుధనంబు లొసఁగి వారిం దమతమయావాసంబుల నివసింప నియమించె. కృష్ణసంకర్షణ భుజబలగుప్తులై యాదవులు దుఃఖములం బాసి లబ్ధమనోరథులై ప్రతిదిన ము సదయస్మేరవీక్షణవిలాససముదంచితంబై నిత్యప్రముదితం బైనముకుంద వదనారవిందముఁ గనుంగొనుచుఁ గృతార్థులై రమించిరి. ముకుందముఖార విందామృతముఁ గ్రోలుటం జేసి వారు వృద్ధులయ్యుఁ బ్రాయముం బడసి యతిశయితబలతేజంబులఁ బెంపు గాంచిరి. అట రామకృష్ణులు నందునొద్దకుఁ జని యాగోకులపతిం గౌఁగిలించికొని యిట్లనిరి. తండ్రీ! నీవును యశోదయుం మమ్ము స్నేహమునం బెంచి లాలించితిరి. తల్లిదండ్రులకుఁ బుత్త్రులమీఁది ప్రేమం బాత్మశరీరప్రీతికంటె నధికంబు. ప్రోచి పెంచఁగ నసమర్థులైనబాంధ వులు విడిచినబాలురం దమకన్నబిడ్డలట్లుపోలెఁ బెంచినవారకదాతల్లిదండ్రులు? తాతా! మీరు వ్రేపల్లియకుఁ జనుఁడు. ఏమిచ్చుట సుహృదులకు సుఖముఁ గావించి మామీఁది స్నేహమున విరహవిహ్వలులై యుండుస్వజను లైనమిమ్ముఁ గనుంగొన వత్తు మని ప్రణయభాషితంబుల నుపలాలించి వస్త్రాలంకారధన కనకాదు లొసఁగి సాదరముగ సత్కరించుటయు నందుఁడు ప్రణయవిహ్వ లుండై వారిం బలుమాఱులు గౌఁగిలించుకొని కంట దడి వెట్టుచు వారినెల్ల వీడుకొని గోపాలురతోడ మగిడి వ్రేపల్లియ కరిగె.

రామకృష్ణు లుపనీతులై విద్యాభ్యాసంబు సేయుట.

అట వసుదేవుం డాత్మనందనులైన రామకృష్ణులకు బ్రాహ్మణపురస్కృతుం డైనపురోహితుం డగుగర్గాచార్యునిచే ద్విజోచితం బైన యుపనయనసంస్కారము శాస్త్రోక్తవిధానమునం జేయించి యయ్యుత్సవంబున విప్రులం బూజించి యలంకరించి సవత్సాలంకృతగోసహస్రంబుల దక్షిణగా సమర్పించె. మఱియు నాకుమారులజన్మసమయమునం దాను మనంబున నొసంగిన వానిం గంసుం డధర్మమున నపహరించికొనుటయు వానినెల్లం గ్రమ్మఱ రాజకీయగోష్ఠమునుండి తెప్పించి యన్నింటి నొసంగె. అవ్విధంబున నుపనయనసంస్కారముం బడసి రామకృష్ణులు ద్విజులై గర్గునివలనం గాయత్రి గ్రహించి బ్రహ్మచారులై సర్వవిద్యాధారులయ్యు సర్వలోకేశ్వరులయ్యు సర్వజ్ఞులయ్యు ననన్యసిద్ధనిర్మలనిజబోధము నరవేషమున దాంచినవా రవుటం జేసి లోకవిడంబనార్థంబు గురుకులవాస మొనర్పం బూని కాశీపురికిం జని యం దవంతీపురవాసియైనసాందీపునిం డనువిద్వాంసు నాశ్రయించి పరమభక్తిభరితంబుగ నుపాసించిరి. శమదమసమన్వితులై నయాశిష్యులసేవకును శుద్ధభావానువర్తనంబులకును సుప్రీతుండై యయ్యుపాధ్యాయుం డఖిలవేదములను వేదాంకములను వేదాంగములను సరహస్యం బైనధనుర్వేదంబును ధర్మశాస్త్రములను మీమాంసామార్గంబులను దర్కవిద్యను షాడ్గుణ్యసముదంచితం బైనరాజనీతిని జెప్పె. సర్వవిద్యాప్రవర్తకులైనయాబ్రహ్మచారు లొక్కతూరి చెప్పినమాత్రన వానినెల్ల నాగురువుతోడం జదివి నేర్చికొని యఱువదినాలు గహోరాత్రములం జతుష్షష్టికళలు గ్రహించి యయ్యాచార్యుం గొలిచి మహాత్మా! గురుదక్షిణయేమి సమర్పింతుమని వేడిరి. ఆశిష్యుల యద్భుతమహిమంబునతిమానుషం బైనమతివిలాసంబునుం బరికించి యయ్యాచార్యుండు భార్యతో నాలోచించి యంతకుమున్నెన్నండో ప్రభాసక్షేత్రంబున సముద్రమునం బడి చచ్చిన తనసుతుని దెచ్చి దక్షిణగా నిమ్మని చెప్పె.

అందులకువల్లెయని యనివార్యవిక్రములైన యమ్మహారథులు రథ మధిరోహించి ప్రభాసమునకుఁ జని సముద్రతీరమున నించుక కూర్చుండుటయు సాగరుండు వారి నీశ్వరులఁగా నెఱింగి పూజోపకరణములతోడ నేతెంచి పూజించె. ఆపూజలం గ్రహించి భగవంతుఁ డయ్యా! బాలుఁ డైనమాగురుపుత్త్రుఁడు భవత్కల్లోలమాలికాగ్రస్తుండై నీలో నుండెడు. వేగ వానిం దెచ్చి యిమ్మని యడుగుటయు సముద్రుఁ డోమహాత్మా! యే నతని హరింపను. మఱి పంచజనుఁ డనుశంఖరూపధారి యైనయసురుఁడు మీగురుపుత్త్రుని హరించె. అయ్యసుర నాయంతర్జలంబున నుండెడు జలము సొచ్చి వానిం దెగటార్చి గురుపుత్త్రుం గ్రహింపు మని విన్నవించె. కృష్ణుండు బలదేవుతోడ రయమున నుదధిజలంబు సొచ్చి యాలోపల నున్న యాదానవుం జంపి వానియుదరంబుఁ జీల్చి యం దయ్యర్భకుం గానక యాకుమారుఁడు మృతుఁడై యమలోకమునకుఁ బోయియుండు నని నిశ్చయించి యాదానవు మేనం బుట్టి పాంచజన్య మనం బరఁగునుత్తమశంఖముం గ్రహించి యమనివాసం బైనసంయమనీపురి కరిగి శంఖ మొత్తె. శంఖనిర్ఘోషంబు విని యముఁడు దటాలున నెదురువచ్చి భక్తిబృంహితముగా రామకృష్ణుల కుత్తమపూజఁ గావించి వినయవినమ్రుండై కృష్ణుని మొగమునం జూడ్కి నిలిపి దేవా! లీలామానుషులైన నారాయణమూర్తులగు మీకేమిపని సేయుదు నని యడుగుటయు దేవకీనందనుం డిట్లనియె. నిజకర్మనిబంధనంబున నస్మద్గురుపుత్త్రుం డిటకుఁ దేఁబడియె. మదీయశాసనంబున నాతనిం దెచ్చి యిమ్మని నిర్దేశించిన విని యముఁడాసాందీపనతనయు నాత్మలోకముననున్న వానిం దెచ్చి యిచ్చె. అక్కుమారునిదోడి తెచ్చి రామకృష్ణు లాచార్యునకర్పించి యింక నేమి దక్షిణ దెచ్చి యర్పింతు మనియడిగినం గురుండు వారికిట్లనియె. వత్సలారా! మీరిరువురు మంచిగురుదక్షిణ యొసఁగితిరి. మీయట్టిశిష్యులం బడసినగురువునకు నెఱవేఱనికోర్కియుం గలుగునే? వీరులారా! నిజగృహంబులకుఁ జనుఁడు, మీకీర్తి జగత్పావనంబై యెసంగెడు మనిచెప్పిన నయ్యాచార్యుని

పెడుకొని యాదవసుదేవనందనులు రథ మెక్కి పర్జన్యనినదోపమం బైన నేమి ఘోషంబుతో మధురాపురంబునకుఁ జను దెంచిరి. పౌరజనులు రామకృష్ణులం గాంచి యంతకుమున్ను పెక్కు నాళ్లు వారి నెడఁబాసినవారు గావునఁ బోయినసొమ్ము దొరికిన నెట్టు లట్టులు పరమానందమునం బొదలిరి.

కృష్ణుఁ డుద్ధవుని వ్రేపల్లెకుశల మరయఁ బంపుట.

అంత నొక్కనాఁడు వృష్ణికులప్రవరుండు మంత్రాలోచననిపుణుండు బృహస్పతిశిష్యుండు బుద్ధిమద్వరిష్ఠుండు దనకుఁ బ్రియసఖుఁ డేకాంత భక్తుఁడు నగునుద్ధవుం బిలిచి భగవంతుండు ప్రపన్నార్తిహరం బైనతనకరంబున నతనిచేయి వట్టుకొని యిట్లనియె. సౌమ్యా! యుద్ధవా! వ్రేపల్లియకుఁ జని మాతల్లిదండ్రు లగుయశోదానందుల కానందము గ్రందుకొలుపుము. న న్నెడఁబాసినగోపికల కయ్యలమట నామాటలఁ దేర్పుము. వారు నాతదర్థంబు పతిపుత్త్రబాంధవాదులం బరిత్యజించి యేన తమకుఁ బ్రాణమనియుఁ బ్రియతముఁడనియు నమ్మి నెమ్మనమ్మున నన్నె యాత్మునిఁగా నెంచియున్నారు. నాతదర్థంబు లోకధర్మములఁ ద్యజించిన వారి నేను భరింతును. దవ్వున నున్నపరమప్రియతముఁడైన న న్నెడఁబాసి యెంతయు నుత్కంఠతో నన్నే తలంచుచు నాగోపకాంతలు మోహ మొందియు నేను వ్రేపల్లియ వెడలు నెడం జెప్పినమాటల నమ్మి మదార్తికలై యెట్టులో యింతకు మేనఁ బ్రాణములఁ దాల్చియుండుదు రని యూఱడిచ్చుటయు వల్లెయని యుద్ధవుండు తత్క్షణంబ భర్తృసందేశముం గొని తేరెక్కి నందగోకులంబునకుఁ దఱలె. తఱలి పడమరఁ బ్రొద్దుక్రుంకుతఱిఁ బసులు మందకు మగిడి వచ్చునంత నెదలైనయావులఁ గట్టఁ గడంగి యొండొంటితోడఁ బోట్లాడు నాఁబోతుల సమ్మర్దమున నిఱుకటంబై దవ్వుదవ్వులఁ గ్రేపులం గాంచి పొదుఁగు వ్రేగునం బాఱుతెంచు లేఁగటియావులపరువులఁ బరిష్కృతంబై యిటునటుఁ బల్లటీల్లొనుచుఁ బఱచు తెల్లనిక్రేపుల నభిరామంబై పాఁడిపితుకు నెడం బొదము

నులివున లలితంబై గోపబాలకులవేణుగానరవమున రమణీయంబై రామ
కృష్ణలీలలం బాడుచున్న యలంకృతగోపగోపికాసమాజముల మనోరమంబై
సూర్యానలాతిథిపితృదేవార్చనలం బరంగించుధూపదీపమాల్యంబుల క్రొత్తా
వుల నలరుగోపమందిరంబుల సుందరంబై చుట్ల నున్నయుద్యానవనంబులలోని
తరులతానికరములం బూచినవిరులకమ్మతావుల కెలసి తేనియ లాని
పాడుచున్న తుమ్మెదలమధురగీతమ్ములను గొలంకులం జెలంగుసరోజకాండ
ములం గబళించురాయంచలు మున్నగుపులుఁగులయెలుంగులను శ్రవణోత్సవ
ప్రదంబై సొంపారువ్రేపల్లియును గోఖురోద్ధూత రేణుప్రచ్ఛన్నరథుండై
ప్రవేశించె. వచ్చినయచ్యుతసఖుండైనయుద్ధవుం గాంచి నందుఁడు గోవింద
మతిం గౌఁగిలించికొని యాదరించి యుచితవిధిం బూజించి పరమాన్నంబుఁ
గుడువంబెట్టి కృతాహారుం డైనయతనిం బాన్పునఁ బవ్వళింపఁజేసి కాళ
లొత్తి మార్గాయాసంబు పుచ్చి యిట్లనియె. మహాభాగా! మాచెలి యగువసు
దేవుఁ డిడుమలెల్లఁ బాసి సుహృదులతోడఁ గూడి బిడ్డలు భార్యలు మున్నగు
వారితోడఁ గుశల మున్నవాఁడె? ధార్మికులు సాధువులు నగుయాదవుల
కెల్లఁ బ్రొద్దును గీడు రోయుచుండిన పాపాత్ముఁ డైనకంసుఁడు దనపాప
మునం దెగియె. తన్నే నాథుఁగా నమ్మిన మమ్మును దల్లిని సుహృదులను సఖు
లను గోపాలురను వ్రేపల్లియను గోవులను బృందావనమును గోవర్ధనాద్రినిం
గృష్ణుండు స్మరించునే? తమవారిం జూడ నాగోవిందుఁ డొకతూరి యిటకు
వచ్చునే? స్మేరవిలోకితవిలసితం బైనయాసుకుమారునెమ్మోము నెన్నఁడు
గనుంగొందుమో? అమ్మహాత్ముఁడు దవాగ్నివలన వాతవర్షములవలన సర్ప
వృషభములవలనను మఱియు నపరిహార్యము లైనవివిధమృత్యువులవలనను
మమ్ముఁ గాచె. అమ్ముకుందునివిక్రమమును విలాసకటాక్షవీక్షణంబును జిఱు
నగవు సొంపును బలుకుబడినిం దలంచికొనినమాకుఁ బను లెవ్వియుఁ దోఁపవు.
హరియడుగులం గడు బెడఁ గైనవనగిరిసరిదాదితద్విహారప్రదేశములఁ గాంచు
నెడ మాకుఁ దన్మయత్వం బడరెడు. గర్గాచార్యుఁడు సెప్పినచొప్పు దప్పక

రామకృష్ణులు సురకార్యము సాధింప నీధరిత్రి నవతరించిన దేవోత్తములని తలంచెద. కావున్న నాగాయుతబలుం డైనకంసుని నామల్లవీరుల నాకువల యాపీడగజము నవలీలం బసులం బురిగొనుసింగముభంగిం దెగంజూడను దాళ త్రయమాత్రం బైనయాఘోరకార్ముకంబు విఱువ నొక్కచేత నేడుదిన ములు చలింపక గోవర్ధనాద్రి యెత్తి వహింపను బకతృణావర్తాదిరాక్షసుల సంహరింపను గృష్ణునకును, బ్రలంబాదులం బరిమార్ప రామునకుం జెల్లునే? యని తలంచికొనితలంచికొని నందుండు ముకుందమయమానసుండై యశ్రు కంఠుండై ప్రేమాతిశయవిహ్వలుండై మిన్నకుండె. యశోద కొడుకుకథలు వర్ణించునెడ నాకర్ణించుచుం జన్నులు చేపం గన్నీరు రాల్చుచుండె. నందు నకు యశోదకును దామోదరునిపై నత్యూర్జితం బైనప్రేమానుబంధ మరసి యుద్ధవుండు నందగోపున కిట్లనియె. గోపాలవర్యా! సర్వగురుం డైననారా యణునిపై నిట్టియనురాగముం గాంచుటంజేసి దేహధారులలోనెల్ల మీరు పరమశ్లాఘనీయులు. ఈరామకృష్ణులు విశ్వమునకు నిమిత్తోపాదానకారణ భూతులు, ప్రధానపురుషాత్మకులునై యొప్పుదురు. ఆత్మసృష్టము లగుభూత ములలో ననుప్రవిష్టులై వీరు నానాభేదములకు జీవులకును నియామకులై యనాదులై సర్వకారణాత్ములై వెలయుదురు. ప్రాణావసానసమయంబున వీరి పయిం బరిశుద్ధచిత్తం బొక్కనిముసమేనియు నిశ్చలంబుగ నిలిపిన నరుండు కర్మవాసనలు నిస్తరించి రయమునం బ్రహ్మమయుండై శుద్ధసత్త్వమూర్తియై పరమగతిం బ్రాపించు. సర్వాత్ముండు సర్వహేతువు మాయామర్త్యమూర్తియు నగునారాయణునందు మీరు భావముం జేసినదాన నోమహా[illegible] మా కింకం గర్తవ్యం బెయ్యది? వేగ ప్రసన్నుడు భగవంతుం డవతరించి తన్నుం బెంచినతల్లిదండ్రులకుం బ్రీతి సేయు సకలయాదవులకుం బ్రతికూలుం డైన కంసునిం జంపి రంగమధ్యమున మీ కిచ్చినబాస వాసుదేవుండు దాను సత్యముగ నడపించుంగాని తప్పండు. మహాభాగులారా! వగవం బనిలేదు. కృష్ణు నతిసన్నిహిత కాలముననే చూతురు. సమిద్ధు నగ్నిహోత్ర నతండు

సర్వభూతములహృదయములం దుండెడు. అమాని యైనతన కొక్కఁడు ప్రియుఁ డొక్కఁ డప్రియుఁ డొక్కఁ డుత్తముఁ డొక్కఁ డధముఁ డొక్కఁడు తుల్యుఁ డొక్కఁ డాత్మీయుఁ డొక్కఁడు పరకీయుఁడు ననుట లేకున్నను దల్లిదండ్రులు పుత్త్రకళత్త్రాదులును జన్మకర్మంబులు లేక న్నను సాధురక్షణార్థంబు సదసన్మిశ్రజన్మంబు లెత్తెడు. నిరీహుఁడయ్యు నప్పరమపురుషుఁడు ప్రకృతిగుణంబు లైన సత్త్వరజస్తమంబులం జెంది క్రీడార్థ మాగుణముల నీజగంబునకు సృష్టిస్థితిసంహారంబులఁ గావించు. కన్ను భ్రమరివాఱినవానికిఁ బుడమి దిరుగునట్లు దోఁచుచందమునఁ జిత్తము కార్యములఁ జేయుచుండ నందాత్మాధ్యాసమునం జేసి యాత్మనందుఁ గర్తృత్వ మారోపింపఁబడు. మీ కిరువురకే యమ్మహాత్ముఁ డాత్మజునిరీతిఁ బ్రీతిభా జనంబు గాఁడు. మఱి యందఱకు నాత్మజునిరీతిని మాతాపితరులవిధమునను బరమప్రేమాస్పదుండు. కన్నది విన్నది యతీతం బాగామియు వర్తమానం బును స్థావరంబును జంగమంబును మహత్తు నల్పంబును మఱియుఁ బ్రపంచ మునం గలయఖిలంబును విష్ణుమయంబ కాని తద్భిన్నంబుగాదు. అయ్యీశ్వ రుండే పరమార్థభూతుం డని యుద్ధవుండు సెప్పిన విని నందుండును దదుచితం బుగఁ బలుకుచున్నంతఁ బ్రభాతం బయ్యె. అయ్యెడ గోపికలు మేలుకాంచి దీపముల వెలిఁగించి గృహసమ్మార్జనంబు నిర్వర్తించి వాస్తుపూజ సలిపి పెరుగు ద్రవ్వఁ దొడంగిరి. కవ్వపుఁద్రాడీడ్చు నెడఁ జేతికంకణంబులుఁ గొప్పులోని విరులు గొప్పపిఱుందులుఁ జన్నుఁగవయు హారములుం గదలఁ జలత్కర్ణకుండల కాంతులు గండతలములం బర్వ నెమ్మొగమ్ములఁ గుంకుమారుణరుచులతోడం జెలిమి సేయఁ బెరుగు ద్రచ్చుచుఁ గృష్ణలీలలు పరమానందపరవశలై పాడు టయు దధిమథనరుతితోడం గలిసి హరిలీలాగానరవంబు పెల్లెసంగి దెసలం గలుగు నమంగళముల నడంగించె. అంత నంశుమంతుండు తూర్పునం దోఁచుటయు గోపకాంత లూరివాఁకిట నున్న కనకరథముం గని యిది యెవ్వరిది? కంసుని కార్యము సాధింపఁ గమలాక్షుని మధురకుఁ గొనిపోయిన యయ్యక్రూరుండే

చ్చెనొక్కొ? అతండు ప్రీతుఁ డైనభర్తను మాచే నిష్కృతి సేయుం? యని తమలోనం దలపోయుచున్నంత స్నానసంధ్యావందనాదిఖల నిర్వర్తించి యుద్ధవుం డరుగుదెంచె.

అరుగుదెంచిన యాహరిపరిచరుని లంబమానపీనాయతబాహుయుగమున నొప్పువానిఁ గ్రొత్తామరలం దెగడుకన్నుఁగవ నలరువానిఁ బచ్చనిపట్టు వలువగట్టినవానిఁ గమలమాల నలరారువాని మణికుండలప్రభాపరీతగండతలములఁ జెలఁగునెమ్మొగమ్మున నుల్లసిల్లువానిం గాంచి గోపికలు బలే విశదమందహాసమున భాసిల్లునీసుందరుఁ డెవ్వఁ డెచ్చోటినుండి వచ్చినవాఁడు ముకుందునివేషభూషణంబు లీతండు దాల్చియుండెడు నని తమలోనం బలుకుచు నుత్సుకత్వమున నాకృష్ణపాదాశ్రయుం జేర నరిగి వినయావనతలై లజ్జాలలితస్మేరవీక్షణంబులను బ్రియభాషితములను సత్కరించి యుచితాసనాసీనుం డైన యాతనిహరిదూతఁగా నెఱింగి యేకాంతమున నిట్లని యడిగిరి. అయ్యా! యదుపతిపంచిన నేతెంచినదూత నీ వని యెఱుంగుదుము. తల్లిదండ్రులకుఁ బ్రియము సేయనానాథుండు నిన్నుఁ బనిచెఁగాఁబోలు. కాకున్న నీగోకులంబున నతనికి స్మరణీయం బేమి గలుగు? మునులకును బిత్రాదిస్నేహానుబంధ మపరిహార్యము. తక్కినవారితోడఁ గార్యార్థంబు చెలిమి చేసిన నయ్యది పనిగలుగునంతకే చెల్లుఁగాని పిమ్మటఁ గన్పట్టదు. తేంట్లు తేనియకై పువ్వులఁ జేరునట్లు పురుషులు కార్యార్థంబు వనితలతోడఁ బొందు సేసి పనిదీఱినం ద్యజింతురు. వేశ్యలు క్షీణధనుని బ్రజ లసమర్థుఁ డైనరాజును జదివినశిష్యు లాచార్యుని ఋత్విజులు దక్షిణ యిచ్చినయజమానుని బక్షులు పండ్లుడిగినవృక్షము నతిథులు భోజనము వెట్టినవానిగృహంబును మృగములు గాలినయడవిని జారపురుషుఁడు సంభుక్త యైనకామినినిం ద్యజించుట లోకదృష్టంబకదా యని గోపికాపికాలాపలు గోవిందునిపైఁ ద్రికరణంబు నిలిపి లోకవ్యాపారములు చాలించి యాలీలాగోపాలుండు బాల్యకైశోరదశలం గావించినచర్యలఁ

దలఁచి తలఁచి సిగ్గుడిగి పలవించుచుఁ దచ్చరితల నయ్యుద్ధవునియెదురఁ బాడుచుండిరి.

భ్రమరగీతలు.

అం దొక్కగోపసుందరి యొకమిళిందముం గాంచి కృష్ణసంగమముఁ జింతించుచు దానిం బ్రియుఁ డంపినదూతఁగా నెన్ని యిట్లనియె. ఓమధుకరమా! ధూర్తబాంధవమా! సవతాలికుచములదండడి నలంగిన పూదండ కంటుకొన్నకుంకుమపంకమున నమరుమీసలతో మాపాదంబు ముట్టవలదు. ఇట్టి నీ వెవ్వనికి దూతకృత్యంబు సలుప వచ్చితి మధుపతి యదుసభలోనం బరిహాసాస్పదం బైనతనవార్తఁ దేనియ నొక్కతూరి గ్రోలఁ జను విచ్చి నీయట్టివాఁడు పూవులవిడుచువడువున నాతండు మమ్ము విడిచె. అట్టివానిపాదపద్మము నిందిరయెట్లు సేవించెను? ఆహా! తెలిసె. ఆనయగారియిచ్చకపుంబలుకులఁ జిత్తము మెత్తవడ నత్తామరసవాసిని యాసుందరుఁ జేరియుండవలయు. షట్పదమా! ప్రాఁతవడ్డయయ్యాదుపతిచరితలం గృహరహిత లైనమాముందర మిక్కిలి పాడ నేల? ఆవిజయసఖుని యిప్పటిచెలులముందరఁ దత్ప్రసంగము పాడుము. వారు నీపాటకుఁగుచాలంకారము సెడఁ జొక్కి నీ కిష్ట మైనదాని నిత్తురు. అతనికపటపునగవులకును భ్రూభంగవిలాసములకు నీముల్లోకములలో నేముద్దియ లోఁబడకుండెడు? శ్రీదేవియే తత్పాదపరాగముఁ గోరి కొలుచునఁట. ఏ మెంతవారము? ఐనను దీనులయెడ దయఁ జూపుమహాత్మున కుత్తమశ్లోకశబ్దమన్వయించు నని నీవు చెప్పుము. శిరంబునం బెట్టుకొన్న పాదము విడువుము. ముకుందుఁడు పంపఁ దదీయదూతకార్యంబు నడపవచ్చి నయగారపుఁబలుకుల బుజ్జగింప నేర్చిననీనేర్పెల్ల నే నెఱుంగుదు. తనతదర్థంబు పతుల బిడ్డల నన్యలోకములనుం ద్యజించినవారి నాచపలచిత్తుండు విసర్జించె. ఇందు సంధియేమి గలదు? అతండు తొల్లి బోయమాడ్కిఁ గ్రూరుండై కపినాథుఁ డైనవాలిం జంపెనఁట. స్త్రీపరతంత్రుఁడై వలచివచ్చిన సెలఁతకు

విరూపత్వం బొనర్చెనఁట. బలిని యాచించి యతం డిచ్చినబలిం గొనియుఁ గాకివోలె నుపకారం బరయక యాదాతను బంధించెనఁట. అట్టికృష్ణునిచెలిమి యిఁకఁ జాలుఁజాలు. మూలముట్టి విడుతు మన్ననో తదీయకథార్థములు విడువఁగూడకుండెడు. అతనిచరితలపేరిటికర్ణామృతపుబిందువు లొక్కపరి గ్రోలినమాత్రన ద్వంద్వధర్మముల నెల్లఁబాసి ప్రపంచాసక్తియెడలి గృహమును గుటుంబమునుం దెగడి భోగహీనులై పలువురుహంసాదిపక్షులరీతి భిక్షువృత్తి నడపుదురు. బోయవానియెలుఁగు మృగరుతం బనినమ్మిలేళ్లు తదీయశరవేదనం బడురీతి నేము దెలియక యాకుటిలునిపలుకు సత్యమని నమ్మి తదీయనఖస్పర్శమునఁ దీవ్రంబైనమదనవ్యాధినొకపరిగని యడలితి మిఁకఁ జాలు. ఇతరవార్త నెప్పుము. ప్రియునిచెలికాఁడా! ప్రియతముఁ డంప మగిడి వచ్చితే? సమ్మాననార్హుఁడవుదువు. ఏమివలయునో కోరికొనుము. జంటవాయరాని యతని క్రేపకు మమ్ముఁ దోడ్కొనిపోవుదువో? ఓసౌమ్యుఁడా! యతనియురమునఁ గమలయనువిద యెల్లపుడు నెడఁబాయకుండెడు. అయ్యార్యపుత్త్రుండు మధురానగరి నిప్పు డున్నవాఁడే? ఈపితృగృహములను జుట్టలను గోపాలురను దలంచునే? తన యూడిగపువా రగుమాకథల నాతఁ డొకప్పుడైనం బ్రస్తావమునకుఁ దెచ్చునే? ఆమనోహరుఁ డగరుపరిమళము గుబులొల్కుపుతనభుజ మిఁక నెన్నఁడు మాశిరంబులం బెట్టునో యని పలికిన విని యుద్ధవుండు కృష్ణదర్శనలాలసలైనయాగోపికలఁ బ్రియసందేశముల నూరార్చుచు నిట్లనియె.

ఉద్ధవుఁడు గోపికలకుఁ గృష్ణసందేశంబు చెప్పుట.

గోపికలారా! భగవంతుఁడైనవాసుదేవునిపై మన మిట్టు లర్పించిన కతంబున మీరు కృతార్థలైతిరి. లోకపూజితలైతిరి. ధ్యానవ్రతతపోహోమజపస్వాధ్యాయనియమములను మఱియుఁ బలుదెఱంగులైనసత్కార్యములను నడపియుఁ గృష్ణునిపై భక్తి నలవరించికొన నరిది. మునులకును దుర్లభంబైనభగవద్భక్తిని మీరు భాగ్యమునఁ బడసితిరి. మీరు పతిపుత్త్ర

బాంధవదేహగేహాదులం ద్యజించి కృష్ణునిఁ బరమపురుషుఁగా వరించి యయ్యధోక్షజునిపై నేకాంతభక్తిఁ జేసితిరి. విరహనిమిత్తమున మీకు భగవంతునిమీఁదఁ గలుగుప్రేమ మిట్టి దని నాకెఱుకపఱుచుట నన్ననుగ్రహించుటయే. ఏను గృష్ణునకు రహస్యకార్యకరుఁ డైనపరిచరుఁడను. అమ్మహానుభావుఁడు మీకుఁ జెప్పఁ బంచిన సుఖావహం బైనసందేశముఁ దెచ్చితి. తత్ప్రకారంబు వినుఁడు. "చరాచరములందుఁ బంచభూతములరీతి ననుగతుఁడనై మనోబుద్ధీంద్రియముల కాశ్రయుఁడనై సర్వాత్ముఁడనై వర్తించు నావియోగము మీ కొకప్పుడుచుం గలుగదు. ఏను నన్నే యాత్మేచ్ఛం జేసి యాత్మమాయాప్రభావమున భూతేంద్రియగుణరూపమున సృజింతుఁ బాలింతు నుపసంహరింతు. ఆత్ముఁడు శుద్ధుఁడు గుణానన్వయుఁడు వ్యతిరిక్తుఁడు నయ్యు మాయాకార్యము లగుస్వప్నాదిమనోవృత్తులవిశ్వతైజసప్రాజ్ఞరూపములఁ దోఁచు. మేలుకాంచినవానికి స్వప్న మెట్టు లట్టులు మిథ్యాభూతంబులై బాధితంబు లైనయింద్రియార్థవిషయములఁ జింతించుచుఁ బురుషు నింద్రియములకుఁ జొనుపుమనస్సును దొలుత నిరోధింపఁ దగు. సాగరంబున నదులు సమాప్తి నొందువిధమున నీమనోనిరోధంబునందే సాంఖ్యయోగసన్న్యాసతపోదమసత్యంబు లనుసమామ్నాయంబు పర్యవసన్నంబు. ప్రియుఁ డైనయేను మీచూడ్కికి దవ్వున వసించుట మదనుధ్యానకాంక్షతో మనస్సునకు సన్నిధిసముత్కర్షంబుఁ గావించుతదర్థంబకాని యొండు గాదు. దూరతరవర్తి యగుప్రియతమునిపై నెట్టు లట్టులు స్త్రీచిత్తము సన్నిహితునియెడం బాఱదు. సర్వవృత్తులు విసర్జించి నాపై మనసుపెట్టి నన్నే చింతించుటంజేసి మీరు వేగంబ నన్నుఁ బొందుదురు. ఆరేయి నన్నుఁ జేరరాఁ గడంగియుఁ బతులు వారింపఁ జేయునది లేక యింట నిలిచినవారు సమాహితధ్యానమున నిన్నే పొంది" రని యిట్లు కృష్ణుండు మీకుఁ జెప్పి పుత్తెంచెనని యుద్ధవుండు సెప్పినం గోపిక లిట్లనిరి. యాదవులకుఁ గీడేరోయుపాపాత్ముఁ డైనకంసుఁడు దనకుఁ గూర్చువారితోడ భాగ్యమునం

చెఁగటారె. భాగ్యమున సర్వార్థములఁ బడసినయాప్తులతోడ నిప్పుడు
కృష్ణుండు కుశల మున్నవాఁడు. లజ్జాస్నేహలలితస్మేర వీక్షణముల నేమర్చిం
చినయచ్యుతుం డచ్చటఁ బురతరుణులకుఁ బ్రీతిఁగూర్చునే? రతివిశేషవిదుఁ
డైన యాప్రియుండు నాగరికనారీమణులప్రియవచనములను విలాసములను
నెట్లు దవ్వులకుండెడు? ఆపురసరోజనేత్రల గోష్ఠిం దేలుచు గోవిందుఁడు
కథాప్రస్తావమునఁ గ్రామ్యవనిత లగుమమ్మెప్పుడైనఁ దలంచునే? చల్లని
వెన్నెల నుల్లసిల్లుబృందావనంబున మాముచ్చటలు మచ్చికమై వినుచుఁ గాలి
యందెలు రవళింప నింపు సొంపార రాసక్రీడ మాతోడ నాడినయారేలు
కృష్ణుఁ డిప్పుడు దలంచునే? పర్జన్యుఁడు పయోధరముల వనముం బోలెఁ దన
వియోగమునం బొగులుమమ్ము నిజాంగముల బ్రదికింప దాశార్హుఁ డిటకు
విచ్చేయునే? పగఱఁ బరిమార్చి రాజ్యముఁ బడసినయవ్వీరుఁడు రాజకన్య
కలం బెండ్లియై సుహృదులతో నట సుఖించుఁగాని యిట కేల వచ్చెడు?
నిరాశత్వంబె పరమసౌఖ్యం బని తొల్లి స్వైరిణి యగుపింగళ పలికినదాని
నెఱింగియు మాకుఁ గృష్ణునిమీఁదికోర్కి విడువరాకుండెడు. కోరకుండినను
రమాదేవి తాన వలచి వచ్చి యెవ్వనియంగముఁ బాయకుండు నయ్యుత్తమ
శ్లోకుని వార్త నెవ్వండు త్యజింపఁ గలఁడు? రామునితోడఁ గూడి కృష్ణుఁ
డు దిరిగినయీసరిద్గిరివనప్రదేశంబులు నతనికాపు వడసినగోవులు నావేణునా
దములు నానందనందనుం బలుమాఱు దలఁపించెడు. లక్ష్మీనివాసంబు లైన
యతనియడుగులజాడలం గాంచి యే మతని మఱువ నోపము. తిన్ననినడ
వడిని లలితమందహాసమునను బ్రణయవిలోకంబునను దియ్యనిపలుకులను
జిత్తము తదాయత్తంబుగా నొం డెఱుంగని యే మెట్లు లతని మఱవ నేర్తుము?
ఓనాథా! రమానాథా! యార్తినాశనా! గోవిందా! వ్యసనార్ణవ
మున మునిఁగినగోకులంబు నుద్ధరింపు మని ప్రార్థించి గోపికలు కృష్ణసందేశ
శ్రవణంబున వియోగవేదనం బాసి యుద్ధవునిఁ గృష్ణునిఁగ నతని నాత్మని
గను భావించి పూజించిన నుద్ధవుండు కృష్ణలీలలఁ గీర్తించుచు గోపకాంత

లకు ముదముం గూర్చుచుం గొన్ని నెలలు గోకులంబున వసించె. కృష్ణచరిత శ్రవణవినోదమునం జేసి యుద్ధవుండు వసించినదివసంబు లన్నియు వ్రజవాసులకు క్షణమాత్రప్రాయంబు లయ్యె. కృష్ణావేశనిమిత్తమున నాప్రేతలదెంద ములం గ్రందుకొన్నతదాదిస్నేహవిక్లబత్వముం గాంచి యుద్ధవుండు పరమ సంతుష్టుండై వారికి మ్రొక్కుచుం దనలో నిట్లని చింతించె. సంసారభీతు లైనమునులును భక్తు లైనమేము నెద్దానిం గోరుదు మాగోవిందభక్తిని సర్వ విధముల గాఢముగం బడసినయాగోపికలజన్మంబకదా కృతార్థంబు. అనంతుని కథలపై ననురాగము గలవానికి శౌక్లసావిత్రయాజ్ఞికంబు లనుబ్రహ్మజన్మం బులు గలిగిన నేమి గలుగకుండిన నేమి? అడవులలోం దిరుగు వ్యభిచార స్వభావ లైనయీయాండువా రెక్కడ? పరమాత్ముం డైనకృష్ణునిమీంది గాఢ భక్తి యెక్కడ? తెలియనివాండేనియుం దన్ను సేవించిన నమృతమురీతి నీశ్వరుండు మేలు గావించెడు. రాసక్రీడావసరమున వాసుదేవునిబాహుదండ ములం గంఠాలింగనసుఖముం గన్నయీవల్లవాంగనల కొదవినమహాప్రసా దంబు నిత్యైకాంతరతి యగునిందిరాదేవికిని గమలగంధకాంతి నుల్లసిల్లు సుర సుందరులకునుం గలుగదు. తక్కినవారిని లెక్కింప నేల? త్యజింపరాని స్వజనమును ధర్మమునుం ద్యజించి శ్రుతిమృగ్యం బైనముకుందపదవిం గాంచిన యీవల్లవీమణులపాదరేణువులం బడయుబృందావనతరులతాగుల్మౌషధులలో నొక్కటిగా నేనియు నేంబుట్టుదు? ఆప్తకాము లైనయోగీశ్వరులును బ్రహ్మాదు లును శ్రీదేవియు నాత్మలో నర్చింపం బెంపారుహరిచరణారవిందమును గుచములం గౌంగిలించికొని తాపము విడిచి గోవిందకథాగానమున ముల్లోక ములకుం బవిత్రతం గావించుగోపికలపాదపరాగంబునకు మ్రొక్కుదు నని తనలో ధ్యానించి యుద్ధవుండు వల్లవపల్లవపాణులను యశోదను నందుని గోపాలకుల నెల్లను వీడుకొని మగిడి మధుర కేతేరం దే రెక్కె. అట్టియెడ నం దాదులు పలువిధము లైనకానుకలు వెట్టి యనురాగమున నశ్రుపూరంబు గన్నులం గ్రమ్ము దేర నిట్లనిరి. మహాత్మా! మామనోవృత్తులు కృష్ణపాదారవింద

ముల నాశ్రయించెడు. వాగ్వృత్తులు తన్నామధేయములఁ గీర్తించెడు. కాయవృత్తులు తన్నమస్కారాదులఁ బ్రవర్తించెడు. కర్మానుబంధమున నీసంసారమునఁ బరిభ్రమించుమాకేజన్మమందైన నీశ్వరానుగ్రహమునఁ జేసి మంగళాచారములను దానములను గృష్ణునిపై రతి గలుగుఁగాక యని పలుకుచుఁ గృష్ణభక్తిపరత్వంబునఁ బూజించినఁ దత్పూజలఁ గొని యుద్ధవుండు మధువైరిపాలితంబైనమధురానగరంబునకుఁ జనుదెంచి కృష్ణునకుఁ గానుపించి మ్రొక్కి వ్రజవాసులభక్త్యుద్రేకము లెస్స వివరించి వారు వెట్టినకానుకల రామకృష్ణులకు సమర్పించె.

కృష్ణుఁడు కుబ్జయింటికిఁ జని దానికిఁ బ్రీతిఁ గావించుట.

అట సర్వాత్ముఁడు సర్వదర్శనుఁడు నగుభగవంతుఁడు కామసంతప్తయైనకుబ్జయభిప్రాయం బెఱింగి దానికిఁ బ్రియ మాపాదించువాఁడై యుత్తమగృహోపకరణములను గామోద్దీపకంబు లైనచిత్రరుపులను ముక్తాహారచారుకేతనంబులను వితానశయనాసనంబులను నిండి సురభిధూపదీపచందనమాలికాములఁ బరిష్కృతం బైనదాసిగృహంబున కుద్ధవసమన్వితుండై యరిగె. తనయింటికి విచ్చేయుచున్న యన్నలినలోచనుం గాంచి యాదాసి తత్తఱంబున లేచి చెలులతోడ నెదురేగి యప్పరమపురుషుని దోడితెచ్చి యుత్తమాసనమున నాసీనుం జేసి పూజించి యుద్ధవునకుం దద్విధానంబునఁ బూజ గావింప నాతం డయ్యాసనము చేత నంటుచుఁ గృష్ణసన్నిధిం గ్రిందఁ గూర్చుండి తత్పూజల నంగీకరించె. అంతఁ గృష్ణుండు లోకవిడంబనం బనువర్తించి యుత్తమంబైనక్రొత్తపాన్పునొద్దకుఁ జనుటయు నవ్వనజాక్షి జలకమాడి కట్టితొడిగి పూసి పువ్వులు దుఱిమి తాంబూలచర్వణం బొనర్చి యమృతోపమం బైనయాసవం బాని యెల్లవిధములం గైసేసికొని వచ్చి లజ్జాలలితలీలాస్మితవిలసితవిలోకితములం గటాక్షించుచు ముకుందుచూడ్కి

కగపడ నొకయోర నిలిచె. క్రొత్తకూటమిం బొటిల్లుసిగ్గుపెల్లున జంకి దఱిసి రాక యించుకదవ్వు గలుగ నిలుచున్న యన్నెలఁతకంకణాలంకృతకరంబు వట్టి చేరఁ జీరి శౌరి మున్ను మైపూఁత యొసఁగి యాభాగ్యము గన్న యన్నాతిం బాన్పుపయిం జేర్చి రమించె. ఆరమణి రమారమణుపాణిపల్లవములను మదనతాపమున ప్రేఁగుకుచములందు నురమ్మునందుఁ గన్నుదోయిపయిం బెట్టికొని మూర్ఛఁగొని యత్తాపంబు వాసి స్తనాంతరగతుం డైన యక్కాంతు నానందమూర్తిం గౌఁగిలించికొని మదనవేదనల విస్తరించె. అలభ్యుఁ డైనకైవల్యనాథు నంగరాగసమర్పణంబునం బొంది యామందభాగ్య యో ప్రియతమా! నాతో నింకఁ గొన్నినాళ్లు వసించి రమింపుము. నిన్ను విడువఁ జాల నని కామసుఖంబే తుచ్ఛమతియై కోరెఁ గాని యాసర్వేశ్వరు నెద్దానిం గోరఁ దగు నప్పరమార్థముం గోరదయ్యె. దాని నుపలాలించి కామసుఖములఁ దేల్చి దేవకీసూనుం డట నుద్ధవునితోడ నగరికిఁ జనుదెంచె.

ఉత్తర రామాయణము.

తృతీయాశ్వాసము.

ఉత్తరరామాయణమును రచించినకవి కంకంటి పాపరాజు. ఈయన నెల్లూరుమండలవాసి. ఆఱువేలనియోగి బ్రాహ్మణుఁడు. అనర్గళకవితాధార గలవాఁడు. శబ్దాలంకారములు మెండుగ నిండుండును. కథ ననుసరించి విచ్చలవిడిగా గ్రంథ మిది పెంచి వ్రాయఁబడినది. కవిబ్రహ్మయగు తిక్కన సోమయాజి నిర్వచనముగా దీనిని జిన్నతనమున వ్రాసెను. అంతకన్న నిది ప్రౌఢమైనది.

కఠినపదముల కర్థాదులు.

ప. 1. నృపాల...చ్ఛటా=సముదాయము, దవాగ్ని = అడవులను గాల్చునగ్ని

ప. 2. బిట్టాగి=బిట్టు+ఆగి, బిట్టాగి, చక్కఁగా నడ్డగించి, అడవిదిర గుడుల్=వానరములు, లయాంబుదము=ప్రళయకాలమేఘము.

ప. 3. యశోజితతారుఁడు=కీర్తిచే జయింపఁబడిన నక్షత్రములుకల వాఁడు, రావణుఁడు=విశేషధ్వని చేయువాఁడు.

ప. 4. సమరక్రీడాభీలత=యుద్ధమను నాటయందలి దారుణత్వమును.

ప. 5. పరమేశ్వరుఁడు=పరదైవము.

ప. 6. కీకసావళుల్=ఎముకలగుంపులు, చతురబ్ధులు=నాల్గుసముద్రములు, ద్విగుసమాసము. అబ్ధి=నీరును ధరించునది. వ్యు.

ప. 8. మహి...మాల్-మహిత=శ్రేష్ఠమైన, అహి = వాసుకియను, గుణ=త్రాడుచేత, వేష్ట్యమాన = చుట్టఁబడిన, ఉరుమంథానమహీధర=గొప్ప మంథరపర్వతము, మాయా...కీలి = మాయామిలోనగు రాక్షసమాయాకాననములశోషిల్లఁజేయుట యనునాటయందు భయంకరదావాగ్నిజ్వాల, పాద... శైలి-పాదప=వృక్షములు, వ్రేళ్లచే నీటిని గ్రహించునని. వ్యు. నక్షత్రపాళి=నక్షత్రములవరుస.

ప. 9. ఉదధి=ఉదమనఁగా నీరు, దానిని ధరించునది.

ప. 11. మార్తాండుఁడు=మృతమైనట్లున్న లోకము నుద్ధరించువాఁడు. కాంచనాద్రి=మేరువు, బాడబాగ్ని=సముద్రమున నడుగుననున్న యగ్ని, యామ్యప్రతాపము=యమసంబంధశౌర్యము, శోణము-ఎఱ్ఱనైన.

ప. 12. శాఖామృగమాత్రుగా=వానరమే యని.

ప. 13. కకుత్తుదలనె=కనుఁగొనలచేతనే,పయోధులు=సముద్రములు.

ప. 14. ఆశరుఁడు=రాక్షసుఁడు, (రావణుఁడు) హరి=సింహము, యముఁడు, ఇంద్రచంద్రాదులు. నానార్థము.

ప. 15. అమేయబలము=చెప్పసాధ్యముగానిశక్తి, వేల్పులు-వికృతి. విబుధము-ప్రకృతి. అమ్మకచ్చ=ఆశ్చర్యార్థకము.

ప. 16. చిలువ=సర్పము, పన్నగారి=గరుడుఁడు

ప. 17. ప్రత్యగ్రజంఝానిలము=క్రొత్తయోరగాలి.

ప. 18. తోయదము=మేఘము, నీరునిచ్చునది వ్యు. నియమధూర్వహమతి=నియమభారముగల బుద్ధిగలవాఁడు.

ప. 19. అలవోక=అలజడినొందక.

ప. 20. హా!=ఆశ్చర్యార్థకము, పీతాహంక్రియాద్ధత్యుఁడు=పోయిన గర్వోద్రేకము గలవాఁడు.

ప. 21. గాద్గద్యంబు=డగ్గుత్తికపడుట, నిట్టూర్పులు=నిడుఊరుపులు.

ప. 22. నిరపాయదయాఢ్యుఁడవు=అపాయములేని దయతోఁగూడినవాఁడవు.

ప. 23. ఖడ్గంబు= శూలాయుధము, దిక్పాలశ్రేణి=ఇంద్రాగ్ని యమ నిర్ఋతి వరుణ వాయు కుబేరేశానులు. కక్షాంతరాళంబునన్=చంకలసందున.

ప. 24. లవంబు=లేశము, ప్లవంగము=ఎగురుచు నడచుస్వభావము గలది. వ్యు. పుంగవా=శ్రేష్ఠార్థము నిచ్చును.

ప. 25. నరభోజి=మనుష్యభక్షకుఁడు.

ప. 26. జగద్బాంధవసుతున్=సూర్యపుత్రుఁడగు సుగ్రీవుని.

ప. 27. మాసముదారతన్=ఐశ్వర్యసమృద్ధిచేత.

ప. 28. కృతవీర్యాత్మజున్ = కార్తవీర్యార్జునుని, రేణుకాసుతున్= పరశురాముని.

శ్రీమదాంధ్రమహాభారతము

ఉద్యోగపర్వము—తృతీయాశ్వాసము.

ఇది కవిబ్రహ్మయగు తిక్కన సోమయాజిచే రచింపఁబడినది. విరాట పర్వమునుండి పదునేనుపర్వము లీకవి తెనిఁగించెను. ఈయననివాసము నెల్లూరు. నిర్వచనోత్తరరామాయణము రచించినది యీకవి బాల్యమునందు. అప్పటి కీయన యజ్ఞము చేయలేదు. కాఁబట్టి తిక్కన యనిపేరు. భాస్కర రామాయణమును రచించినమహాకవి భాస్కరుఁడు ఈయనతాత.

ప. 3. సూర్యసూనుఁడు=కర్ణుఁడు

ప. 7. కౌరవ్యులు=కురువంశజనితులు, రాజునకుంగూఁతుఁ=దుర్యోధనునకుఁ గావలసినవాఁడవు.

ప. 8 ఉపేంద్రుఁడు=కృష్ణుఁడు.

ప. 10. ముకుద్రాట=ముక్కునకుఁ గట్టుదారము.

ప. 14. పల్లవము=చిగురుటాకు.

ప. 19. ఓజమై = వరుసగా, పుండరీకాక్షుఁడు=తెల్లఁదామరలవంటి కన్నులు గలవాఁడు, చతుర్విధహృద్యాన్నము = భక్ష్యభోజ్యలేహ్యచోష్యములను నాలుగువిధములుగా నైనయాహారములు.

ప. 38. జనార్దనుఁడు=శత్రువులబాధించువాఁడు, నగధరుఁడు= కృష్ణుఁడు, గోవర్ధనము నెత్తినవాఁడు.

భాస్కరరామాయణము

అరణ్యకాండము—ద్వితీయాశ్వాసము.

ఈకవి రామాయణకవులలో మొదటివాఁడు. తిక్కన సోమయాజి తాత. రామాయణము నింత మనోహరముగా నెవ్వరును వ్రాయఁజాలరు. రామాయణమున కిది చక్కని తెనుఁగుకాదు. ఐనను కవిత్వము నిరుపమానము.

ప. 1. భర్మనిర్మిత=బంగారుచేఁ జేయఁబడిన, శలాకల=చక్కని కడ్డీలు, గొరిజలు=గిట్టలు, కనకకేసరాంకుర=బంగారు కింజల్కముల మొలకల వంటి, రోమకాంతి=రోమముల కాంతి.

ప. 2. నెలలోనియిఱ్ఱికిన్=చంద్రునిలోనున్న లేడికి, నీలకంఠుఁడు=శివుఁడు, క్రొమ్మించులు=క్రొత్త+మించులు, క్రొత్తప్రకాశములు. క్రొత్త+కారు=క్రొక్కారు, త్రిభువనములు=స్వర్గమర్త్యపాతాళములు.

ప. 4. ధరణీసంజాత=సీతాదేవి, కాననాంతము=అరణ్యముచివర.

ప. 5. ఖురపుటములన్=గిట్టలచివరలచేత.

ప. 6. సారంగంబున్=లేడిని, ఏనుఁగు, చాతకము, తుమ్మెద అని నానార్థము.

ప. 7. అసుర=సురను నిషేధించినవాఁడు, సమాసముకాని యపుడిది స్త్రీసమముగా నుండును. అగ్రజుఁడు=ముందు జన్మించినవాఁడు (అన్న).

ప. 10 కరువునన్=కరుగుటచేత, గండరువునన్ = పడియచ్చుచేత, ఇనచంద్రరుచులన్=సూర్యచంద్రుల కాంతులను.

ప. 13. మృగలోచన=లేడికన్నులవంటి కన్నులుగలసీత, అనురా... భాసి=ప్రేమతోఁగూడిన తాత్పర్యమునఁబుట్టిన ప్రకాశముచే మెఱయుచు.

ప. 15. విన్నఁబోవుచు=దైన్యముతోఁగూడి, ఇంతయెఱుంగమి = ఇంతటి ప్రమాదము.

ప. 16. విలునమ్ములు=సమాసమున విలు, అని యగును. సమాసము కానిచో విల్లు అని.

ప. 18. వసుమతి = భూమి, రత్నములుగలది. వ్యు. అతులచపలమతులు=విశేషచాపల్యచిత్తములుగలవారు.

ప. 20. కాంతారము=కారడవి.

ప. 22. అలఁతికిఁజేరినన్=పట్టసమీపింపఁగా.

ప. 28. తోరంపుటీరంబు = దట్టమగుపొద, ఆమృగవ్యాధరుద్రుఁడో=మృగములవెంట బోయవేషమునఁబోవు నాశివుఁడా.

భాస్కర రామాయణము

సుందరకాండము.

ప. 1. చరణాగ్రమునన్=బొటనవ్రేలుచేత, (కైలాసమును రావణుఁ డెత్తినపు డీశ్వరుఁడు బొటనవ్రేలుచే నదుమఁగా రావణుఁడు భంగపడియె నని గాథ.) అని నిన్ను...పరశురాము=యుద్ధమున నిన్ను బంధించిన కార్తవీర్యునిం జంపిన పరశురాముని, ఆజి=యుద్ధము.

ప. 3. దోస్స్తూణా...ములు = స్తంభములవంటి బాహ్వగ్రములచే వదలఁబడిన బంగారుపిడులరాపిడిచేఁ బుట్టినమిడుంగురుల సముదాయముల యొక్క గొప్పమంటలుగల బాణములు.

ప. 6. అజునివరము=బ్రహ్మవరము.

ప. 7. ఇనజుఁడు=సుగ్రీవుఁడు.

ప. 8. కాలపాశము=యమపాశము, శిరో...తంబు=తలపై బిడుగుపాటు, కాలాహి=త్రాఁచు, కన్యాకారాగతమృత్యువు = కన్యారూపముగా వచ్చిన మృత్యుదేవత.

ప. 9. కోపస్ఫీతానలశిఖలు = కోపాతిశయమను నగ్నిహోత్రజ్వాలలు.

ప. 10. కుటిల ..డై=వంకరగానున్న కనుబొమలచే భయంకరమైన పదినొసళ్లచేత దారుణమగు గొప్పముక్కురంధ్రములచేత వాఁడియై వ్రేలాడు పెదవిచేత,...

ప. 12. కశాఘాతము=కొరడాదెబ్బ, ముండనము=క్షౌరము, అంగకర్తనము=దేహములో నొకభాగమును ఛేదించుట, అంకము=కాల్చినగుఱుతు పఱచుట.

ప. 14. నక్తంచరులు=రాక్షసులు, రాత్రిసంచరించువారు. వ్యు.

ప. 15. ఉద్ధతిన్=గర్వముచేత.

భాగవతము

సప్తమస్కంధము.

ఆంధ్రభాగవతమును రచించినమహాకవి బమ్మెరపోతనామాత్యుఁడు. కడపమండలములోని యొంటిమిట్ట ఈయననివాసము. ఒంటిమిట్టకు ఏకశిలానగరమను నామాంతరముగలదు. ఈమహాకవి వీరభద్రవిజయమును రచించినట్లు ప్రతీతిమాత్రము గలదు. అది యాయనచే రచింపఁబడలేదని కొందఱందురు. భోగినీదండకము పోతన చిఱుతకాలములో రచించెను. ఈయన వేంకటగిరిరాజాస్థానమందుండినట్లు జనశ్రుతిగలదు. కాని యాయన రాజాశ్రయణము నభిలషించువాఁడు కాఁడని భాగవతమే వెల్లడిఁ జాటుచున్నది. ఈమహాకవి వంశస్థులు కడపమండలములోనున్న కొమ్మద్దియనుగ్రామమున నుండినట్లును, అందుండి కామలాపురమునకు సమీపమందున్న కోడూరులోఁ గొంతకాల ముండినట్లును, అప్పుడు బమ్మెరయను నింటిపేరుపోయి కొమ్మద్ది వారైనట్లును ఇటీవల కోడూరులో లభించిన తాళపత్రగ్రంథము 'సూక్ష్మతను విద్యావిలాస' మనుదానినుండి తెలుచున్నది. ఈకవియేకాక వీరి తర్వాతి వారుకూడ కవులయినట్లు స్పష్టమగుచున్నది.

ప. 1. భృత్యుఁడు=భృతియనఁగా కూలి, దానివలన జీవించువాఁడు.

ప. 3. విషయసంపన్నుఁడు = విషయాభిలాషలుగలవాఁడు, పంచేంద్రియములు = త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణములు. హతాన్యతంత్రుఁడు= నశింపఁజేయఁబడిన యితరకృత్యములు గలవాఁడు.

ప. 5. వృత్తబంధంబులన్ = పద్యములయందిమిడించుటచేత.

ప. 6. ఫణిపతికిన్=ఆదిశేషువునకు, భాషాపతికిన్=బ్రహ్మకు, భాషా=శారదాదేవి.

ప. 8. చొక్కి=పరవశత్వమునొంది, జడతలేకయు = నిశ్చేష్టుఁడు కాకుండియు.

ప. 9. పానీయంబులు=మంచినీరు.

ప. 10. అశ్రాంతము = ఎల్లప్పుడు, నలినాక్షుఁడు = పద్మాక్షుఁడు (విష్ణువు). ప్రణయహర్ష జనితబాష్పసలిలమిళితపులకుండై =ప్రేమానందముచే జనించిన కన్నీటితోఁగూడిన గగుర్పాటుగలవాఁడై.

ప. 11. అతిరేకము=అతిశయము, నిర్వాణభావంబు=మోక్షభావము, అప్రమత్తుఁడు=పొరపాటులేనివాఁడు, మహాభాగధేయుండు=గొప్ప యదృష్టముగలవాఁడు, కర్మబంధలతాలవిత్రుండు = కర్మబంధములను తీఁగెలకుఁ గొడవలివంటివాఁడు.

ప. 13. ప్రభావిశాలుర్=మాహాత్మ్యముచే గొప్పవానిని, కృపాలుర్ దయగలవానిని, సా...ఘాలుర్=సజ్జనులయు, గురువులయు సముదయము యొక్క పాదములయందు వంచఁబడిన నొసలుగలవానిని, విఖం...జాలు = నశింపఁజేయఁబడిన మోహాలతాసంతతిగలవానిని, చెప్పవే=చెప్పుమా. ఇట ప్రార్థనార్థక క్రియ, చెప్పుము + ఏ అని పదవిభాగము.

ప. 15. సభ్యత్వంబునన్=శాంతముచేత, జాడ్యంబుతోన్=జడత్వముతో, తీవ్రమతి=సూక్ష్మబుద్ధిగలవాఁడు, దైత్యేభ్యుండు=రాక్షసశ్రేష్ఠుఁడు, సోత్కంఠుఁడు=ఉత్సాహముతోఁ గూడినవాఁడై.

ప. 16. సదసద్వివేకచతురత = మంచిసెబ్బరల నిర్ణయించు నేర్పు, తండ్రీ = ఇది ఆదరార్థబోధకము.

ప. 18. అస్మత్ప్రా...గంధము=నా శౌర్యకథావాసన, మనోబంధుల్ = అంతరంగమిత్రములు. రక్షింపరే-ప్రార్థనార్థక క్రియ.

ప. 19. సహాధ్యాయులు=కూడఁజదువువారు.

ప. 20. పఠింపించిరి=ప్రేరణార్థక క్రియ.

ప. 21. నిరూఢమనీషన్=నిశ్చితబుద్ధిచేత.

ప. 22 శంకా...డై=అనుమానముతోఁగూడిన మనస్సుగలవాఁడై, భ్రాంతుఁడు=ఏమియు నెఱుఁగని నాకొడుకని భావము, విద్యాపరిశ్రాంతి=విద్యయందుఁ జేయఁబడినకృషి, సౌధము = మేడ, సున్నముచేఁ గట్టఁబడినది. వ్యు.

ప. 23. భవ...తారకుఁ = సంసారసముద్రమును దరింపఁజేయువానిని, కామరోష...రకుఁ=కామక్రోధలోభమోహమదమాత్సర్యములను నంతశ్శత్రువులనాఱుగురను దొలఁగఁదోలువానిని, కలుష...రకుఁ=పాపరాసులనేమహాభీతిని గలిగించు నడవులకు గొడ్డలివంటివానిని.

ప. 25. ఉద్యోగము = ప్రయత్నము, ఆరూఢసంవిత్సంపన్నుఁడవు=నిశ్చితజ్ఞానముతోఁ గూడినవాఁడవై, ఉత్సంగాగ్రము=తొడపైన.

ప. 31. హరియంచుఁ గిరియంచు-గిరియనునది నిందార్థకము.

ప. 33. అసద్గ్రాహ్యము=దుర్జనులచే నంగీకరింపఁబడినది.

ప. 34. జిజ్ఞాసాపదమందుఁ-జిజ్ఞాస=తెలియునిచ్ఛ.

ప. 35. అయస్కాంతము=సూదంటురాయి.

ప. 36. తరంగిణులు=నదులు. రసాలపల్లవఖాది = తీయమామిడిచెట్టు చిగురాకును దినునట్టిది, కుటజములు=గిరిమల్లికలు, సాంద్రనీహారము=దట్టమగుమంచు.

ప. 38. పంచశరద్వయస్కుఁడవు=ఐదుసంవత్సరముల ప్రాయముగలవాఁడవు, సౌదలల్ = శిరస్సులు.

ప. 39. దైత్యచందనవనమందుఁ= రాక్షసులనే శ్రీచందనములుగల తోఁటయందు, కంటకయుతక్షితిజాతము = ముండ్లచెట్టు.

ప. 40. దనుజకుంజర = రాక్షసేంద్రా, కుంజరశబ్ద మిట శ్రేష్ఠవాచకము. వింటే=వింటివే అని మొదటిరూపము.

ప. 42. వర్గత్రితయము=ధర్మార్థకామములు.

ప. 43. అన్న-ఇది ఆదరార్థబోధకము.

ప. 46. అంభోజగర్భాదులు=బ్రహ్మాదులు, పుంభావము=పురుషరూపము

ప. 47. నీతిపారగుఁడు=నీతిశాస్త్రమునఁ బండితుఁడు.

ప. 48. చుబుకంబు బుడికి=గడ్డము దువ్వి.

ప. 53. తనుహృద్భాషలఁ=దేహమనోవాక్కులచేత.

ప. 54. కృతఘ్నావళీబంధుత్వంబులు = కృతఘ్నులతోఁ జుట్టరికములు, భస్మహవ్యములు=బూడిదలో హోమములు.

ప. 56. పవనగుంఫితచర్మభస్త్రి = గాలిచే నింపఁబడిన తోలుతిత్తి, తరుశాఖనిర్మితదర్వి=కఱ్ఱచేఁ జేయఁబడిన గరిటె. తనుకుడ్యజాలరంధ్రములు=దేహమనేగోడయందుండు కిటికీలరంధ్రములు, తరళసలిలబుద్బుదము=చంచలమగు నీటిబుగ్గ.

చెన్నపురి: వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1936.